పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగులకు సమూలంగా వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు
జాతీయ తెలుగు దిన పత్రిక
website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com
Published from mahabub nagar సంపుటి :25 సంచిక :36 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు ఆదివారం 14 జూన్ 2026 పేజీలు :12 వేల రూ5 /-

## మంచిర్యాలలో సింగరేణి
# కారుణ్య నియామకాలు..
### 335 మందికి ఆర్డర్లు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి

**మంచిర్యాల, జూన్ 13:** మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఇవాళ కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం



చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబాలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై
## కేటీఆర్ ఫైర్..
# కార్యకర్తలకు దిశానిర్దేశం

-సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం
-కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
-తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి
-ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరతపై విమర్శలు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా - మిగతా3లో

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..
### తుమ్మల ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా వివరాలు సేకరించిన సిట్



**హైదరాబాద్, జూన్ 13:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈరోజు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయపరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంతమంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## వీబీజీ రాంజీ స్కీంపై కేంద్రానికి
# వ్యతిరేకంగా లేఖ రాస్తాం
**: మంత్రి సీతక్క**



**హైదరాబాద్, జూన్ 13** : కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మీ, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క ఈరోజు (శనివారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు.

**కేబినెట్‌లో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం..**

ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంభిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మెటివ్ పద్ధతిలో పని దినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధికి బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్‌ను తొలగించాలని అన్నారు. పంట సీజన్ కాలంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వివరించారు. ఆ సమయంలోనే - మిగతా3లో

## కోవర్టుల సంగతి
# తేలుస్తాం..

వ్యవహారాన్ని రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు: మహేశ్ గౌడ్
మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ
ఆమెకు సంబంధించిన వివరాలను లీక్ చేసిన తెలంగాణ కాంగ్రెస్ నేత
అంతర్గత విచారణ ప్రారంభమైందన్న మహేశ్ గౌడ్




మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ - మిగతా3లో

# తెలంగాణ, ఏపీలో వాన బీభత్సం



**హైదరాబాద్, విశాఖపట్టణం, జూన్ 13:** తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శుక్రవారం సాయంత్రం నుంచే తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షం మొదలైంది. హైదరాబాద్? వాతావరణ శాఖ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తం చేసింది. ముఖ్యంగా అర్ధరాత్రి వరకు ఉరుములతో కూడిన భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. మహబూబాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, యాదాద్రి జిల్లాల్లో వాన తీవ్రత అధికంగా ఉంది. ఈ జిల్లాల్లో గంటకు 60కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మిగిలిన జిల్లాలకు కూడా వర్ష సూచన ఉండటంతో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**హైదరాబాద్‌లో రోడ్లన్నీ జలమయం**

హైదరాబాద్ మహానగరంలో - మిగతా3లో

## ఎస్ ఐ ఆర్ రాజకీయ పార్టీల
# సహకారం కోరిన సీఈఓ

**హైదరాబాద్, జూన్ 13:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) 2026 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారాన్ని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయడమే కాకుండా, జాబితాలోని అవకతవకలను తొలగించి, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే తమ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో, జూన్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ ప్రక్రియ విధివిధానాలను వివిధ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఇంటింటి సర్వే, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, జూలై 31న ముసాయిదా జాబితా ప్రచురణ, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా విడుదల వంటి వివిధ దశల గురించి అధికారులు పవర్ పాయింట్



ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు - మిగతా3లో

## భారీ వర్ష సూచన..
# CURE పరిధిలో హై అలర్ట్
## సీఎం రేవంత్ రెడ్డి....

**హైదరాబాద్, జూన్ 13:** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ **(CURE)** పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు.

శాఖల మధ్య సమన్వయం అవసరం



ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య - మిగతా3లో

## సంపాదకీయం

# టాలీవుడ్ కు ఏమైంది...

తెలుగు సినీ పరిశ్రమ సంక్షోభంలో ఉంది. ఏడాదిగా నిర్మాతకు నికరంగా లాభాలు మిగిల్చిన సినిమా లేదంటే అతిశయోక్తి కాదు. వందల కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న సినిమాలు.. రిలీజ్ ఎప్పుడో తెలియని దుస్థితిలో ఉన్నాయి. దీంతో నిర్మాతకు రిలీజ్‌కు ముందే చుక్కలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఏడాది జరిగితే.. సీజీ వర్క్‌కు రెండుమూడేళ్లు తీసుకుంటూ.. ఏళ్ల తరబడి సాగదీస్తున్నారు. అంత టైమ్ తీసుకున్న సినిమాలు కూడా రిలీజయ్యాక.. సీజీ వర్క్ బాగాలేదనే టాక్ తొలిరోజే బయటికొస్తోంది. ఇలా వందల కోట్ల బడ్జెట్లు.. ఏళ్ల తరబడి షూటింగులతో సినిమా రిలీజ్ కు ముందే నిర్మాతలు మునిగిపోతున్న దుస్థితి టాలీవుడ్‌లో కనిపిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో పడింది. గడిచిన ఏడాదిలో అసలు హిట్ మాటే వినలేదంటున్నారు. ఇంకా మాట్లాడితే పుష్ప 2 తర్వాత నిర్మాతలకు నికరంగా డబ్బులు మిగిల్చిన సినిమా లేదని టాలీవుడ్ నిట్టూరుస్తోంది. సినీ పరిశ్రమలో చిన్న నిర్మాతలు ఎప్పుడో మునిగారు. పెద్ద నిర్మాతల స్థితి కూడా పైన పటారం. లోన లొటారంలా ఉంది. చివరకు అమెరికాలో సంపాదించిన డబ్బులతో సినిమాలు తీసే నిర్మాతలు కూడా మునిగిపోతున్నారు.తెలుగు సినీ పరిశ్రమలో మొదట్నుంచీ విజయాల శాతం తక్కువే. ఎన్నో లెక్కలు వేసుకుని.. ఎంతో జాగ్రత్తగా తీసే సినిమాలే ఆడతాయని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అలాంటిది అసలు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా.. గాల్లో లెక్కలు వేసుకుని తీసే సినిమాల గురించి చెప్పాల్సిన పనే లేదు. మొదట్లో కథల ఎంపిక కోసం ఏళ్ల తరబడి చర్చలు జరిగేవి. ఒకసారి కథ తయారయ్యాక కూడా 24 విభాగాల వారి సలహాలు తీసుకునేవారు. అలా బాగా నలిగిన, మార్పులు చేర్పులు చేసిన కథనే తెరకెక్కించేవారు. అలాగే కథకు తగ్గట్టుగా నటీనటుల ఎంపిక ఉండేది. కాంబినేషన్ల కోసం ఆరాటం, క్రేజ్ ఉన్న నటులే ఉండాలనే జంఝాటం ఏమీ ఉండేవి కాదు. పెద్ద హీరోలు అడిగినా కూడా.. ఈ కథ మీకు సరిపడదని నిర్మాతలు, దర్శకులు నిర్మొహమాటంగా చెప్పేసేవారు. ఎందుకంటే అప్పుడు కథే హీరో. సినిమాకే సింహాసనం. నటీనటులు, మిగతా వారికి ఎక్కువ ప్రాధాన్యత లేదు. ఆ రోజుల్లో ఓ సినిమాకు ప్రేక్షకుల ఆదరణ దక్కితే.. దాన్ని మిగతా భాషల్లోనూ డబ్ చేసేవారు. అప్పుడు డబ్బింగ్ రైట్స్ రూపంలోనూ డబ్బులొచ్చేవి. కొన్ని సినిమాలు నేరుగా పెట్టుబడి తేలేకపోయినా.. డబ్బింగ్ రైట్స్ తో నిర్మాతలు గట్టెక్కిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితే లేదు. కాంబినేషన్ల కోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు.తెలుగు సినిమాకు హంగులు, ఆర్భాటాలు చాలా ఎక్కువయ్యాయి. మార్కెట్ కూడా పెరిగిందని కొన్ని హిట్ సినిమాల కలెక్షన్లు చూపించి గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ ఏం మారినా.. విజయాల శాతం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. ఏటా వందల సినిమాలు రిలీజ్ కావడమే కానీ.. డబ్బులు తెచ్చే సినిమాలు మాత్రం కనిపించడం లేదు. అడపాదడపా హిట్టయ్యే సినిమాల గురించి చెప్పుకోవడమే కానీ.. రెగ్యులర్‌గా లాభాలు మాత్రం రావడం లేదు. ఇప్పటికే సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల ప్రభావం చూచాయగా కనిపిస్తూనే ఉంది. కాకపోతే నిర్మాతలు మాత్రం కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది కాబట్టి.. పైన పటారం.. లోన లొటారం స్థితిని మెయింటైన్ చేస్తున్నారు. అమెరికాలో 10-20 ఏళ్ల పాటు డబ్బులు సంపాదించుకుని.. ఆ డబ్బులు పెట్టి సినిమాలు తీస్తున్న ఎన్నారై నిర్మాతలు కూడా నిండా మునుగుతున్నారు. వీరు మొదట పరిమిత స్థాయిలో సినిమాలు తీసి.. కాస్త లాభం కనిపించగానే.. నలుగురైదురు హీరోలు, డైరక్టర్లకు అడ్వాన్సులిచ్చి అడ్డంగా బుక్కైపోతున్నారు.ఒకప్పుడు స్క్రిప్ట్ పూర్తయ్యాక, నటీనటుల డేట్స్ అన్నీ కుదిరితేనే దర్శక-నిర్మాతలు సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేవారు. రానురానూ మార్పులు వచ్చాయి. షూటింగ్ మొదలయ్యే ముందు కూడా సన్నివేశాలు రాసుకుంటూ కూర్చోవడం వల్ల సినిమా వ్యయపెరిగిపోవడమే కాకుండా, నాణ్యతా దెబ్బతింటోందని సీనియర్ నటులు, రచయితలు వివిధ ఇంటర్వ్యూల్లో చెప్పారు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత మరింత మెరుగు కోసం చిన్న చిన్న మార్పులు చేసుకోవచ్చు కానీ, అప్పటికప్పుడు కొత్త సన్నివేశాలు రాయడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కొన్నిసార్లు కారణమవుతోంది. ఇక సృజనాత్మకత పేరుతో దర్శకులు వేయించే సెట్లు, అనవసర హంగులు, విదేశీ ప్రయాణాలు.. ఇవన్నీ నిర్మాణ వ్యయాన్ని తడిసి మోపెడు చేస్తున్నాయి. ఇవన్నీ నిర్మాతలపై మోయలేని భారం మోపి.. అంతిమంగా టాలీవుడ్‌కి తీరని నష్టం చేస్తున్నాయి. సినీ పరిశ్రమకు ఎవరో పని గట్టుకుని నష్టాలు తేవడం లేదు. స్వయంగా చిత్ర పరిశ్రమే చేజేతులా సంక్షోభాన్ని కొనితెచ్చుకుంటోంది. ఇప్పటికే సగం మునిగింది. కనీసం ఇప్పటికైనా మేలుకోకపోతే.. నిండా మునిగే ప్రమాదం లేకపోలేదు. అనారోగ్యకర పోకడల్ని మొదట్లోనే తగ్గించుకునే ప్రయత్నం చేస్తే.. పరిస్థితి ఇక్కడదాకా వచ్చేది కాదు. కానీ పెడ ధోరణుల్ని ట్రెండ్ గా, కొత్త తరహా మార్కెటింగ్ సూత్రాలుగా చెప్పుకుని అదే ఒరవడిలో కొట్టుకుపోతున్నారు. ఎవరైనా సీనియర్లు సలహాలివ్వబోయినా.. వినిపించుకోవడం లేదు. అదేమంటే కాలం మారిందని చెబుతూ.. తెలుగు సినిమాని చేజేతులా చంపేయటానికి కంకణం కట్టుకున్నారు. కనీసం తెలుగు సినిమాల్ని ఓటీటీలు కూడా ఎందుకు కొనడం లేదని ఎవరూ ఆలోచించడం లేదు. ఇప్పటికైనా టాలీవుడ్ ఆత్మావలోకనం చేసుకోకపోతే.. రాబోయే రోజుల్లో తెలుగు సినీ పరిశ్రమ ఒకటుండేది అని చెప్పుకోవాల్సి వస్తుందేమో. అందుక ఇకనైనా ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకునే ప్రయాస మానేసి.. అందరూ కలిసి సమష్టి బాధ్యత తీసుకుంటే కానీ.. తెలుగు సినిమా పరిశ్రమ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు.

# ఏపీలో 6, తెలంగాణలో 4..

## మూడు ముక్కలుగా లోక్‌సభ నియోజకవర్గాలు

**విజయవాడ, జూన్ 13:**దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తాజాగా నియోజకవర్గాల పునర్విభజన అంశానికి సంబంధించి కీలక ప్రతిపాదనలతో సిఫార్సులు చేసింది. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 824 నియోజకవర్గాలకు పెంచాలని పేర్కొంది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ప్రస్తుతం ఉన్న 543 నియోజకవర్గాలలోని 59 స్థానాలను రెండుగా, 111 స్థానాలను మూడు నియోజకవర్గాలుగా విభజించాలని సూచించింది. నియోజకవర్గాల విభజనకు.. గత ఎన్నికల్లో పోలింగ్ శాతంతో పాటుగా పట్టణ, ఎస్సీ, ఎస్టీ, మహిళల జనాభా సహా పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచనలు చేసింది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పలు నియోజకవర్గాలు మూడుగా, రెండుగా విభజించాలని సూచించింది.ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, రాజంపేట, కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల నియోజకవర్గాలను మూడుగా, మచిలీపట్నం నియోజకవర్గాన్ని రెండుగా చేయాలని సూచించింది. తెలంగాణ విషయానికి వస్తే.. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్ల?్కజ్‌గిరి, మెదక్‌లను మూడుగా, చేవెళ్లను రెండుగా విభజించాలని సిఫార్సు చేసింది. దీని ప్రకారం నియోజకవర్గాలను విభజన వల్ల 2.32% ఓటింగ్ పెరుగుతుందని.. 2.23 కోట్ల మంది అదనంగా ఓటేస్తారని చెబుతున్నారు. తాజా సిఫార్సుల్ని బట్టి నియోజకవర్గాలను విభజిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 3.52%,



తెలంగాణలో 6.55% ఓటింగ్ పెరిగే అవకాశం ఉంటుందంటున్నారు. జనాభా, పట్టణీకరణ, ఎస్సీ జనాభా, ఎస్టీ జనాభా, భాషాపరమైన పోలరైజేషన్, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.ప్రధాని ఆర్థిక సలహామండలి సమర్పించిన సిఫార్సుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి మూడుగా విభజించే లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆరు నగరాలు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ నియోజకవర్గం భాషాపరమైన పోలరైజేషన్ స్కోర్ 0.12 ఉంది. హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉర్దూ మాట్లాడేవారు 10.66 లక్షలమంది ఉన్నారు.. తెలుగు మాట్లాడేవారు 28శాతం, హిందీ మాట్లాడేవారు 5.15శాతం ఉన్నారు. ఈ మేరకు హైదరాబాద్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని సిఫార్సు చేసింది. ఇలా భాషాపరమైన పోలరైజేషన్ ఉన్నచోట్ల ఓటింగ్ శాతం 11 నుంచి 13 శాతం అధికంగా నమోదవుతుందని భావిస్తున్నారు.. ఇక సికింద్రాబాద్‌లో పోలరైజేషన్ స్కోర్ (0.120)గా ఉంది. హైదరాబాద్ నియోజకవర్గాన్ని మూడుగా విభజిస్తే.. ప్రతి నియోజకవర్గంలో 27.87 పర్సంటేజ్ పాయింట్ల మేర ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. సికింద్రాబాద్‌ను మూడుగా విభజస్తే 26.93 పర్సంటేజ్ పాయింట్లు వస్తాయని భావిస్తున్నారు.ఏపీ విషయానికి వస్తే.. నంద్యాల (0.117), రాజంపేట (0.114), కడప (0.105), విశాఖపట్నం (0.052) పోలరైజేషన్ ఉంది. విశాఖపట్నం నియోజకవర్గాన్ని మూడుగా విభజిస్తే 15.88 పర్సంటేజ్ పాయింట్లు, కడప నియోజకవర్గం విభజనతో 15.39 పర్సంటేజ్ పాయింట్లు, రాజంపేట 14.47 పర్సంటేజ్ పాయింట్లు, నంద్యాల 14.22 పర్సంటేజ్ పాయింట్ల మేర ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రధాని ఆర్థిక సలహామండలి సమర్పించిన సిఫార్సుల ప్రకారం పెద్ద రాష్ట్రాల్లో సీట్లు 50శాతం పెరగనున్నాయి. చిన్న రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను నేరుగా రెట్టింపు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణ లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కు, కర్ణాటక సీట్లు 28 నుంచి 42కు, తమిళనాడు సీట్లు 39 నుంచి 59కి, కేరళ లోక్ సభ సీట్లు 20 నుంచి 30కి పెరుగుతాయి. అన్ని నియోజకవర్గాలను కాకుండా170 నియోజకవర్గాలను విభజిస్తే సరిపోతుందని సిఫార్సు చేశారు. అందుకే 59 నియోజకవర్గాలను రెండుగా.. 111 నియోజకవర్గాలను 3గా చేయాలని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందంటున్నారు.

# దిగొస్తున్న బంగారం ధరలు

బంగారం ధరలు పతనమన్న వార్త మధ్యతరగతి ఇళ్లల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళల మోహాల్లో వెయ్యి వాట్ల బల్బు వెలిగినంత హ్యాపీనెస్ జిగేల్‌మంటోంది. మగవారికి జీతం పెరిగినప్పుడు వచ్చే సంతోషం ఒకెత్తయితే..మహిళలకు బంగారం ధర తగ్గినప్పుడు వచ్చే ఆనందం ఇంకో ఎత్తు. ఎందుకంటే, మధ్యతరగతి మహిళల దృష్టిలో బంగారం అనేది కేవలం ఒక నగ కాదు..అది వారి కష్టార్జితం, దాచుకున్న రహస్య పొదుపు, ఆపదలో ఆదుకునే ఒక నమ్మకం. నెలనెలా దాచుకున్న చిట్టీ డబ్బులు తీసి ఓ చిన్న ముక్కుపుడకో, ఉంగరమో కొనడం ఆడవాళ్లు ఆర్థికభద్రతగా భావిస్తారు. బంగారం ధర పది రోజుల్లో ఏకంగా 10 వేల 690 రూపాయలు తగ్గింది. గురువారం 24 క్యారెట్ల తులం బంగారం లక్షా 45 వేల 640కి దిగి వచ్చింది. ఒక్కరోజులోనే 2 వేలకు పైగా తగ్గింది. కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్రంగా ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. 2026 ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్లో రికార్డ్ స్థాయిలో ఒక ఔన్స్ బంగారం ధర దాదాపు 5,500 నుంచి 5,600 డాలర్ల దగ్గర ఆల్‌టైమ్ హైని తాకింది. కానీ, గడిచిన కొన్ని వారాల్లోనే అది ఏకంగా 4,200 డాలర్ల స్థాయికి పడిపోయింది. అంటే దాదాపు 15 నుంచి 20 శాతం వరకు క్షీణత. ఇరాన్ యుద్ధం మళ్లీ ఉద్రిక్తతలను పెంచుతోంది. ద్రవ్యోల్బణం భయపెడుతోంది.. అయినా సరే, సేఫ్ హెవెన్ గా భావించే బంగారం ధరలు ఎందుకు తగ్గుతున్నాయి.. దీని వెనుక గ్లోబల్ ఎకనామిక్ గేమ్ ఏంటన్న విశ్లేషణ సాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు 15శాతానికి పైగా తగ్గితే, ఇండియాలో కేవలం 4 నుంచి 5 శాతమే తగ్గాయి. దీనికి కారణం మన రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడటం. అలాగే 2026 మేలో భారత ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి 15శాతానికి పెంచడం. ఈ డ్యూటీ పెంపుతో మన దేశీయ మార్కెట్లో పూర్తి స్థాయిలో తగ్గుదల ప్రభావం కనిపించలేదు.ప్రపంచవ్యాప్తంగా బంగారం ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్లలోనే జరుగుతుంది. డాలర్‌కు, గోల్డ్‌కు ఎప్పుడూ వ్యతిరేక సంబంధమే. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే బలంగా ఉంది. డాలర్ బలంగా మారినప్పుడు, ఇతర కరెన్సీలు ఉపయోగించే దేశాలకు బంగారం కొనడం ఖరీదైన వ్యవహారం. దీనివల్ల అంతర్జాతీయంగా పుత్తడికి డిమాండ్ తగ్గి, ధరలు తగ్గుముఖం పడతాయి. 2026 ప్రారంభంలో, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందని అందరూ భావించారు. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ధరలు పెరుగుతాయి. కానీ సీన్ రివర్స్ అయింది. అమెరికాలో ఇటీవల విడుదలైన ఉద్యోగాల గణాంకాలు చాలా బలంగా వచ్చాయి. దీనికి తోడు పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు పైపైకి ఎగబాకాయి. చమురు పెరగడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందనే భయాలు మొదలయ్యాయి. ఫలితంగా, యూఎస్ ఫెడ్ తన వడ్డీ రేట్ల కోతను సెప్టెంబర్ 2026 లేదా ఆ తర్వాతకు వాయిదా వేసింది. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నంత కాలం, పెట్టుబడిదారులు బంగారాన్ని వదిలి బాండ్లపై దృష్టి పెడతారు. ఎందుకంటే బంగారం ఎలాంటి వడ్డీని ఇవ్వదు,



కానీ యూఎస్ బాండ్లు ప్రస్తుతం దాదాపు 1.74శాతం రియల్ ఈల్డ్‌ను అందిస్తున్నాయి. దీంతో గోల్డ్ డిమాండ్ తగ్గి...రేట్లు డౌనయ్యాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ లేటెస్ట్ రిపోర్ట్ ప్రకారం, 2026 మొదటి క్వార్టర్‌లో సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు దాదాపు 22శాతం తగ్గాయి. బంగారం ధరలు విపరీతమైన గరిష్ట స్థాయికి చేరడంతో, బ్యాంకులు కూడా కొత్త కొనుగోళ్లను కాస్త ఆపి, ప్రాఫిట్ బుకింగ్ వైపు మొగ్గు చూపాయి. అలాగే రష్యా సెంట్రల్ బ్యాంకు కూడా భారీగా భౌతిక బంగారం అమ్మేసుకుంటోంది. ఉక్రెయిన్ నాలుగేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా...వార్‌ను కంటిన్యూ చెయ్యడానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి గోల్డ్ వదిలించుకుంటోంది. ఈ నాలుగు నెలల్లో సుమారు 30 టన్నుల గోల్డ్‌ను సెల్ చేసింది.ఫిజికల్ గోల్డ్ కు డిమాండ్ తగ్గడం కూడా రేట్ల పడిపోవడానికి మరో కారణం. భారత్, చైనా వంటి దేశాల్లో ఆభరణాల డిమాండ్ గణనీయంగా పడిపోయింది. 2025, 2026 లలో ధరలు లక్షన్నర దాటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనడం తగ్గించేశారు. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ, లైట్ వెయిట్ జ్యువెలరీ లేదా పాత బంగారాన్ని మార్పిడి చేసుకోవడం పెరిగింది. మన దేశంలో బంగారం ధర పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్ మీద మాత్రమే ఆధారపడి ఉండదు. కొన్ని లోకల్ ఫ్యాక్టర్స్ పనిచేస్తాయి. డాలర్-రూపాయి మార్పిడి రేటు అందులో ఒకటి. డాలర్ ఇండెక్స్ పెరగడం వల్ల రూపాయి విలువ దాదాపు 95 రూపాయల మార్కును దాటి వెళుతోంది. రూపాయి బలహీనపడితే మనం దిగుమతి చేసుకునే బంగారం ఖరీదవుతుంది. దిగుమతులు కూడా తగ్గుతాయి. డిజిటల్ గోల్డ్, జుఖీల ట్రెండ్ బాగా పెరిగింది. భౌతిక బంగారం కంటే ఇప్పుడు యువత గోల్డ్ ఇటిఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ధరలు భారీగా పెరగడంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ ఈటిఎఫ్ ఇన్‌ఫ్లో కూడా తగ్గింది. డిమాండ్ సప్లై సూత్రం ప్రకారం...డిమాండ్ డౌనయ్యింది...రేటు దిగొచ్చింది. దేశంలో విదేశీ మారక నిల్వలను కాపాడటానికి ఒక్క ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనడం ఆపాలని ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను కోరారు. పశ్చిమ ఆసియా యుద్ధంతో చమురు ధరలు పెరిగాయని...ఆయిల్ కొనడానికి డాలర్లు కావాలి కాబట్టి.. బంగారం దిగుమతులు తగ్గించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ ప్రకటన వచ్చిన మరుసటి రోజే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి ఏకంగా 15శాతానికి పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. సుంకం పెరగడం వల్ల విదేశాల నుంచి అధికారికంగా బంగారం దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇది దేశీయంగా బంగారం కొత్త కొనుగోళ్లను చాలా వరకు నియంత్రించింది. మోడీ పిలుపునిచ్చిన 10 రోజుల్లోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జ్యువెలరీ షాపుల్లో సేల్స్ 80శాతం పడిపోయాయి. కస్టమర్ల ఆలోచనాధోరణి కూడా కొంత మారిందని కొందరు బులియన్ మార్కెట్ నిపుణుల అభిప్రాయం. 10 మందిలో ఆరుగురు ఈ ఏడాది బంగారం కొనకూడదని ఫిక్స్ అయ్యారు.వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం.. భారతదేశంలో 2025లో డిజిటల్ గోల్డ్ కొనుగోళు 69 శాతం పెరిగి 13.5 టన్నులకు చేరుకున్నాయి. ఇదే సమయంలో యూపీఐ ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్ల విలువ భారీగా పెరిగింది. 2025 జనవరిలో సుమారు ఎనిమిది వందల కోట్లుగా ఉన్న లావాదేవీలు... డిసెంబరు నాటికి 21 వందల కోట్లకుపైగా చేరినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే 2025 ఆగస్టు నాటికి డిజిటల్ గోల్డ్ లావాదేవీల సంఖ్య 377 శాతం పెరగడం... ఈ రంగం విస్తరిస్తున్న వేగాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు ఈ పెట్టుబడి విధానాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నట్లు చెబుతున్నారు మార్కెట్ నిపుణులు. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ మాదిరిగానే మొబైల్ ఫోన్‌లో కొన్ని క్లిక్‌లతో బంగారం కొనుగోలు చేయగలగడంతో... పెట్టుబడులు ఈజీ అవుతున్నాయి. చిన్న మొత్తాలతో పెట్టుబడి ప్రారంభించే అవకాశం కూడా యువతను డిజిటల్ గోల్డ్ వైపు ఆకర్షిస్తోంది. సాధారణంగా భౌతిక బంగారం కొనుగోలు చేయాలంటే వేల రూపాయలు అవసరమవుతాయి. డిజిటల్ గోల్డ్‌లో ఒకటి నుంచి వంద రూపాయల చిన్న మొత్తాల నుంచే పెట్టుబడి ప్రారంభించవచ్చు. దీంతో విద్యార్థులు, యువ ఉద్యోగులు, చిన్న పెట్టుబడిదారులు కూడా డిజిటల్ బంగారంలో పెట్టుబడి పెట్టగలుగుతున్నారు. అదనంగా... నెలవారీ ఆటోమేటిక్ సేవింగ్స్ విధానాల ద్వారా క్రమం తప్పకుండా బంగారం కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది. టన్నుల కొద్దీ బంగారం కొనే మన దేశంలో.. గ్రాములు కొనడానికి కూడా సామాన్యుడు వెనుకాడుతున్నాడు. షాపులు కస్టమర్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వ్యాపారులు డిస్కౌంట్లు ఇస్తామన్నా జనం అడుగు ముందుకు వేయడం లేదు. శతాబ్దాలుగా వస్తున్న గోల్డ్ సెంటిమెంట్‌ను దాటి ప్రజలు ఆలోచిస్తున్నారు. బంగారం ధరలు తగ్గినా...కొనుగోళ్లు పెరగడకపోవడం ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పునకు ఒక నిదర్శనం. గోల్డ్ కొనుగోళ్లు తగ్గడం అనేది కేవలం ఒక లోహం ముచ్చట కాదు. ఇది దేశంలోని మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోందనడానికి, వారి ఆర్థిక సందిగ్ధతకు ఒక ప్రత్యక్ష నిదర్శనం. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునకు జనం ఏస్థాయిలో జేజేలు కొడతారు అనడానికి...తగ్గిన గోల్డ్ డిమాండే ఉదాహరణ.

# వనస్థలిపురంలో అక్రమ లింగ నిర్ధారణ రాకెట్ భగ్నం

**హయగ్రీవ హాస్పిటల్‌పై డికాయ్ ఆపరేషన్**

**- డైరెక్టర్ సహా ముగ్గురు అరెస్ట్**

**PCPNDT చట్టం కింద కేసు**

**హైదరాబాద్:** వనస్థలిపురం పరిధిలోని హయగ్రీవ హాస్పిటల్‌లో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు డికాయ్ ఆపరేషన్ నిర్వహించి రాకెట్‌ను ఛేదించారు. ఈ కేసులో హాస్పిటల్ డైరెక్టర్ కొర్ర రాజు, రిసెప్షనిస్ట్ లోకేష్‌తో పాటు తుక్కుగూడ శ్రీ సాయి ధనుష్ క్లినిక్ ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు.వనస్థలిపురం పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మహిళా పోలీసును డికాయ్‌గా హయగ్రీవ హాస్పిటల్‌కు పంపారు. హాస్పిటల్ డైరెక్టర్ కొర్ర రాజు, రిసెప్షనిస్ట్ లోకేష్ ఇద్దరూ కలిసి లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తామని హామీ ఇచ్చారు. తమకు తెలిసిన తుక్కుగూడ వద్ద ఉన్న విజయ్ కుమార్ స్కాన్ చేసి పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అని చెబుతాడని రిఫర్ చేశారు. దీంతో పోలీసులు వెంటనే తుక్కుగూడ వద్ద శ్రీ సాయి ధనుష్ క్లినిక్‌లోని ల్యాబ్‌పై దాడి చేశారు. అక్కడ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**పోలీసుల హెచ్చరిక:**

PCPNDT చట్టం ప్రకారం గర్భంలోని శిశువు లింగాన్ని తెలియజేయడం నేరం. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం పోలీసులు హెచ్చరించారు. ఆడపిల్లల లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అక్రమ లింగ నిర్ధారణలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# హస్తినకు రాములమ్మ...

**హైదరాబాద్, జూన్ 13:**తెలంగాణ కాంగ్రెస్ నేత విజయశాంతి పార్టీ వైపు చూడటం లేదు. పదవిలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ అంతే. కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. కానీ ఎమ్మెల్సీ పదవితో ఆమె సంతృప్తికరంగా లేనట్లు కనపడుతుంది. తన రేంజ్ కు మంత్రి పదవి దక్కాలన్న యోచనలో విజయశాంతి ఉన్నారని చెబుతున్నారు. అందుకే విజయశాంతి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. శాసనమండలి సమావేశాలకు మాత్రమే హాజరవుతూ మొక్కుబడిగా ప్రశ్నలు వేస్తున్నారు. మొన్న జరిగిన శాసనమండలి సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడి మరోసారి విజయశాంతి తన అక్కసును వెళ్లగక్కారు.కాంగ్రెస్ లో త్వరలో మంత్రి వర్గ విస్తరణ జరగనుందన్న ప్రచారం ఎప్పటి నుంచో జరుగుతుంది. అయితే అన్ని రకాల అర్హతలున్న తనకు మంత్రి పదవి ఎందుకు దక్కడం లేదన్నది ఆమె సన్నిహితుల వద్ద ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. నిజానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో విజయశాంతి పేరు రావడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అసలు విజయశాంతి పేరును ఎవరూ ఊహించ లేదు. ఢిల్లీలో ఉండి మల్లికార్జున ఖర్గేను కలిసినప్పటికీ ఆమె పేరు ఖరారు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎవరూ భావించలేదు. నేరుగా హైకమాండ్ ను కలసి తనకు ఎమ్మెల్సీ పదవిని తెచ్చుకున్న ఘనత విజయశాంతిది. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి అనేక మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నేరుగా రాహుల్ ను కలసి తమకు మంత్రిపదవి ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో రాములమ్మ కూడా హస్తిన బాట పడుతున్నారన్న టాక్ వినపడుతుందిఎమ్మెల్సీ వచ్చిన ఆనందం మాత్రం ఆమెలో కనిపించడం లేదు. తాను మంత్రి పదవికి పూర్తి స్థాయిలో అర్హత కలిగిన నేతనంటూ మరోసారి ఢిల్లీకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈసారి కూడా ఇక్కడి నేతలతో సంబంధం లేకుండా నేరుగా ఢిల్లీకి వెళ్లి



హైకమాండ్ ను కలసి తన మంత్రి పదవి చర్చించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తనకు మంత్రి పదవి ఇస్తే తాను పార్టీకి ఏం చేయదలచుకున్నానో.. కూడా హైకమాండ్ కు నివేదించేందుకు ఒక బ్లూ ప్రింట్ ను కూడా సిద్ధం చేసుకున్నట్లు చెబుతున్నారు. మొత్తం మీద విజయ శాంతి ఎమ్మెల్సీగానే ఊహించని విధంగా అయినప్పుడు మంత్రి కావడంలో పెద్దగా ఎవరూ నోరు వెళ్లబెట్టాల్సిన పనిలేదంటున్నారు సొంత పార్టీ నేతలు.

**ఆగని అంతర్గత పోరు**

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కారానికి గురయింది. అయితే అందుకు తెలంగాణాలో నమోదయిన కేసు కారణమని ఎన్నికల అధికారులు తిరస్కరించారు. అఫడవిట్ లో కేసు గురించి పేర్కొనకపోవడంతో మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన ఎన్నికల అధికారులు మీనాక్షి నామినేషన్ ను తిరస్కరించారు. అయితే తెలంగాణలో ఆమెపై కేసు నమోదు కాలేదు. కేవలం ఒక కేసులో న్యాయస్థానం సమన్లు మాత్రమే జారీ చేసింది. ఇవన్నీ పక్కన పెడితే అసలు తెలంగాణలో మీనాక్షి నటరాజన్ పై కేసు ఉన్నట్లు మధ్యప్రదేశ్ బీజేపీ నేతలకు ఉప్పు అందించిందెవరు? అన్నదే ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.మీనాక్షి నటరాజన్ స్ట్రయిట్ ఫార్వార్డ్ నేత. నిరాడంబరంగా ఉంటారు. ఖరీదైన జీవితాన్ని కూడా ఆశించరు. దీపా మున్షీ దాస్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మీనాక్షి నటరాజన్ కు తెలంగాణ కాంగ్రెస్ ఇన్ ఛార్జి బాధ్యతలను అప్పగించింది. ఆమె తెలంగాణ కాంగ్రెస్ లో ఇన్ ఛార్జి పదవి తీసుకున్న వెంటనే ఒకే మాట చెప్పారు. పార్టీకి నమ్మకంగా ఏళ్ల నుంచి పనిచేసిన వారికే ప్రథమంగా గుర్తింపు ఉంటుందని, ఎన్నికలకు ముందు వచ్చిన వారికి పదవులు తర్వాత ఇస్తామని నిర్మొహమాటంగా చెప్పారు. దీంతో పాటు ఆమె కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునే ప్రయత్నం జరగలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వానికి నివేదికలను అందిస్తున్నారన్న అనుమానం ఇక్కడి నేతలకు ఉంది.మీనాక్షి నటరాజన్ పార్టీ ఇన్ ఛార్జిగా పదవి బాధ్యతలను తీసుకున్న తర్వాత తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీలో శత్రువులు పెరిగారన్నది అంతే వాస్తవం. మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు సయితం నామినేషన్ తిరస్కారానికి గురైన తర్వాత మీడియాతో మాట్లాడుతూ తమకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఇచ్చిన సమాచారం మేరకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే మీనాక్షి నటరాజన్ పై బీజేపీ నేతలకు సమాచారం ఇచ్చెందవరు? అన్నదానిపై ఇప్పుడు కాంగ్రెస్ లో పోస్టుమార్టం జరుగుతుంది. కానీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాత్రం తెలంగాణ కాంగ్రెస్ నుంచి ఎవరూ సమాచారం ఇవ్వలేదని, కేవలం తెలంగాణ బీజేపే నేతలు ఇచ్చిన సమాచారంతోనే వారు ఫిర్యాదు చేశారంటున్నారు. మొత్తం మీద మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్ లో ప్రకంపనలు పుట్టిస్తుంది.

# బోధన్ లో కనిపించని షకీల్

**నిజామాబాద్, జూన్ 13:**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో.. గులాబీ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాలు జోరుగా జరుగుతున్నాయి. మీటింగ్స్‌కు హాజరవుతున్న పార్టీ నేతలంతా ఐక్యతా రాగం ఆలపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు జట్టుగా, కలిసి కట్టుగా సమావేశాల్లో పాల్గొన్ని క్యాడర్‌లో జోష్ నింపుతున్నారు. ఇక్కడ మొత్తం 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఒక్క బోధన్ మినహా అన్ని చోట్ల సమావేశాల నిర్వహణ పూర్తయింది. చివరికి నియోజకవర్గ ఇన్చార్జ్ లేని బాన్సువాడలోనూ మూడు మండలాలకు ఓ సమావేశం చొప్పున పూర్తి చేశారు. కానీ... మాజీ ఎమ్మెల్యే షకీల్ బాధ్యుడిగా ఉన్న బోధన్‌లో మాత్రం పట్టించుకునే నాధుడే లేడు. అక్కడ అసలు సన్నాహక సమావేశం జరుగుతుందో లేదో కూడా తెలియని గందరగోళ పరిస్థితులు ఉన్నాయట. ఈనెల 1న మీటింగ్ ఉంటుందని ప్రకటించి.. వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు ఉంటుందో తెలియదు. సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీలుకున్న బీఆర్‌ఎస్ఎక్కడికక్కడ ఇన్చార్జ్‌లను నియమించి రిపోర్టులు తెప్పించుకుంటోంది. బోధన్‌లో మాత్రం సమావేశం జరగకపోవడం, ఇన్చార్జ్ షకీల్ అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులపై గులాబీ బాస్ ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. పార్టీ తరపున నిరసన కార్యక్రమాలు చేయాలని ఆదేశాలు వచ్చినా.. ఇక్కడ ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క



కార్యక్రమం కూడా జరగలేదు. ఈ పరిణామాలు నాయకత్వానికి ఇబ్బందిగా మారడంతో పాటు... పార్టీ క్యాడర్ సైతం నిరుత్సాహంగా ఉన్నట్టు తెలుస్తోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జరిగిన పరిణామాలతో దుబాయ్ వెళ్లిపోయారు షకీల్. అక్కడి వ్యాపారాల్లో బిజీ అయ్యారట. అప్పట్లో ఆయన బోధన్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో మాజీ ఎమ్మెల్యే భార్యే అడపాదడపా పార్టీ వ్యవహారాలను చక్కబెట్టారు. తర్వాత కొన్నాళ్ళకు తిరిగి వచ్చిన షకీల్ ఇక యాక్టివ్ పాలిటిక్స్ చేస్తానని ప్రకటించారు. మళ్లీ ఏం జరిగిందో ఏమో.. తెలియదుగానీ... ఇంకోసారి దుబాయ్ ఫ్లైట్ ఎక్కేశారు. అక్కడి బిజినెస్ వ్యవహారాల్లో బిజీ అయిపోయి ఇక్కడ పార్టీని గాలికొదిలేశారన్నది కేడర్ టాక్. తాజాగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అందరూ పాల్గొంటున్నా.. ఆయన మాత్రం డుమ్మా కొడుతున్నారు. దీంతో... తమ నియోజకవర్గంలో అసలేం జరుగుతోందో అర్ధంకాక కారు కేడర్ గందరగోళపడుతోంది. మాజీ ఎమ్మెల్యే కనిపించడం లేదంటూ సొంత పార్టీ కార్యకర్తలే సెటైర్లు వేస్తున్నారంటే పరిస్దితి ఎలా ఉందో అర్ధం చేసుకోవచ్చునని అంటోంది ద్వితీయ శ్రేణి. బోధన్ సభ్యత్వ నమోదు ఇన్చార్జ్‌గా ఉన్న మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్ రావు సైతం ఈ అంశంపై కేసీఆర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారట. దుబాయ్‌తో పాటు జిల్లాలోనూ రైస్ మిల్లు బిజినెస్‌లో బిజీగా మారిన షకీల్ మెల్లిగా రాజకీయాలకు దూరం అవుతున్నారా అన్నది కొందరి అనుమానం. ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం వెనుక ఆసక్తి లేకపోవడమేనా..? లేక ఇతర బలమైన కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి. ఇలాంటి చాలా ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందేనన్నది రాజకీయ వర్గాల మాట. కానీ అప్పటి వరకు క్యాడర్ తలోదిక్కు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ పెద్దలదే. బాస్. జర దేఖో హమారా బోధన్ కోఅంటున్న కార్యకర్తల మాటల్ని పార్టీ పెద్దలు ఎంతవరకు పట్టించుకుంటారో చూడాలి.

# ఖమ్మంలో గాయత్రీ రవి టార్గెట్

**ఖమ్మం, జూన్ 13:**ఖమ్మం జిల్లాలో విజిలెన్స్ దాడులు కలకలం రేపుతున్నాయి. మరీ ముఖ్యంగా బీఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అలియాస్ గాయత్రి రవికి చెందిన కంపెనీల మీదే వరుసబెట్టి జరుగుతుండటం పొలిటికల్ హాట్ అవుతోంది. ఇదంతా నిజంగానే అక్రమాల వెలికితీత కోసం జరుగుతోందా...? లేక రాజకీయ కక్ష సాధింపులో భాగమా అన్న అనుమానాలు అన్ని వర్గాల్లో పెరుగుతున్నాయట. వరంగల్ జిల్లాకు చెందిన వద్దిరాజు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో గ్రానైట్ వ్యాపారం ఉంది. బీసీ కాపు సామాజిక వర్గానికి చెందిన రవిమొదట్లో కాంగ్రెస్ అభిమానిగానే ఉన్నారు. 2018లో ఆ పార్టీ వరంగల్ తూర్పు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చిందిగానీ విజయం సాధించలేదు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరాక రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు కేసీఆర్. ఆ పదవీకాలం రెండేళ్ళే కావడం, ముగిసిపోవడంతో తిరిగి ఆయనకే రెన్యువల్ చేశారు. ఈ పరిస్థితుల్లో 2024 లోక్‌సభ ఎన్నికల్లో వద్దిరాజును తమ పార్టీ తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించాలని అనుకున్నారట కాంగ్రెస్‌లోని కొందరు. అందుకు ఆయన ఒప్పుకోకపోగా బీఆర్ఎస్‌కు అండగా ఉంటున్నారన్న కోపంతో అధికార పార్టీ ఇప్పుడు టార్గెట్ చేసిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి పొలిటికల్ సర్కిల్స్‌లో. కేసీఆర్, హరీష్‌రావు లాంటి అగ్ర నాయకులకు దగ్గరగా ఉండే గాయత్రి రవిని బీఆర్ఎస్‌కు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ క్రమంలోనే కొద్ది రోజులుగా ఆయనకు చెందిన గ్రానైట్ కంపెనీల్లో విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయన్న ప్రచారం నడుస్తోంది.ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని గ్రానైట్ క్వారీల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అయితే ఇవి ఎక్కడా బయటికి ఎక్స్‌పోజ్ అవకుండా జాగ్రత్త పడ్డారట అధికారులు. మరోవైపు కొంతకాలంగా... ఖమ్మం జిల్లా కారును గాయత్రి రవి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కందాల, సండ్ర వెంకటవీరయ్య కలిసి నడిపిస్తున్నారు. ఇందులో కీలకంగా ఉన్నందునే గాయత్రి రవి టార్గెట్ అయ్యారా అన్న అనుమానాలు కూడా చాలామందికి ఉన్నాయట. జిల్లాలో ఉన్న ముఖ్యమైన ప్రతిపక్ష నాయకులు ఒక్కొక్కరిని టార్గెట్ చేసేలా అధికార పార్టీ పావులు కదుపుతోందన్నది బీఆర్ఎస్ అభిప్రాయం. అటు గతంలో కాంగ్రెస్ నేతలకు అత్యంత ఆప్తుడిగా ఉండేవారు రవి. ప్రస్తుతం రాష్ట్రంలో కీలక మంత్రిత్వ శాఖను నిర్వహిస్తున్న ఒక మినిస్టర్‌కు అప్పట్లో రైట్ హ్యాండ్‌లా ఉండేవారాయన. ఇప్పుడు తనకు ఎదురవుతున్న సమస్యలు, వేధింపుల గురించి వద్దిరాజు రవిచంద్ర సదరు మంత్రికి చెప్పుకున్నా నా చేతిలో ఏమీ లేదని ఆయన అన్నట్టు తెలిసింది. మరోవైపు వచ్చే అసెంబ్లీ... ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యే సీట్లో రవి పోటీ చేస్తారన్న ప్రచారం సైతం ఉంది. ఇక ఆయన గ్రానైట్ క్వారీలతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బంధువులు నిర్వహిస్తున్న దుకాణ సముదాయానికి కూడా అధికారులు నోటీసులు ఇచ్చారట. వాటి వెనుక సైతం అధికార పార్టీ నేతల వత్తిడి ఉందని ఆఫ్ ద రికార్డ్‌లో అజయ్ అంటున్నారట.

# ఎస్ ఐ ఆర్ రాజకీయ పార్టీల సహకారం కోరిన సీఈఓ

- మొదటి పేజీ తరువాయి

తమ పూర్తి మద్దతును ప్రకటించారు.కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) జూన్ 25 నుండి జూలై 24 వరకు ఇంటింటి సర్వేను నిర్వహిస్తారు. అనంతరం స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అభ్యంతరాలు, విజ్ఞప్తుల స్వీకరణ ప్రక్రియ అనంతరం, పూర్తిస్థాయి పరిశీలన పూర్తి చేసి అక్టోబర్ 1న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు సీఈఓ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.గత రెండు దశాబ్దాలలో రాష్ట్రంలో ఇంతటి సమగ్ర స్థాయిలో ఓటర్ల జాబితా ప్రక్షాళన జరగడం ఇదే మొదటిసారి. నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లు, చిరునామా మారిన వారిని జాబితా నుంచి తొలగించడంతో పాటు, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడమే ఈ ప్రత్యేక సవరణ ముఖ్య ఉద్దేశం. నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి విచారణ జరపకుండా ఏ ఒక్కరి పేర్లను జాబితా నుంచి తొలగించబోమని, ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని అధికారులు భరోసా ఇచ్చారు. పౌరుల సందేహాల నివృత్తికి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ పవన్ కల్యాణ్‌కు ఉంది: రేవంత్ రెడ్డి

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎవరైనా రాజకీయాలు చేయడానికి స్వేచ్ఛ ఉందని, పవన్ కల్యాణ్‌కు కూడా అదే వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ నిర్వహించాలనుకున్న బహిరంగ సభకు అనుమతి నిరాకరించిన అంశంపై స్పందించిన సీఎం... ఆ నిర్ణయం పూర్తిగా శాంతిభద్రతల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదేనని వివరించారు. ఇందులో రాజకీయ కోణం ఏదీ లేదని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడంపై ఎలాంటి ఆంక్షలు లేవని, నిబంధనల ప్రకారం ఎవరైనా తమ రాజకీయ కార్యకలాపాలు కొనసాగించవచ్చని తెలిపారు.ఇదే సమయంలో జాతీయ రాజకీయాలపై కూడా ఆయన స్పందించారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఎలాంటి తీవ్రమైన చట్టపరమైన అడ్డంకులు లేని పరిస్థితిలో నామినేషన్ తిరస్కరించడం ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాల అవకాశాలను పరిమితం చేసేలా వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవస్థలు పనిచేయాలని రేవంత్ రెడ్డి సూచించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్.. కార్యకర్తలకు దిశానిర్దేశం

- మొదటి పేజీ తరువాయి

పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రొజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## వీబీజీ రాంజీ స్కీంపై కేంద్రానికి వ్యతిరేకంగా లేఖ రాస్తాం

- మొదటి పేజీ తరువాయి

వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఉపాధి హామీ ద్వారా చేపడుతామని తెలిపారు.

**60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదు..**

పంట సీజన్‌లో ఉపాధికి 60 రోజుల బ్రేక్ ఇస్తే.. మొక్కలు నాడటం ఆగిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు. అది కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్‌కు విరుద్ధమని అన్నారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంట సీజన్ 60 రోజులు కూడా ఉండదని చెప్పారు. ఒకసారి పనులు మొదలుపెట్టాకా.. 60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు. ప్రస్తుత ఉపాధి హామీ విధానం నుంచి నూతన విధానంలోకి ఒక్కసారిగా మారడం కష్టమని చెప్పారు. అందుకే ఆయా రాష్ట్రాలకు కాస్త వెసులుబాటు ఇచ్చేలా నూతన చట్ట అమలును వాయిదా వేయాలని సూచించారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో వీబీజీ రాంజీని అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఏలాంటి నష్టం లేకుండా తాము చూస్తామని అన్నారు. అందుకనుగుణంగా జరిగే నష్టాన్ని రాష్ట్రం తరుపున భర్తీ చేసేందుకు ముసాయిదా రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చర్చించిన తర్వాత నూతనపథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## తెలంగాణ, ఏపీలో వాన బీభత్సం

- మొదటి పేజీ తరువాయి

రాత్రి వేళలో ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం కురిసింది. ఉరుములు,మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వానకు నగరంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎర్రగడ్డ, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్ వంటి ప్రాంతాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.బేగంపేట, ప్యాట్నీ సెంటర్, జేబీఎస్, సికింద్రాబాద్, ఉప్పల్, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల్లో భారీ వర్షం కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే వాహనదారులు వర్షం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగర్ కర్నూల్, మహబూబ్‌నగ్, గద్వాల్, నారాయణపేట జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది . సిద్ధిపేట, సిరిసిల్ల, భువనగిరి కరీంనగర్, కామారెడ్డి జిల్లాల్లో కూడా ఉరుముల వర్షం పడవచ్చు. సంగారెడ్డి, మేడ్చల్ పరిసరాల్లో కూడా వాతావరణం చల్లబడి వర్షం కురుస్తోంది.

**ఆంధ్రప్రదేశ్‌లో పిడుగుల వాన**

ఆంధ్రప్రదేశ్ వాసులను కూడా అమరావతి వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. మన్యం, అల్లూరి, విజయనగరం జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. అరకు, అనంతగిరి, బొబ్బిలి, సాలూరు, వంటి ప్రాంతాల్లో ప్రజలకు బయటకు రాకూడదని సూచించారు.ఏపీలోని ఉత్తర కోస్తా ప్రాంతాల్లో గంటకు 40–50కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని అంచనా. పిడుగులు పడే అవకాశం ఉందని చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఉండొద్దని అధికారులు హెచ్చరించారు. ప్రధానంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో వాతావరణం మరింత ఆందోళనకరంగా ఉంది. వాతావరణంలో ఏర్పడిన ద్రోణి, గాలుల కలయిక వల్ల తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి ఏర్పడింది. వేసవి తాపం తర్వాత ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు మారడం వల్ల మేఘాలు వేగంగా కేంద్రీకృతమయ్యాయి. దీని వల్ల తక్కువ సమయంలోనే అత్యధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుత సమాచారం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా వర్షాల తీవ్ర కొనసాగవచ్చు. వచ్చే 24 గంటలపాటు అల్పపీడన ప్రభావం వల్ల వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ప్రయాణాలను వాయిదా వేసుకోవడం లేదా వాతావరణ అప్‌డేట్స్ చూసుకొని బయల్దేరడం మంచిది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మున్సిపల్ అధికారుల సూచనలు పాటించాలి. వాహనదారులు మ్యాన్ హోల్స్ , నీరు నిలిచే ప్రాంతాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. పిడుగుల సమయంలో ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వాడకం తగ్గించాలి.

## భారీ వర్ష సూచన.. CURE పరిధిలో హై అలర్ట్ సీఎం రేవంత్ రెడ్డి....

- మొదటి పేజీ తరువాయి

సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ , హైడ్రా , విద్యుత్ శాఖ **(TGSPDCL)**, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ **(CS)**, డీజీపీ **(DGP)**, **CURE** స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

## కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం..

- మొదటి పేజీ తరువాయి




అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు.

ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్ట్‌లను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. “లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది” అని అన్నారు. నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

వార్తాతరంగాలు

ఆదివారం 14 జూన్ 2026

# పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు




**హైదరాబాద్, జూన్ 13:** పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు.కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్ధవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

# మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి కేసు లేదు

**పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్**



**హైదరాబాద్, జూన్ 13:** మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని కుట్రకు పూనుకున్నారని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు. మీనాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# 'సర్' పేరుతో అసలైన ఓట్లను తొలగిస్తే ఊరుకోం..

**కేటీఆర్ వార్నింగ్**



**రాజన్న సిరిసిల్ల, జూన్ 13 :** తెలంగాణలో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (ఖు=) ఆరోపించారు. 'సర్' ప్రక్రియను బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.బీజేపీ, కాంగ్రెస్‌లాగా దొంగ ఓట్లతో గెలవాలని తాము అనుకోమని కేటీఆర్ తేల్చిచెప్పారు. రైతుభరోసా వేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతన్నలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించారని ఎద్దేవా చేశారు. 'సర్' పేరుతో దొంగ ఓట్లతో అసలైన ఓట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.

# కాంగ్రెస్‌లో కలకలం.. షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీసులు

**మహిళలు, పార్టీ నాయకత్వంపై షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం**

**సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియో**




కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హైకమాండ్ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా, అలాగే పార్టీ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.వైరల్ అయిన ఆడియోలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై కూడా షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొట్టడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడమే కాకుండా, అంతర్గత వ్యవహారాలను బహిరంగ చర్చకు తీసుకురావడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

# అక్రమాస్తుల వేలానికి రంగం సిద్ధం




**హైదరాబాద్ జూన్ 13:** రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ ప్రతియేటా వందలాది మంది ప్రభుత్వ అధికారులను లంచాలు తీసుకుంటూ లేదా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసుల్లో పట్టుకుంటోంది. సోదాల సమయంలో భారీ మొత్తంలో నగదు, బంగారాన్ని, స్థిరాస్తులు, బ్యాంకు డిపాజిట్లు, ఇతర విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. అయితే, ఈ ఆస్తులు చివరకు ప్రభుత్వ ఖజానాకు చేరుతాయా? మళ్లీ సంబంధిత వారికి తిరిగి ఇస్తారా.. ఆ ఆస్తులను ఏం చేస్తారు..? ఎక్కడికి తరలిస్తారు అనే విషయాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.వాస్తవానికి ఏసీబీ సోదాల్లో పట్టుబడిన నగదును నేరుగా ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ కట్టించి వేలం వేస్తారు. వీటితో పాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ ఫిక్స్ డిపాజిట్లను కోర్టు ఉత్తర్వుల మేరకు.. బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల ద్వారా మూసివేస్తారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు బదలీ చేయిస్తారు.ఒకవేళ అక్రమాస్తుల్లో కబ్జాలు చేసినవి గానీ, ప్రభుత్వ భూములు గానీ ఉంటే ప్రత్యేక చట్టం ద్వారా స్వాధీనం చేసుకుని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తారు. అయితే, ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. అధికారుల ఆక్రమాస్తులను వేలం వేసిన ఘటనలు రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు లేవని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి వస్తారు. విధి నిర్వహణలో భాగంగా రూ.100 లంచం తీసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవు. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారితో పాటు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులను ఏసీబీ అరెస్ట్ చేసి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. ఈ సందర్భంగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బినామీ ఆస్తుల వివరాలను కోర్టులో సమర్పిస్తుంది. ఆ తరువాత సంబంధత అధికారికి నోటీసులు జారీ చేసి.. ఆయా ఆస్తులకు సంబంధించిన చట్టబద్ధమైన ఆదాయ వనరులను వివరించాలని కోరుతుంది. సరైన ఆధారాలు సమర్పించకపోతే ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తుందికోర్టులో విచారణ పూర్తయిన తరువాత నిందితుడు దోషిగా తేలితేనే అక్రమాస్తులపై తుది చర్యలు ప్రారంభమవుతాయి. లంచాల ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను నేరాల ద్వారా కూడబెట్టిన ఆస్తులుగా పరిగణించి ప్రభుత్వానికి అప్పగించాలని కోర్టు ఆదేశించవచ్చు. ఇళ్లు, ప్లాట్లు వంటి స్థిరాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం ద్వారా విక్రయించే అవకాశం ఉంటుంది. అలా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తారు.ఏసీబీ సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదును ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ నిర్ధారించి కోర్టు అనుమతితో వేలం వేయవచ్చు. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్ డ్ డిపాజిట్లను కూడా చట్ట ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రభుత్వ ఖాతాలకు బదిలీ చేసే అవకాశం ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు ఉన్నతాధికారులను ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఏసీబీ అరెస్టులు చేసింది. వీరిలో కొందరు అధికారులు రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు విచారణలో బయటపడినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు దోషులుగా తేలి, అక్రమాస్తులు వేలం దశకు చేరితే ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో అవినీతి అధికారులకు ఇదో హెచ్చరికగా ఉంటుందని పేర్కొంటున్నారు.

# ఇన్ యాక్టివ్ గా మారిన బండి



**కరీంనగర్ జూన్ 13:** కొడుకు మీద ఫోక్సో కేసు నమోదైన తర్వాత కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాజకీయంగా అంత యాక్టివ్ గా లేరు. పైగా ఆయన తీవ్ర నిరాశలో కనిపిస్తున్నారు. ఒకప్పటి మాదిరిగా ప్రత్యర్థుల మీద ఆయన ఆగ్రహం గా ఉండడం లేదు. తీవ్రస్థాయిలో మాట్లాడటం లేదు. కార్యకర్తలను కలుస్తున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారు. ఆ తర్వాత ఢిల్లీ లేదా హైదరాబాద్ వెళ్ళిపోతున్నారు. అత్యంత సన్నిహితులకు మాత్రమే ఆయన దగ్గరగా ఉంటున్నారు.కొద్దిరోజుల క్రితం బండి సంజయ్ ఆ మాత్రం కూడా అందుబాటులో లేకుండా పోయారు. సన్నిహితులకు కూడా ఆయన సమాచారం తెలియదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోంది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ కి ఏమైంది.. ఆయన ఏమైపోయారు.. ఉన్నట్టుండి అజ్ఞాతంలోకి ఎందుకు వెళ్లిపోయారు అనే చర్చ నడిచింది. ఇక నమస్తే తెలంగాణ అయితే బండి సంజయ్ మీద టన్నులకొద్దీ బురద కథనాలు రాయడం మొదలుపెట్టింది. అయితే బండి సంజయ్ ఎట్టకేలకు బయటికి వచ్చారు. తాను ఎందుకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయానో వివరించారు.బండి సంజయ్ అజ్ఞాతంలోకి వెళ్లలేదు. ఎవరికీ కనిపించకుండా పోలేదు. ఆయన అనారోగ్యానికి గురయ్యారు. కల్తీ పాలు తాగడం వల్ల ఆయన ఆరోగ్యం పాడైంది. దీంతో ఆయన చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. గర్జన 20 సంవత్సరాలుగా బండి సంజయ్ కానీ దగ్గు లేదా జ్వరంతో కూడా బాధపడలేదు. హైదరాబాద్ నగరంలో కల్తీ పాలు తాగడం వల్ల ఐదు రోజులు ఆయన మంచానికే పరిమితమయ్యారు. ఇదే విషయాన్ని ఆయన కరీంనగర్ జిల్లా జమ్మికుంట లోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ రైతు సమ్మేళనంలో వెల్లడించారు.రైతులు రసాయన ఎరువులకు దూరంగా ఉండాలని.. ప్రకృతి సిద్ధ మీద దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. సేంద్రీయ సాగుతో రైతుల కోటీశ్వరులు కావచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతులను ప్రకృతిసిద్ధమైన ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు 10,000 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయడాన్ని బండి సంజయ్ అభినందించారు.ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరంలో కల్తీ ఆహార పదార్థాల వినియోగం పెరిగిపోయింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహిస్తున్న దాడులలో ఈ విషయాలు వెలుగుచూస్తున్నాయి. చివరికి కేంద్రమంత్రి కూడా కల్తీ పాల వల్ల అనారోగ్యానికి గురి కావడం ఆందోళన కలిగిస్తోంది.

# ఇకపై డిజిటల్ పౌర సేవల కేంద్రాలుగా సహకార సంఘాలు




**నల్గొండ, జూన్ 13:** గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఒక చిన్న సర్టిఫికేట్ కోసమో, పాస్‌పోర్ట్ దరఖాస్తు కోసమో పట్టణాల్లోని మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగే రోజులకు త్వరలోనే తెరపడనుంది. గ్రామాల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలనే ఇకపై మల్టీ సర్వీస్ డిజిటల్ హబ్‌లుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ డిజిటల్ భారత్ చొరవతో, నాబార్డు సమన్వయంతో రూపుదిద్దుకుంటున్న ఈ సరికొత్త కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ద్వారా.. ఆధార్, పాన్ కార్డు సేవలతో పాటు వందలాది ప్రభుత్వ, ప్రైవేటు సేవలను రైతుల వద్దకే తెస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చిన్న డిజిటల్ పని కోసమైనా, ప్రభుత్వ సేవలను పొందాలన్నా మండల కేంద్రాలకో లేదా పట్టణాలకో పరుగులు తీసే రోజులు త్వరలోనే కానరాకుండా పోనున్నాయి. ఇకపై మీ గ్రామంలో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ద్వారానే సమస్త డిజిటల్ పౌర సేవలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో ఈ సంఘాలన్నింటినీ కామన్ సర్వీస్ సెంటర్లుగా (సీఎస్‌సీ) మార్చే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.సాధారణంగా ప్రాథమిక సహకార సంఘాలు అంటే కేవలం రైతులకు రుణాలు ఇవ్వడం, ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయడానికే పరిమితం అనే భావన ఉంది. అయితే వీటికి పూర్తిస్థాయిలో డిజిటల్ హంగులు అద్ది, డిజిటల్ భారత్ పథకంలో భాగంగా గ్రామీణులకు అవసరమైన అన్ని రకాల సామాజిక, సంక్షేమ, విద్యా, ఆరోగ్య సేవలను ఒకే చోట అందించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగానే కేంద్ర సహకార శాఖ, ఐటీ మంత్రిత్వ శాఖ, నాబార్డుల మధ్య జాతీయ స్థాయిలో కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సరికొత్త డిజిటల్ విప్లవం ద్వారా పీఏసీఎస్‌లు కేవలం వ్యవసాయ కేంద్రాలుగానే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త ఉపాధి అవకాశాలను సృష్టించే డిజిటల్ హబ్‌లుగా రూపాంతరం చెందనున్నాయి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిని ఈ ఏడాది ఆఖరు నాటికి వంద శాతం కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే తొలి విడతగా రాబోయే ఆగస్టు 15వ తేదీ నాటికి 562 సంఘాల్లో సేవలను ప్రారంభించేందుకు ఐటీ శాఖ మద్దతుతో లైసెన్సులు, ఆన్‌లైన్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పటికే 15 కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. అలాగే డిజిటల్ సేవలతో పాటుగా ప్రభుత్వ, వ్యాపార విభాగాలు కూడా ఇక్కడే కొలువుదీరనున్నాయి.అయితే ఈ కామన్ సర్వీస్ సెంటర్లలో ఆధార్ కార్డు అప్‌డేట్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ దరఖాస్తులు, ఓటరు గుర్తింపు కార్డులు, జనన మరణాల నమోదు చేసుకోవచ్చు. అంతేకాకుండా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, భూసార పరీక్ష కార్డులు, డెయిరీ, మత్స్య పరిశ్రమ సేవలు, రేషన్, గోదాముల నిర్వహణ వంటి సేవలను కూడా అందిస్తారు. అలాగే జీవన్ ప్రమాణ్ పత్రాలు, శ్రమయోగి మాన్‌ధన్ పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు, ఐటీ రిటర్నుల దాఖలు, జీవిత బీమా, విద్యుత్, నీటి బిల్లుల చెల్లింపులు, వాహన్, ఈ చలాన్, ఈ స్టాంపుల జారీ, బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్ సదుపాయం కూడా ఇక్కడ లభిస్తుంది.వీటన్నింటితో పాటు భవిష్యత్తులో ఈ సహకార సంఘాలను జన ఔషధి కేంద్రాలుగా మార్చి.. రాయితీ ధరలపై నాణ్యమైన ఔషధాలను విక్రయించడానికి కూడా ప్రత్యేక లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఈ చొరవతో గ్రామీణ ప్రజల సమయం, డబ్బు భారీగా ఆదా కానున్నాయి.

# హన్మకొండ జిల్లాలో హైడ్రా తరహా కూల్చివేతలు

**హన్మకొండ:** హన్మకొండలో శనివారం ఉదయం హైడ్రా తరహా కూల్చివేతలు కొనసాగాయి. కోర్టు నుండి స్టేటస్ కో ఆర్డర్ ఉన్నా కూడా మున్సిపల్, కుడా అధికారులు కనికరించలేదనా బాధితులు ఆరోపించారు. గతంలో గుడిసెలు కూల్చుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. ఇప్పుడు దగ్గరుండి కూల్చివేతలకు కాంగ్రెస్ నాయకులు సహకరిస్తున్నారని బాధితులు మండిపడ్డారు. శనివారం, ఆదివారం కోర్టులకు సెలవు కావడంలో కూల్చివేతలకు ప్రణాళికలు వేసారని ఆరోపించారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యం చేస్తున్నరని గుడిసెవాసుల ఆవేదన.

# నీట్ పరీక్షా సమయం పెంపు

**న్యూఢిల్లీ:** నీట్ పరీఓఆ సమయాన్ని ఎన్టీఏ అదనంగా 15 నిమిషాలు పెంచింది. మధ్యాహ్నం 2 నుంచి 5.15 గంటల వరకు పరీక్ష వుంటుంది. రఫ్ వర్క్ పేజీలు నాలుగుకు పెరగనుంది. ఎడమ చేతివాటం విద్యార్థులకు అనుకూలంగా బుక్లెట్ డిజైన్ చేసారు. జూన్ 21న జరగనున్న నీట్ రీ--ఎగ్జామ్కు పక్కాగా ఏర్పాట్లు చేసారు.

# ఉపాధి హామీ కూలిలన పరామర్శించిన మంత్రి పొన్నం



**హుస్నాబాద్:** హుస్నాబాద్ నుండి కరీంనగర్కు వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యంలో ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహిస్తున్న కూలీలను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల పురోగతి, పనుల నిర్వహణ, వేతనాల చెల్లింపులు, పని పరిస్థితుల గురించి కూలీలతో మాట్లాడారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేసారు. గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోంది. కూలీల సంక్షేమానికి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకం సమర్థవంతంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేస్తున్నానని అన్నారు.

# తాటి చెట్టు కూలి మహిళ మృతి

**రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. భారీ ఈదురుగాలులకు తాటి చెట్టు కూలిపడి ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. సభావత్ లక్ష్మి తన కుమారుడు వెంకట్ రామ్, కోడలు లలితతో కలిసి రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఓ రేకుల ఇంట్లో అద్దెకు నివాసం ఉంటున్నారు.వీరంతా వికలాంగులేనని స్థానికులు తెలిపారు. నిన్న రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో బలమైన ఈదురుగాలులు వీచడంతో ఇంటి పక్కనే ఉన్న తాటి చెట్టు ఒక్కసారిగా కూలి, ఇంట్లో నిద్రిస్తున్న లక్ష్మి కుటుంబ సభ్యులపై పడింది.ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన సభావత్ లక్ష్మిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు.కుమారుడు వెంకట్ రామ్, కోడలు లలిత స్వల్ప గాయాలతో బయటపడ్డారు ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# రైతుల ముంగిటకు 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్'

**ఎరువుల పంపిణీలో పారదర్శకతే లక్ష్యం**

**అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్**

**షాద్‌నగర్‌లో ఎరువుల దుకాణాల తనిఖీ**

**రంగారెడ్డి జిల్లా జూన్ 13 : (స్కై న్యూస్)** రైతులు ఎరువుల కొనుగోలులో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరల విక్రయాలు వంటి సమస్యలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్' ను అందుబాటులోకి తీసుకువచ్చిందని రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు షాద్‌నగర్ పట్టణంలోని రాఘవేంద్ర ఫర్టిలైజర్స్‌తో పాటు పలు ఎరువుల దుకాణాలను ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు అనంతరం నందిగామ మండలంలో కూడా యాప్ అమలు తీరును, డీలర్ కేంద్రాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఇటీవల వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రస్తావించిన సమస్యల నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టడం గమనార్హం విజయ్ కుమార్ మాట్లాడుతూ, గతంలో రైతులు ఎరువుల కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చేదని, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయాలు, ఇతర వస్తువులను బలవంతంగా కొనిపించడం వంటి




ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు ఈ యాప్ ద్వారా రైతులు ఇంటి నుంచే ఎరువులను బుక్ చేసుకునే అవకాశం కల్పించామని, దీంతో సమయ ఆదాతో పాటు పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు ప్రస్తుతం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు ఓటీపీ కొంతమంది రైతుల వేలిముద్రలు నమోదుకాక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ దృష్టికి విషయం తీసుకెళ్లామని, దాంతో వేలిముద్రల స్థానంలో ఓటీపీ ఆధారిత కొనుగోలు విధానం అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు గతంలో యాప్‌లో బుక్ చేసిన ఎరువులను రెండు రోజుల తర్వాత మాత్రమే పొందే నిబంధన ఉండేదని, రైతుల విజ్ఞప్తి మేరకు ఇప్పుడు బుక్ చేసిన రోజే ఎరువులు పొందే అవకాశం కల్పించినట్లు వివరించారు యాప్‌లో స్టాక్ వివరాలు కనిపించకపోవడం, భూవిస్తీర్ణ నమోదు సమస్యలు వంటి సాంకేతిక లోపాల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ పనిచేస్తోందని తెలిపారు రైతులు, డీలర్ల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నామని చెప్పారు ప్రతి గ్రామానికి ముగ్గురు సాయిల్ హెల్త్ వాలంటీర్లను ప్రభుత్వం నియమించిందని విజయ్ కుమార్ తెలిపారు వీరు మట్టి నమూనాల సేకరణ, పరీక్షలు నిర్వహించి రైతులకు తగిన ఎరువుల వినియోగంపై సూచనలు అందిస్తారని చెప్పారు అలాగే స్మార్ట్‌ఫోన్ లేని రైతులు లేదా యాప్ వినియోగం తెలియని వారికి ఎరువుల బుకింగ్‌లో ఉచితంగా సహాయం చేస్తారని వివరించారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి శైలజ, ఏడీఏస్‌లు సత్యంబాబు, మాధవి, షాద్‌నగర్ ఏడీ రమాదేవి తదితర వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు యాప్ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ఎరువుల కొనుగోలు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రైతు ధర్నా చేపట్టిన బిఆర్ఎస్ నాయకులు

**బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బసవరాజ్ గౌడ్**





**దేవరకద్ర, భూత్పూర్ జూన్ 13 (స్కై న్యూస్);** కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా భూత్పూర్ మండల కేంద్రంలో శనివారం బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బస్వరాజ్ గౌడ్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలని రైతుల పట్ల వివక్ష వీడి రైతు సమస్యలు పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న బోనస్ వెంటనే ఇవ్వాలని, వాన కాలం సీజన్ మొదలైన సందర్భంగా రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని యూరియా యాప్ ను తొలగించి పాత పద్ధతిలోనే రైతులకు సరిపడా యూరియా బస్తాలను అందించాలని డిమాండ్ చేశారు.బిఆర్ఎస్ పార్టీ రైతుల పట్ల గత ప్రభుత్వంలో రైతులకు ఎంతో మేలు చేసిందని అన్నారు. ఎప్పటికైనా రైతులకు అండగా నిలిచే పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని తెలియజేశారు.ఇక నుండి అయినా ప్రభుత్వం దిగి వచ్చి రైతులకు సంబంధించి యూరియా, ఎరువులు మొదలగు రైతుకు సంబంధించిన సామాగ్రి సకాలంలో అందించే వరకు రైతుల పట్ల ఇలాగే పోరాటం చేస్తామని తెలియజేశారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శితూము శ్రీనివాస్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ కౌన్సిలర్ గడ్డం ప్రేమ్ కుమార్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, నరేష్ గౌడ్,టి మురళీధర్ గౌడ్, నారాయణ గౌడ్,సత్యనారాయణ, పి నరసింహ గౌడ్, సత్యనారాయణ,వివిధ గ్రామాల బిఆర్ఎస్ సర్పంచులు, గ్రామాల మాజీ పార్టీ అధ్యక్షులు,మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు,వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

# మహిళ సంఘాల చేతికి సోలార్ పవర్

**ఇందిరమ్మ రాజ్యం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల అభివృద్ధి సంక్షేమం కోసం**

**సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.**

**దేవరకద్ర జూన్ 13 (స్కై న్యూస్);** దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి శనివారం భూమి పూజ చేసి ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు చిన్న, చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా, వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని సోలార్ ప్లాంట్ లు, పెట్రోల్ బంకులు మహిళా సంఘాలకు కేటాయించామన్నారు.ఈ సోలార్ పవర్ ప్లాంట్ లు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు, అనుమతులు, పెట్టుబడికి ప్రభుత్వ పరంగా పూర్తి సహకారంఅందజేశమన్నారు. పవర్ ప్లాంట్ వల్ల వచ్చే ఆదాయం నేరుగా మహిళా సంఘాల సభ్యులకే చేరుతుందన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం మొదటి సంతకం మహాలక్ష్మి పథకం అమలు చేసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని గుర్తు చేశారు.మహిళా స్వయం సంఘాల కోసం వడ్డీ లేని రుణాలను పెద్ద ఎత్తున అందజేస్తున్నామన్నారు. అంతేకాక మహిళా సంఘం సభ్యురాలికి పది లక్షల బీమా సౌకర్యం కల్పించామన్నారు.మహిళాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో అన్నిరకాల పథకాలను మహిళల పేరు మీదనే అమలు చేస్తుందని తెలిపారు.ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, మహాలక్ష్మి పథకం, సోలార్ పవర్ ప్లాంట్‌లు, పెట్రోల్ బంక్ లు, మహిళలకు వడ్డీ లేని ఋణాలు, ఆర్టీసీ బస్సులు మహిళా సంఘాలకు





అందజేశామన్నారు.దీనివల్ల మహిళల ఆదాయం పెరిగి, వారి కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడి, మహిళలు ఆర్థిక స్వాలంబన సాధిస్తారని అన్నారు.మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండి, ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీశ్రీ పెద్దమ్మతల్లి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ ఆత్మకూరు



**ఆత్మకూరు జూన్ 13( స్కై న్యూస్)** ఆత్మకూరు పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన శ్రీ శ్రీ పెద్దమ్మతల్లి గుడి నిర్మాణం మరియు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట అందరిసహకారంతో గత నెల 13 5వ నెల 2026 అనగా బుధవారం విజయవంతంగా జరిగిన సంఘటన మీకు అందరికీ తెలిసిన విషయమే ఈ గుడి నిర్మాణం కావాలని పెద్దమ్మ తల్లి పునర్నిర్మాణ కమిటీ వారు గత రెండు సంవత్సరాల నుండి కృషి చేశారు వారి కృషితో పాటు గ్రామ పెద్దలు కుల సంఘాలు భక్తార్థులు సహకారంతో విజయవంతంగా శ్రీ పెద్దమ్మ గుడి నిర్మాణం మరియు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూర్తి అయినది అదేవిధంగా అమ్మవారి ప్రతిష్ట పూర్తి చేసుకొని పెద్దమ్మతల్లి 41 రోజుల మండల పూజ మరియు అన్ని గుడుల గ్రామదేవతలు(శ్రీ కర్రెమ్మ తల్లి,పోచమ్మ తల్లి,భూ లక్ష్మమ్మ తల్లి,కోట మైసమ్మ తల్లి ,శ్రీ కట్ట మైసమ్మ తల్లి ,శ్రీ లింగమయ్య స్వామి,గ్రామ నాభి బొడ్రాల దీప స్తంభాలు)ప్రథమ వార్షికోత్సవం 24/06/2026అనగా బుధవారం నిర్మించాలని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ నిర్ణయించడం అయినది కావున ఉదయం06:00గం నుండి జరిగే అమ్మవారి పూజ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మనవి చేస్తున్నాము

**ముఖ్య గమనిక :** శ్రీ పెద్దమ్మ తల్లి పండుగను30-06-2026 అనగా మంగళవారం నాడు నిర్వహించుటకు పురోహితులు శుభముహూర్తాన్ని నిర్ణయించారు

1) అంగరంగ వైభవంగా నిర్వహించబడే శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి పండుగ వ్యయ ప్రయాసలతో కూడుకున్న ఆధ్యాత్మిక మహోత్సవం ఈ పండుగకు పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుండి కాక ఇతర ప్రాంతాల నుండి కూడా వేలాదిమంది భక్తులు తరలివస్తారు 2).కావున భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలి శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి పండుగ విజయవంతంగా నిర్వహించేందుకు పురపాలక పాలకమండలి సభ్యులు మరియు గ్రామ పెద్దలు అధ్వారంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అందరి సహకారంతో పండగను ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది అందులో భాగంగా పోలీస్ అధికారులకు అందరు సహకరించవలసిందిగా ప్రజాప్రతినిధులను కోరడమైనది శ్రీ శ్రీ పెద్దమ్మతల్లి పునర్నిర్మాణ కమిటీ

# శ్రీ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి



**జోగులాంబ గద్వాల జూన్ 13 (స్కై న్యూస్):**ఆదిశీలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని గద్వాల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రం చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో దీరేంద్ర దాస్, మధుసూదనా చారి శశాంక రవి చంద్రశేఖర రావు చంద్రశేఖర్ రెడ్డి సవరణ తదితరులు పాల్గొన్నారు

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం

**సీఎం రేవంత్ విమానం దారిమళ్లింపు**



**రంగారెడ్డి జిల్లా జూన్ 13 : ( స్కై న్యూస్** )హైదరాబాద్ లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడం తో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వాతావరణం అనుకూలించకపోవడంతో సీఎం రేవంత్ ప్రయాణిస్తున్న విమానాన్ని బెంగుళూరుకు దారి మళ్లించారు సీఎం ఢిల్లీ నుంచి 6ఈ717 ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరారు ఈ విమానం శుక్రవారం రాత్రి 9.20 గంటలకు శంషాబాద్‌లో ల్యాండ్ కావాల్సి ఉంది ఆ సమయానికి విమానాశ్రయంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది విమానం ల్యాండ్ చేసే అవకాశం లేకపోవడంతో ఏటీసీ సూచనల మేరకు పైలట్ విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు ఆ విమానం బెంగళూరులో సురక్షితంగా ల్యాండ్ అయిందని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి సీఎం రేవంత్ శనివారం హైదరాబాద్ రానున్నారు కాగా, భారీ వర్షం వల్ల రంగారెడ్డి లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

## మీనాక్షి నటరాజన్ పరిస్థితి చూశారు కదా..?

# రాహుల్ ప్రధాని కావడం ఖాయం

**బీజేపీ వైఖరిపై షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఫైర్**






**రంగారెడ్డి జిల్లా, జూన్ 13: (స్కై న్యూస్)** షాద్‌నగర్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల సమగ్ర జాబితా (ఎస్ఐఆర్) అవగాహన సదస్సులో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, దేశంలో బీజేపీ ఓట్ల చోరీ నుంచి సీట్ల చోరీ వరకు పాల్పడుతోందని ఆరోపించారు తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ దరఖాస్తు తిరస్కరణ ఘటన దీనికి నిదర్శనమని పేర్కొన్నారు దేశంలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని, మత విద్వేషాలను రెచ్చగొట్టి దేశాన్ని అశాంతి వైపు నెడుతున్నారని విమర్శించారు దేశానికి సేవలందించిన మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ వంటి మహనీయులపై కాషాయ శక్తులు విషప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు ప్రజలు ప్రస్తుత రాజకీయ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్ గాంధీ దేశ ప్రధానమంత్రి అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో, ఇటీవల మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో చర్చనీయాంశంగా మారిన మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై కూడా ఎమ్మెల్యే స్పందించారు ఆమెకు సంబంధించిన పాత కోర్టు కేసు కొత్త లీగల్ మలుపు తిరిగిందని పేర్కొన్నారు హైదరాబాద్ నాంపల్లి కోర్టులో దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించిందని, ప్రజాప్రతినిధులకు సంబంధించిన కేసులను విచారించే ప్రత్యేక పరిధి తమకు లేదని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను పిటిషనర్‌కు తిరిగి ఇచ్చిందని తెలిపారు ఈ పరిణామం న్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిందన్నారు ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి యోగీశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోత్స్న చౌదరి, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘు నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, బీఎల్ఏలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయంలో భక్తుల పూజలు

**మల్దకల్, జూన్ 13(స్కై న్యూస్):**ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ముక్కులు సమర్పించుకున్నారు. శ్రీ తిమ్మప్ప స్వామి గోవిందరాజస్వామి లక్ష్మీదేవి ఈశ్వర ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన సత్రంలో నాగర్ దొడ్డి గ్రామానికి చెందిన పరుశురాముడు శారదమ్మ సమారన్న రాజేశ్వరి దంపతులు అన్నదానం ఏర్పాటుచేయగ ఆలయ చైర్మన్ శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేసిన దాతలకు స్వామివారి శేష వస్త్రం



చిత్రపటాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో చంద్రశేఖర రావు, రవి, చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ భర్త గోపాల్,ఆరగిద్ద రాముడు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయండి

**షాద్‌నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ పిలుపు**



**రంగారెడ్డి జిల్లా, జూన్ 13 (స్కై న్యూస్):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం షాద్‌నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ పిలుపునిచ్చారు ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు జూన్ 14న షాద్‌నగర్ పట్టణంలో రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ మహాసభలో గత మూడు సంవత్సరాలుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లపై సమగ్ర సమీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు అలాగే భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడంతో పాటు వ్యవసాయ కార్మికుల హక్కుల సాధన కోసం చేపట్టాల్సిన ఉద్యమాలు, కార్యక్రమాలపై విస్తృత చర్చ జరగనున్నట్లు తెలిపారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు శ్రీను నాయక్ వెల్లడించారు వ్యవసాయ కార్మికుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడటమే సంఘం ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికులు, సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని శ్రీను నాయక్ కోరారు. మహాసభలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్‌లో వ్యవసాయ కార్మికుల ఉద్యమాలకు దిశానిర్దేశం చేస్తాయని ఆయన తెలిపారు.

వార్తాతరంగాలు
ఆదివారం 14 జూన్ 2026

# బూత్‌లో గెలిస్తే రాష్ట్రంలో గెలిచినట్టే

## ఫ్రాంక్‌ఫర్ట్-శంషాబాద్ లుఫ్తాన్సా విమానానికి బాంబు బెదిరింపు




**రంగారెడ్డి జిల్లా జోన్ 13 ( స్కై న్యూస్ ):** జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి శంషాబాద్‌కు వస్తున్న లుఫ్తాన్సా విమానానికి బాంబు బెదిరింపు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు విమానంలో బాంబు అమర్చినట్లు అది ల్యాండింగ్‌కు ముందే పేలిపోతుందని పేర్కొంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపు పంపినట్లు సమాచారం బాంబు బెదిరింపు నేపథ్యంలో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు విమానం ల్యాండ్ అయిన వెంటనే భద్రతా సిబ్బంది, బాంబు నిర్వీర్య దళాలు, విమానాశ్రయ అధికారులు తనిఖీలు చేపట్టారు విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అధికారులు పూర్తి స్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నారు విమానం, లగేజీ, కార్గో విభాగాలను ప్రత్యేక బృందాలు పరిశీలిస్తున్నాయి బెదిరింపు ఈ-మెయిల్ విశ్వసనీయతపై దర్యాప్తు కొనసాగుతోందని, తనిఖీలు పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్ణయానికి రావడం సాధ్యం కాదని అధికారులు తెలిపారు ఘటనపై సంబంధిత భద్రతా సంస్థలు, పోలీసులు దర్యాప్తు చేపట్టగా, బెదిరింపు పంపిన వ్యక్తుల వివరాలను గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం పరిస్థితి అధికారుల పర్యవేక్షణలో ఉందని విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి.

## కొత్త కోట దయాకర్ రెడ్డి కి ఘన నివాళి



**ఆత్మకూర్ జూన్ 13( స్కై న్యూస్)** మక్తల్ మరియు దేవరకద్ర నియోజకవర్గంమాజీ శాసనసభ్యులు దివంగత నేత శ్రీ కొత్తకోట దయాకర్ రెడ్డి గారి మూడో వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తూ గుండెలలో నిలిచే రూపం ప్రజాసేవకుఅంకితమైన ప్రస్థానం కష్టం వస్తే కాపాడేంత అండ కార్యకర్తలను ఎప్పటికప్పుడు కంటికి రెప్పలా చూసిన గొప్ప మనసు మహారాజ్ మక్తల్ ప్రగతిరథంగా చరిత్ర పుట్టలో నిలిచిన మీ కీర్తి ఎన్నడు మరువం మా గుండె చప్పుడు మీరు ఎప్పటికీ సాజీవం రాజకీయ అపార భగీరథుడుభౌతికంగా మనల్ని వీడి మూడు సంవత్సరాలు అయినా లేని లోటు ఎవరు భర్తీ చేయలేనిది చరిత్ర చెప్పుకునేలా మక్తల్ దేవరకద్ర నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో నడిపిన మహా నాయకుడు కొత్తకోట దయాకర్ రెడ్డి రాజకీయ గురువుగా ఆత్మీయుడుగా ఆయనతో సాహిత్య సంబంధం ఎల్లప్పుడు గుండెలు దాచుకుంటాను ఆయన వర్ధంతి సందర్భంగా మహనీయుకి మా హృదయపూర్వక ఘన నివాళులు అనే పార్టీ శ్రేణులు పేర్కొన్నారుపార్టీ శ్రేణులుఎస్.టి.డి శ్రీనివాసులు గాలి పంపు శీను జూరాల తిరుపతయ్య గౌడ్ మస్తీపురం బాల్రెడ్డి రామ్ లక్ష్మణ్ రెడ్డి కట్టెల మండి రాములు మాజీ సర్పంచ్ ప్రభాకర్ రావుతదితర వ్యక్తులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తప్పవు అంటున్న డి.ఎస్.పి



**ఆత్మకూరు జూన్ 13( స్కై న్యూస్)** ఆత్మకూరు అమర్ చింత మండలాల్లోని రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్ ప్రమాద స్థలాలను వనపర్తి జిల్లా డిసిఆర్బి డిఎస్పి బాలాజీ శనివారం పరిశీలించారు ఆత్మకూరు పిన్నంచర్ల కొత్తకోట వై జంక్షన్ మూలమల్ల ఎక్స్ రోడ్లో ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన చర్యలు ఆర్ అండ్ బి ఏ ఈ రాకేష్ తో చర్చించారు ఈ కార్యక్రమంలోని సీఐ శివకుమార్ ఎస్సై జయన్న స్వాతి పాల్గొన్నారు యువత రాష్ డ్రైవింగ్ వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ ఆర్ సి ఉండాలని పేర్కొన్నారు ఈ రోజుల్లో మైనర్ కూడా బైకు నడుపుతూ పలుచోట్ల కనిపిస్తున్నారు ప్రమాదాలు జరగడానికి గల కారణాలు కూడా మైనర్ యువత ముందుంది మైనర్లకు బైకులు ఇస్తే వాళ్ళ యొక్క తల్లిదండ్రులనువెంటనే పిలిపించి కౌన్సిలింగ్ ఈయడం జరుగుతుంది అందుకే మీ పిల్లలకు బైకులు ఇవ్వకుండా జాగ్రత్త పడండి కొన్ని ప్రమాదాలను అరికట్టవచ్చు అని చెప్పడం చెప్పడం జరిగింది

## ఇంటర్నేషనల్ డాక్టర్స్ డేకు డాక్టర్ వేణు గోపాల చారిని ఢిల్లీకి ఆహ్వానించిన ఆది లీల ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఆదినారాయణ



**హైద్రాబాద్ జూన్ 13** :జూలై 1న ఢిల్లీలో ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఇంటర్నేషనల్ డాక్టర్స్ డే ఉత్సవాలకు ఆది లీల ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఆదినారాయణ డాక్టర్ వేణు గోపాల చారిని స్వయంగా కలిసి ఆహ్వానించారు వివిధ రాష్ట్రాల లో సేవలందిస్తున్న వైద్యులను సత్కరిస్తున్న సందర్భంగా నాయకుడు మరియు వైద్యుడైన వేణుగోపాల చారి గారిని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించడం జరిగిందని డాక్టర్ ఆదినారాయణ తెలిపారు ఈ కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు ఆదిలీల ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వీర బొమ్మ రమేష్ మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు కేబీ శ్రీధర్ సామాజికవేత్త కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

---

**బీజేపీ అరాచకాలను అణగదొక్కుదాం**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి**

**కాంగ్రెస్ నాయకుల పిలుపు**





**రంగారెడ్డి జిల్లా జూన్ 13 ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లకు (బీ ఎల్ ఏ)లు అవగాహన శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి యోగీశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షురాలు జ్యోత్స్న చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముకలాంటివారని, ప్రజాస్వామ్య పరిరక్షణలో వారి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు రాబోయే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బూత్‌లో గెలిస్తే రాష్ట్రంలో గెలిచినట్టే అని పేర్కొన్నారు ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యమని, బూత్ స్థాయిలో విజయం సాధిస్తే రాష్ట్ర స్థాయిలోనూ విజయం సాధించవచ్చని అన్నారు యువత, మహిళలు, అణగారిన వర్గాలకు చెందిన అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా నమోదు చేయించేందుకు బీఎల్‌ఏలు ప్రత్యేక కృషి చేయాలని పిలుపునిచ్చారు అలాగే ప్రతిపాదిత ఓటరు తొలగింపులను జాగ్రత్తగా పరిశీలించి, ఒక్క నిజమైన ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు శిక్షణలో అందజేసిన బీఎల్‌ఏ హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా అధ్యయనం చేసి, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, చట్టపరమైన నిబంధనలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని కోరారు టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి యోగీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయించడమే కాంగ్రెస్ కార్యకర్తల ప్రధాన బాధ్యతగా భావించాలని అన్నారు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలని సూచించారు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇది కీలక దశ అని పేర్కొన్నారు దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తోందని నాయకులు తెలిపారు బూత్ స్థాయిలో ఓట్లను కాపాడుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కూడా కాపాడినట్లేనని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, చౌదరిగూడ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కొత్తూరు మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, నందిగామ మండల అధ్యక్షుడు కుమార్ గౌడ్, కొందుర్గు మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, కేశంపేట మండల అధ్యక్షుడు రమేష్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విశ్వాసం...అభివృద్ధి...సంక్షేమం...తో


# ప్రపంచ నేతగా ఎదిగిన ప్రధాని మోడీ

**ఎమ్మెల్సీ ఎ వి ఎన్ రెడ్డి**




**నారాయణపేట జూన్ 13:( స్కైన్యూస్)** ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల విశ్వాసం,అభివృద్ధి,సంక్షేమం అనే సూత్రంతో పని చేసి నేడు ప్రపంచ నేతగా ఎదిగా రని బిజెపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ వి ఎన్ రెడ్డి అన్నారు.శనివారం ఆయన నారాయణపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ,కే.రతంగ్ పాండురెడ్డి,బి.కొండయ్య,పగుడాకుల శ్రీనివాసులు,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ లతో కలిసి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ముందు దేశం తరువాత అభివృద్ధి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అలుపెరగక పని చేస్తూ 12 ఏళ్లుగా అతిపెద్ద ప్రజాస్వా మ్య దేశం అయిన భారత ప్రధానిగా రికార్డులు సృష్టిస్తూ కొనసాగుతున్నారని అన్నారు.గత ప్రభుత్వాల్లో అనేక స్కాములు జరిగాయని కేంద్రమంత్రులు,ఎమ్మెల్యేలు జైలు జీవితం గడిపారని అన్నారు.కానీ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో నేడు ప్రతి పక్షాలతో సహా మీడియా కూడా తప్పు పట్టని స్వచ్ఛ మైన పాలన అందిస్తున్నారని అన్నారు.దేశ రక్షణకు ప్రాధాన్యమిస్తూ స్వదేశీ పరిజ్ఞానంతో మిస్సైల్స్ వరకు ఉత్పత్తి చేసి సత్తా చేస్తారని తెలిపారు.అలాగే ప్రధానంగా రోడ్లు అభివృద్ధి చెందితే ప్రజలు అన్ని రకాలుగా బాగుంటారని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి తీసుకు వచ్చిన సడక్ యోజన కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆధ్వర్యంలో రోజుకు దేశ వ్యాపారంగా 35 కిలో మీటర్ల హైవే రోడ్లు పనులు సాగుతున్నాయని అన్నారు.అభివృద్ధి విషయానికి వస్తే స్వాతంత్రం వచ్చిన గత 70 ఏళ్లలో జరుగని అభివృద్ధి జరిగిందన్నారు.ప్రజల సంక్షేమం విషయంలో ఉచిత పథకాలు అమలు చేయకుండా సబ్సిడీలు ఇస్తూ ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుస్తున్నారని అన్నారు.కేవలం అధికారం కోసం ఉచిత హామీలు ఇస్తూ ఖజానా ఖాళీ చేశారని ఇండియా కూటమి పార్టీలను విమర్శించారు. ఏ పార్టీ మతరాజకీయాలతో మనుగడ సాధించలేవని అన్నారు.అదే సూత్రంతో ప్రధాని నరేంద్రమోడీ దేశం,అభివృద్ధి,సంక్షేమం స్ఫూర్తితో దేశాన్ని ముందుకు తీసుకొని పోతున్నారని అన్నారు.ప్రజలకు కావాల్సింది ఉచిత విద్య వైద్యం అన్నారు.వాటి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.కోవిడ్ సమయంలో అతి పెద్ద జనాభా ఉన్న భారతదేశంలో ప్రజలు కుప్పతెప్పలుగా చనిపోయారని వివిధ దేశాలు భావించాయని కానీ స్వదేశీ పరిజ్ఞానంతో కొవిడ్ వ్యాక్సిన్ తయారు చేసి దేశ ప్రజలను కాపాడుతూ ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ పంపి ఆదుకున్నారని అన్నారు.చరిత్రను మరువద్దని మరిస్తే పతనం తప్పదని అన్నారు.ఈ సమావేశంలో బిజెపి జిల్లా,పట్టణ నాయకులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో అక్రమ లింగ నిర్ధారణ రాకెట్ భగ్నం






**రంగారెడ్డి జిల్లా జూన్ 13 ( స్కై న్యూస్ ) :** రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ పరిధిలో అక్రమ లింగ నిర్ధారణ రాకెట్‌ను పోలీసులు భగ్నం చేశారు వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిపై నిర్వహించిన డికాయ్ ఆపరేషన్‌లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసుల వివరాల ప్రకారం, వనస్థలిపురంలోని ఆసుపత్రిలో గర్భంలోని శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ప్రత్యేక నిఘా పెట్టారు ఈ క్రమంలో మహిళా పోలీసును డికాయ్‌గా పంపించి ఆధారాలు సేకరించారు పరీక్షలు నిర్వహిస్తామని ఆసుపత్రి సిబ్బంది హామీ ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగారు ఆసుపత్రి డైరెక్టర్ కొర్ర రాజుతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు నిందితులు గర్భిణులను తుక్కుగూడలోని ఓ క్లినిక్‌కు పంపిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది తదనంతరం క్లినిక్‌పై దాడి నిర్వహించిన పోలీసులు అక్కడ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను పట్టుకున్నారు రిసెప్షనిస్ట్ లోకేశ్‌ను కూడా అరెస్ట్ చేశారు నిందితులపై గర్భధారణకు ముందు మరియు ప్రసవానికి ముందు నిర్ధారణ పద్ధతుల (లింగ ఎంపిక నిషేధం) చట్టం -- పి సి పి ఎన్ డి టి యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు గర్భంలోని శిశువు లింగాన్ని వెల్లడించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు ఈ ఘటనపై వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు లింగ వివక్షను అరికట్టడం, బాలికల హక్కులను పరిరక్షించడం కోసం ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

## కోటకొండ రోడ్డు పూర్తి చేయకపోతే

# ఎమ్మెల్యే,కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తాం

**రోడ్డు కోసం బిజెపి,బి ఆర్ ఎస్ రాస్తారోకో**






**నారాయణపేట జూన్ 13: (స్కైన్యూస్)** నారాయణపేట మండ లం కోటకొండ రోడ్డు ను వెంట నే పూర్తి చేయకపోతే ఎమ్మెల్యే,కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తాం అని బిజెపి,బి ఆర్ ఎస్ నాయకులు హెచ్చ రించారు.అప్పక్ పల్లి నుంచి కోటకొండ,కోయిల్ కొండ రోడ్డులో అమిరెడ్డి పల్లి, బొమ్మనుపాడ్ మధ్య 4 కిలోమీటర్ల రోడ్డును పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బిజెపి,బి ఆర్ ఎస్ పార్టీల ఆధ్వర్యంలో శనివా రంకోటకొండ,అభంగపూర్,బందగొండ,తిరుమలాపూర్,ఉంట కుంట తాండా,బోమన్ పాడ్ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అప్పక్ పల్లి వద్ద హైదరాబాద్ రోడ్డుపై భారీ రాస్తారోకో నిర్వహించారు.దాంతో వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు అవస్థలు పడ్డారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు పగుడాకుల శ్రీనివాసు లు ,జిల్లా బిజెపి ఉపాధ్యక్షు డు కంచె శ్రీనివాసులు,బి ఆర్ ఎస్ నాయకులు మాజీ ఎంపీ పీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షు డు వేపూర్ రాములు మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో అప్పక్ పల్లి నుంచి కోటకొండ మీదుగా కోయిల్ కొండ వరకు డబుల్ రోడ్డు మంజూ రు అయి పనులు జరిగా యని అన్నారు.కానీ అమిరె డ్డి పల్లి నుంచి బొమ్మను పాడు వరకు 4 కిలోమీటర్ల రోడ్డును అసంపూర్తిగా ఉంచారన్నారు.దాంతో గత రెండు ఏళ్లుగా రోడ్డు పూర్తికా క ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా అవస్థలుపడుతున్నారన్నారు.వర్షాకాలంలో రొద్దు గుంతలమయం అయి అనేక ప్రమాదాలు జరుగుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశా రు. ఏ అత్యవసర పరిస్థితి ఉన్న తొందరగా వెళ్లడానికి విలుకాకగర్భిణీలు,విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 ఏళ్లు కావస్తున్న ఎమ్మెల్యేకు అధికారులకు ఏమాత్రం ఈ రోడ్డుపై పట్టింపు లేదన్నా రు.పక్కనే సి ఎం నియోజక వర్గంలో గ్రామ గ్రామానికి డబుల్ రోడ్డు పూర్తి అవు తున్నా కేవలం 4 కిలోమీటర్ల రోడ్డును ఎమ్మెల్యే పట్టించు కోవడం లేదని విమర్శించా రు.వెంటనే రోడ్డు ను పూర్తి చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఎమ్మె ల్యే,కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరిం చారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచు లు,బిజెపి,బి ఆర్ ఎస్ నాయకులు,మహిళలు,ప్రజలు పాల్గొన్నారు.

# యాప్ వినియోగంపై రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలి

## వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కీలక సూచనలు





**రంగారెడ్డి జిల్లా జోన్ 13 : ( స్కై న్యూస్ )** వ్యవసాయ రంగంలో ఎరువుల పంపిణీ కోసం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన డీఏపీ యాప్ విధానంతో రైతులు, ఫెర్టిలైజర్ వ్యాపారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు నందిగామలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలకు అవసరమైన ఎరువులను శాస్త్రీయ పద్ధతుల్లో వినియోగించడంపై పూర్తి అవగాహన లేకుండా వాడుతున్నారని పేర్కొన్నారు గతంలో యూరియా కొరత వస్తుందనే ప్రచారంతో రైతులు అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేసి నిల్వ చేసుకునేవారని గుర్తుచేశారు యూరియా పంపిణీలో యాప్ విధానం ప్రవేశపెట్టిన తర్వాత ఆ సమస్య చాలా వరకు తగ్గిందని తెలిపారు అయితే ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న డీఏపీ యాప్‌లో పలు సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయని, వాటి కారణంగా రైతులు, డీలర్లు ఎరువులు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు యాప్‌లో నమోదులు, సాంకేతిక సమస్యలు, డేటా లోపాలు వంటి కారణాలతో పంపిణీ ప్రక్రియలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు రంగారెడ్డి జిల్లా పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్నప్పటికీ, చాలా మంది రైతులకు స్మార్ట్‌ఫోన్ వినియోగం, యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ విధానం గురించి ఇంకా పూర్తి స్థాయిలో అవగాహన లేదని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు విధానాలు రూపొందించే అధికారుల అంచనాలకు, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులకు మధ్య వ్యత్యాసం ఉందని అన్నారు రాబోయే వ్యవసాయ సీజన్ నాటికి యాప్‌లోని సాంకేతిక సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు గ్రామ స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులకు యాప్ వినియోగంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు ప్రతి గ్రామం నుంచి ఇద్దరు లేదా ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి, వారికి ముందుగా యాప్ వినియోగంపై శిక్షణ అందిస్తే, వారు తమ గ్రామాల్లోని ఇతర రైతులకు ఎరువుల బుకింగ్, కొనుగోలు ప్రక్రియలో మార్గనిర్దేశం చేయగలరని ఎమ్మెల్యే సూచించారు ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్లు కే. విజయ్ కుమార్, బి. నరసింహారావు, ఏడీఏలు మాధవి, సత్యంబాబు, జిల్లా వ్యవసాయ అధికారిణి శైలజతో పాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సీఎం నియోజకవర్గంలో వేరుశనగ విత్తనాల గోల్‌మాల్

### వ్యవసాయ శాఖ అధికారులపై చర్యలు




**వికారాబాద్ జిల్లా జూన్ 13 (స్కై న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో రైతులకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన వేరుశనగ విత్తనాల పంపిణీలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో వ్యవసాయ శాఖ కఠిన చర్యలు చేపట్టింది ప్రాథమిక విచారణలో విత్తనాల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు గుర్తించడంతో పలువురు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు సమాచారం చర్యలకు గురైన అధికారులు దుద్యాల మండల వ్యవసాయ అధికారి (ఏఓ)పై సస్పెన్షన్ వేటు మెట్లకుంట వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ను సేవల నుంచి తొలగింపు గోకఫస్లవాద్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ను కూడా సేవల నుంచి తొలగింపు కొడంగల్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)ను వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ రైతులకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన వేరుశనగ విత్తనాలను అక్రమంగా విక్రయించారనే ఆరోపణలపై జరిగిన విచారణ అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ఈ ఘటన వెలుగులోకి రావడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది విత్తనాల పంపిణీలో జరిగిన అక్రమాల వల్ల ఎంతమంది రైతులు నష్టపోయారు, ఎంత పరిమాణంలో విత్తనాలు దారి మళ్లించబడ్డాయి అనే అంశాలపై అధికారులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, విచారణ నివేదిక, తదుపరి చర్యలపై వ్యవసాయ శాఖ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# 12 ఏళ్ల ప్రధాని మోదీ పాలన చారిత్రాత్మకం

**2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనే లక్ష్యం**

**బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్**



**హైదరాబాద్ జూన్ 13 :**గడిచిన 12 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ గారి సుపరిపాలనలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై తిరుగులేని గౌరవాన్ని, శక్తివంతమైన గుర్తింపును సాధించిందని బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్ అన్నారుభాగ్యనగర్ జిల్లా -- మలక్‌పేట్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ మరియు భారతదేశ ప్రగతికి తీసుకున్న కీలక నిర్ణయాల గురించి మీడియా సమావేశం లో వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజాహిత కార్యక్రమాల వల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వెల్లడించారు.గతంలో అంతర్జాతీయ వేదికలపై భారత్ మాటలకు ప్రాధాన్యత ఉండేది కాదు.. నేడు ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయి.12 ఏళ్ల ప్రధాని మోదీ పాలన చారిత్రాత్మకం – 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనే లక్ష్యం. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజలచే ఎన్నికై, అత్యంత సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసిన ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించారని, ఇది సామాన్యమైన విజయం కాదని, ప్రజల అచంచల విశ్వాసానికి ప్రతీక అని కొనియాడారు. అంతర్జాతీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా మోదీ గుర్తింపు పొందారని పేర్కొంటూ, మోదీ నేతృత్వంలోని గడిచిన 12 సంవత్సరాల కాలం దేశ ప్రగతిలో, సంస్కరణల పరంగా చారిత్రాత్మకమైనవని, 2047 నాటికి భారతదేశం ఖచ్చితంగా 'వికసిత భారత్'గా మారి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ మరియు భారతదేశ ప్రగతికి తీసుకున్న కీలక నిర్ణయాల గురించి వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజాహిత కార్యక్రమాల వల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వెల్లడించారు.ఒక నమ్మకమైన నాయకుడికి ఉండాల్సిన నాలుగు గుణాలు---పారదర్శకత (ఇంటిగ్రిటీ), నిజాయితీ, పని చేసే సామర్థ్యం, ఇచ్చిన హామీలను ఫలితాలుగా మార్చే నైపుణ్యం---ప్రధాని మోదీ లో సంపూర్ణంగా ఉన్నాయని స్పష్టం చేశారు.బీజేపీ వచ్చే ఎన్నికల కోసం కాకుండా, రాబోయే తరం (నెక్స్ట్ జనరేషన్) భవిష్యత్తు కోసం ఆలోచిస్తుందని అన్నారు.ముస్లిం మహిళల జీవితాల్లో శాపంగా మారిన తీన్ తలాక్ సామాజిక దురాచారాన్ని చట్టబద్ధంగా రద్దు చేశామని, వక్ఫ్ చట్టాల్లో అవసరమైన సంస్కరణలను విజయవంతంగా తీసుకువచ్చామని డాక్టర్ ప్రభ గౌడ్ చెప్పారు. కొత్త పార్లమెంట్ భవనంలో చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే చారిత్రాత్మక బిల్లును తీసుకువచ్చామని, మహిళలకు పూర్తి భాగస్వామ్యం, హక్కులు దక్కే వరకు తాము విశ్రమించబోమని, ఇది మోదీ ప్రభుత్వ గ్యారెంటీ అని స్పష్టం చేశారు. గడిచిన 12 ఏళ్లలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆపద్బాంధవుడిగా, విశ్వబంధువుగా నిలిచిందని అన్నారు. 'వసుధైక కుటుంబకం' అనే సందేశాన్ని కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపిన దేశం భారతదేశం అని, కోవిడ్ సంక్షోభ సమయంలో ప్రపంచవ్యాప్తంగా అవసరమైన వ్యాక్సిన్లలో 60% మనదేశంలోనేతయారయ్యాయని, 'వ్యాక్సిన్ మైత్రి' ద్వారా 100కు పైగా దేశాలకు 30 కోట్లకు పైగా కోవిడ్ వ్యాక్సిన్లను పంపిణీ చేశామని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారారని, కానీ తమ అంత్యోదయ విధానం వల్ల గత 12 ఏళ్లలో 25 కోట్ల మంది దేశ ప్రజలను పేదరిక రేఖకు ఎగువకు తీసుకువచ్చామని, అంతర్జాతీయ సంస్థల నివేదికలే దీనిని స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. సమానత్వం (ఈక్వాలిటీ) విషయంలో ప్రపంచంలో భారత్ నేడు నాల్గవ స్థానానికి చేరిందని, రాబోయే 5 నుండి 8 ఏళ్లలో భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందని నొక్కి చెప్పారు. గతంలో బ్యాంకు ఖాతా తెరవాలంటె సిఫార్సులు, సాక్ష్యాలు కావాల్సి వచ్చేదని, మోదీ గారు వచ్చాక 56 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు తెరిపించారని, ఇప్పుడు బ్యాంకే ప్రజల ఇంటి వద్దకు వస్తోందని అన్నారు. దీనివల్ల ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా ఢిల్లీ నుండి పంపిన సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతోందన్నారు. గ్రామీణ మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ దేశంలో 12 కోట్లకు పైగా మరుగుదొడ్లను నిర్మించామని, 2019లో జల్ జీవన్ మిషన్ ప్రారంభించినప్పుడు కేవలం 17% ఇళ్లకు మాత్రమే సురక్షితమైన తాగునీరు అందుతుండగా, ఈరోజు ఆ సంఖ్య 82%కి చేరిందని, కోట్లాది మంది మహిళలకు నీటి కోసం మైళ్ల దూరం నడిచే కష్టం తప్పిందని పేర్కొన్నారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా కోట్లాది ఇళ్లను మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేశామని, ఉజ్వల యోజన ద్వారా పొగ నుండి విముక్తి కల్పించామని, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని వివరించారు. రాజులమని భావించే కాంగ్రెస్ నాయకులకు పేదరికం, గ్రామీణ బాధలు ఎప్పటికీ అర్థం కావని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మరియు పార్టీ నాయకులుగా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్ గారు, పార్టీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుకర్ రెడ్డి , సురేందర్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరేందర్ యాదవ్ , కార్యక్రమ సమన్వయకర్త నరసింహ పాల్గొన్నారు.

## మూడవ రోజు కొనసాగుతున్న బీడీ ప్యాకింగ్ వర్కర్స్ సమ్మె




**చిన్న చింతకుంట జూన్ 13 (స్కై న్యూస్);** చిన్నచింతకుంట మండల కేంద్రంలో బీడీ ప్యాకింగ్ వర్కర్స్ సమ్మె మూడవ రోజు కొనసాగింది. శనివారం రోజు కూడా బీడీ కార్మికులు ప్యాకింగ్ వర్కర్స్ అధిక సంఖ్యలో సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమయం ఉద్దేశించి తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏ కొండన్న, టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు కోళ్ల వెంకటన్న తెలంగాణ ప్రజల బీడీ వర్కర్స్ యూనియన్ సహకార దర్శి వెంకటేష్ గౌడ్ సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులంతా పోరాటంవలనే తమ హక్కులు సాధించుకుంటారని అన్నారు. నేడు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగాలని వీడి యజమానులు నిర్లక్ష్యం వీడి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మం, గోపిరెడ్డి, కురుమూర్తి, రవి, ఇక్బాల్, మాల శేఖర్, సుందర్, బీస్, రాజు, శివ తో పాటు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమ్మె వేతనాలు పెంచేంతవరకు కొనసాగుతుందని తెలియజేశారు.

## రోడ్డుపై చెట్టు కొమ్మలు తొలగించిన ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు రాంచరణ్, జిల్లేడు ప్రవీణ్ పటేల్



**రంగారెడ్డి జిల్లా జూన్ 13 ( స్కై న్యూస్ ) :** రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగూడెం మండలం శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జిల్లేడు వెళ్లే రహదారిపై ఈదురుగాలుల కారణంగా చెట్ల కొమ్మలు విరిగి పడటంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి ఈ విషయాన్ని గమనించిన ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు సభావత్ రాంచరణ్, సామాజిక కార్యకర్త జిల్లేడు ప్రవీణ్ పటేల్ వెంటనే స్పందించారు ఇద్దరూ కలిసి రహదారిపై అడ్డంగా పడిన చెట్టు కొమ్మలను తొలగించి పక్కకు జరిపారు దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలకు ఉపశమనం లభించింది ఉదయం నుంచి రోడ్డుపై పడివున్న కొమ్మలను పలువురు గమనించినప్పటికీ ఎవరూ స్పందించకపోగా, రాంచరణ్, ప్రవీణ్ పటేల్ స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాటిని తొలగించడం స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది ప్రజా సమస్యలను తమ సమస్యలుగా భావించి వెంటనే స్పందించిన ఈ ఇద్దరి సామాజిక బాధ్యత, సేవాభావాన్ని స్థానికులు కొనియాడుతున్నారు చిన్న చర్య అయినప్పటికీ సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు ప్రభుత్వం లేదా అధికారులు వచ్చే వరకు వేచి చూడకుండా, మన పరిసరాల సమస్యలను మనమే పరిష్కరించేందుకు ముందుకు రావడం నిజమైన సామాజిక స్పృహ అని గ్రామస్థులు పేర్కొన్నారు.

# బిజెపి పార్టీ షాద్ నగర్ ఇన్చార్జ్ అందె బాబయ్య ఆధ్వర్యంలో ఎస్.ఐ.ఆర్. అవగాహన ప్రత్యేక సమావేశం

### బీఎల్ఓ-2 లకు కీలక సూచనలు, సమగ్ర అవగాహన





**రంగారెడ్డి జిల్లా జూన్ 13 ( స్కై న్యూస్ ) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బీఎల్ఓ-2లకు (బూత్ లెవెల్ అధికారులు-2) ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్టెన్సివ్ రెవిజన్) ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు షాద్‌నగర్‌లోని ఏబీ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ సమావేశం షాద్‌నగర్ బీజేపీ ఇన్‌చార్జ్ అందె బాబన్న ఆధ్వర్యంలో, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ చారి, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్ సమన్వయంతో జరిగింది సమావేశంలో ముఖ్య వక్తగా పాల్గొన్న అంబుజీ శ్రీనివాస్, ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యత, బీఎల్ఓ-2ల బాధ్యతలు, ఓటరు జాబితాల సవరణ విధానం, అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయడం, తప్పులను గుర్తించి సరిదిద్దడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు ఎన్నికల ప్రక్రియలో బీఎల్ఓ-2ల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఓటరు జాబితాలను పకడ్బందీగా రూపొందించాలని సూచించారు ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితాలు అవసరమని ఆయన పేర్కొన్నారు ఈ సందర్భంగా అందె బాబయ్య, మనోహర్ రెడ్డి, ప్యాట అశోక్, మురళి, చెట్ల వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ 2002 ఓటరు జాబితా, 2025 అక్టోబర్ వరకు ఉన్న తాజా ఓటరు జాబితా, సంబంధిత పుస్తకాల వినియోగం, సవరణ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బీఎల్ఓలకు వివరించారు ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు షాద్‌నగర్ మున్సిపాలిటీ, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో నియమితులైన బీఎల్ఓ-2లు పాల్గొన్నారు ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో చోటు దక్కేలా కృషి చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు.

## 24వ వార్డులో హైమాస్ట్ లైట్ల ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి జిల్లా జూన్ 13 ( స్కై న్యూస్ ) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 24వ వార్డులోని నెహ్రూ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు కాలనీలో చీకటి సమస్య ఉందని స్థానికులు కోరడంతో స్పందించిన ఎమ్మెల్యే హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, 24వ వార్డు కౌన్సిలర్ అగ్గనూరు విశాలా విశ్వం, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు హైమాస్ట్ లైట్ల ఏర్పాటుతో కాలనీలో వెలుతురు సమస్య తొలగిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# చారిత్రక పాలన... పరిణామాత్మక నాయకత్వం

**- శ్రీ సి.పి.రాధాకృష్ణన్**

భారత ప్రజాస్వామ్య చరిత్రలో 2026 జూన్ 10న ఓ కొత్త అధ్యాయం పూర్తయింది. శ్రీమాన్ నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా 4,399 రోజుల నిరంతరాయ పాలన ద్వారా ఆ తేదీ నాటికి చరిత్ర సృష్టించారు. అత్యంత సుదీర్ఘకాలం పదవిలో కొనసాగిన ప్రధానిగా నమోదైన ఈ రికార్డు దేశ పురోగమనంపై ఆయన అచంచల నిబద్ధతను చాటిచెబుతోంది. ప్రజా సంక్షేమం, వారి ఆకాంక్షలపై ఆయన స్థిరమైన అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుంది. అలాగే, దూరదృష్టి గల ఆయన నాయకత్వంపై దేశ ప్రజల చెక్కుచెదరని నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది.

**పరిణామాత్మక నాయకత్వానికి 4,399 రోజులు పూర్తి... కొనసాగింపు**

సుపరిపాలనతోపాటు 'దేశమే ప్రధానం' అనే సూత్ర నిబద్ధతగల ప్రధాన సేవకుడుగా శ్రీమాన్ నరేంద్ర మోదీ దేశంలో అసాధారణ రూపాంతరీకరణ శకానికి నాంది పలికారు. ఒకనాడు అత్యంత అమానుష బానిసత్వ పీడనను నిర్మూలించి, లక్షలాది ప్రజానీకం ఆత్మగౌరవంతో జీవించేలా చేసిన అబ్రహం లింకన్ నాయకత్వ పటిమను మానవాళి చరిత్ర నేటికీ గౌరవిస్తున్నది. అదే తరహాలో 25 కోట్ల మందికి పైగా ప్రజలను దుర్భర పేదరికం నుంచి విముక్తం చేసిన శ్రీ నరేంద్ర మోదీని కూడా భవిష్యత్తరాలు స్మరించుకుంటాయి. ఆయన దార్శనికత, అవిరళ కృషి, పరిణామాత్మక పాలన వల్ల అసంఖ్యాక కుటుంబాలకు అవకాశాలు అందివచ్చాయి. ఆత్మగౌరవం, ఆకాంక్షలకు సాధికారత సహా ఆర్థిక స్వేచ్ఛ, మెరుగైన భవిష్యత్తుకు భరోసా లభించింది. మానవాళి సేవలో ఆయన కృషి ఓ కీలక ఘట్టంగా చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

మరోవైపు ఆయన చేపట్టిన వినూత్న కార్యక్రమాలు విద్య, గృహ వసతి, పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత తదితరాల ద్వారా లక్షలాది ప్రజలకు గౌరవాన్ని, సామాజిక భద్రతను కల్పించాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజారోగ్య కార్యక్రమాలలో ఒకటైన ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 44 కోట్ల మందికి పైగా పౌరులకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ భరోసా లభించింది. అలాగే, జల్ జీవన్ మిషన్ ద్వారా 12 కోట్లకు పైగా గ్రామీణ కుటుంబాలకు నేడు సురక్షిత, విశ్వసనీయ తాగునీటి సరఫరా సదుపాయం కలిగింది. బిందెడు నీటికోసం బండెడు దూరం నడిచే ప్రయాస తప్పి.. ముఖ్యంగా మహిళలకు జీవన నాణ్యత మెరుగుపడింది. అంతేగాక 2020 నుంచి ఉచితంగా ఆహార ధాన్యాల నిరంతర పంపిణీతో దాదాపు 80 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత లభించడం వల్ల దుర్బల వర్గాలు వెనుకబాటు నుంచి విముక్తమయ్యాయి. దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా కుటుంబాలకు సురక్షిత, శాశ్వత సొంత ఇంటి కల సాకారమైంది. ఇది వారిలో భద్రత భావాన్ని, గౌరవాన్ని కలిగించి, భవిష్యత్తుపై ఆశలు చిగురించేలా చేసింది. ప్రతి భారతీయుడి సంక్షేమం దిశగా ఆయన తిరుగులేని నిబద్ధతకు, మానవీయ దృక్పథ సహిత పాలనకు ఈ కార్యక్రమాలన్నీ శాశ్వత ప్రతీకలుగా నిలుస్తాయి. సమాజంలోని ప్రతి వర్గం- మహిళలు, యువత, రైతులు, అణగారిన వర్గాల ప్రజానీకం మొత్తానికీ ప్రధాని మోదీ దార్శనికత సాధికారతనిచ్చింది. దేశవ్యాప్తంగా 3 కోట్ల మందికి పైగా మహిళలు లక్షాధికారులుగా ఆవిర్భవించడం, మహిళల సారథ్యంలో అభివృద్ధి సూత్రం ఆయన దార్శనికతకు ఒక శక్తిమంతమైన నిదర్శనం. నారీశక్తి అభ్యున్నతి దిశగా చేపట్టిన కార్యక్రమాలు దేశ పురోగమనంలో మహిళలు మరింత కీలక పాత్ర పోషించేలా తోడ్పడ్డాయి. కొత్త 'ఐఐటీ'లు, ఎయిమ్స్, వైద్య కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థల స్థాపనతో భారత విద్యా, ఆరోగ్య సంరక్షణ రంగాలు గణనీయంగా విస్తరించి యువతరానికి అపార అవకాశాలను సృష్టించాయి. అదే సమయంలో అద్భుత మౌలిక సదుపాయాల విప్లవానికి యావద్దేశం సాక్ష్యంగా నిలిచింది. వందే భారత్ రైళ్లు, విమానాశ్రయాలు, రహదారులు, రైల్వే స్టేషన్ల సత్వర విస్తరణ తదితరాల నుంచి మారుమూల ప్రాంతాలకు అనుసంధానం కల్పించే వినూత్న ప్రాజెక్టుల దాకా ఓ ఆధునిక, అనుసంధానిత, ఆకాంక్షభరిత భారత్‌కు ఆయన నాయకత్వం పునాది వేసింది. ఈ విజయాలన్నీ దేశంలో ఆర్థిక వృద్ధిని వేగిరపరచడమే కాకుండా లక్షలాది పౌరుల జీవన నాణ్యతను కూడా మెరుగుపరిచాయి. డిజిటల్ ఆవిష్కరణలు, సెమీ-కండక్టర్ అంతరిక్ష సాంకేతికత, టీకాల రూపకల్పన, మొబైల్ తయారీ రంగాల్లో భారత్ ప్రపంచ అగ్రగామిగా రూపొంది, ఆధునిక సాంకేతికతల రీత్యా అంతర్జాతీయ స్థాయిని మరింత పెంచుకుంది. సంప్రదాయ సహిత వికాసం... తమిళ వారసత్వానికి గౌరవం.. తమిళనాడు ముందంజ ప్రగతి.. సంప్రదాయం పరస్పర విరుద్ధాలు కావు... పరస్పరాశ్రితాలనే దృఢ విశ్వాసమే సమకాలీన నాయకులతో పోలిస్తే ఆయన ప్రత్యేకతను చాటుతుంది. "వారసత్వ సహిత వికాసం" అనే దూరదృష్టి గల ఆయన, ఏ దేశమైనా తన నాగరిక వారసత్వంతో లోతుగా ముడిపడి ఉంటూనే వేగంగా పురోగమించగలదని నిరూపించారు. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, తయారీ సహా సామాజిక సంక్షేమం వంటి రంగాల్లోనూ ఆయన సారథ్యాన భారత్ పరిణామాత్మక ప్రగతిని సాధించింది. అదే క్రమంలో ప్రాచీన సంస్కృతి, భాషలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ ప్రతిష్ఠ ఇనుమడించాయి. పవిత్ర క్షేత్రాల పునరుద్ధరణ, సాంస్కృతిక చిహ్నాల పునరుజ్జీవనం, ప్రాచీన భాషలకు గౌరవం, అమూల్య కళాఖండాల పరిరక్షణ తదితరాల విషయంలోనూ ఆధునిక ఆకాంక్షలు, శాశ్వత విలువల అరుదైన సమ్మేళనాన్ని ఆయన పాలన ప్రతిబింబిస్తుంది. ప్రధానమంత్రి శ్రీ మోదీ విధానం దేశ పురోగమనాన్ని వినూత్నంగా నిర్వచించింది. దేశ వాస్తవిక వృద్ధికి ఆర్థిక ప్రగతి ఒక్కటే ప్రమాణం కాదని ఆయన స్పష్టం చేశారు. వారసత్వ పరిరక్షణ, దాన్ని భావితరాలకు సంక్రమింపజేసే సామర్థ్యం కూడా అందుకు కొలబద్ద కాగలదని నిరూపించారు. ఘనమైన గతం వెన్నుదన్నుగా భవిష్యత్తులోకి ధైర్యంగా పాదంమోపే ఆత్మవిశ్వాసంతో కూడిన భారత్ పునరుజ్జీవనానికి ఆయన నిర్దేశించిన "వారసత్వ సహిత వికాసం" మార్గదర్శక సూత్రంగా మారింది. తమిళనాడుతోపాటు అంతర్జాతీయంగా విస్తరించిన తమిళ సమాజం ఈ సిద్ధాంతంతో అత్యధిక లబ్ధి పొందాయి. వారి సుసంపన్న భాషా, సాంస్కృతిక, నాగరిక వారసత్వానికి ప్రధానమంత్రి శ్రీ మోదీ నాయకత్వంలో అసాధారణ గుర్తింపు, మద్దతు లభించాయి. చెన్నై మెట్రో రైలు విస్తరణ, చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే, తమిళనాడు రక్షణ పారిశ్రామిక కారిడార్, ఓడరేవులు-విమానాశ్రయాల ఆధునికీకరణ, జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి, సరికొత్త పంబన్ రైలు వంతెన వంటివి ప్రధాని శ్రీ మోదీ నేతృత్వాన తమిళనాడు పరిణామాత్మక ప్రగతికి తోడ్పడిన కొన్ని కార్యక్రమాలు. భారత దేశంలో సముద్రంపై తొలి నిట్టనిలువుగా లేచే పంబన్ రైలు వంతెన ప్రారంభోత్సవం ఓ కీలక ఘట్టంగా నిలుస్తుంది. భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీక అయిన ఈ వంతెన రామేశ్వరం పుణ్యక్షేత్రానికి అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. ఇక స్వయసమృద్ధ భారత్ దృక్కోణాన్ని దృఢంగా కొనసాగించడం వల్ల, ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్లు, ఐఫోన్ తయారీ తదితరాలకు తమిళనాడు ఒక ప్రసిద్ధ కూడలిగానూ ఆవిర్భవించింది. తమిళ భాష, సంస్కృతి, వారసత్వాలను శ్రీమాన్ నరేంద్ర మోదీ తరహాలో ఇంత నిలకడగా, విస్తృతంగా, ప్రపంచవ్యాప్త ప్రాచుర్యంతో మునుపటి ప్రధానమంత్రులెవరూ ముందుకు తీసుకెళ్లలేదు. తమిళ నాగరికతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయనొక కొత్త గుర్తింపు తెచ్చారు. దేశవిదేశాల్లో తమిళ భాష ప్రాచీనతను, సాహితీ వైభవాన్ని ఆయన నిరంతరం కీర్తించడం ప్రపంచవ్యాప్త తమిళుల హృదయాలను గాఢంగా హత్తుకుంది. మహనీయుడైన ప్రాచీన తమిళ సాధువు 'కణియన్ పూంగున్రనార్' ప్రవచించిన "యాత్తుం ఊరే.. యావరుమ్ కేళిర్" (అన్ని ఊళ్లూ నావే... అందరూ నా వారే) అనే నిత్యసత్య వాక్కును ఐక్యరాజ్యసమితిలో ఆయన ఉచ్చరించిన క్షణం తమిళ నాగరికతకు, భారతదేశానికి ఎంతో గర్వకారణం. ఈ గంభీర సందేశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తేవడం ద్వారా, తమిళ సంస్కృతిలో, దాని సుసంపన్న నాగరిక వారసత్వంలో నిబిడీకృతమైన కాలాతీత మానవతా విలువలను ఆయన ప్రపంచానికి చాటారు. కార్ల్ మార్క్స్‌కు శతాబ్దాల ముందే తమిళులు "యావత్ మానవాళి ఒకటే"ననే ఉదాత్త భావనను సమర్థించారని ప్రపంచ ప్రజానీకం కూడా ఇప్పుడు గ్రహించింది. "వసుధైవ కుటుంబకం" మూలాలు కూడా ఇందులో కనిపిస్తాయి. ఇక కాశీ తమిళ సంగమం, సౌరాష్ట్ర తమిళ సంగమం వంటి కార్యక్రమాలు సాంస్కృతిక బంధాలను బలోపేతం చేస్తూ, దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చే శాశ్వత నాగరికతా బంధంతో పెనవేశాయి. భారత ప్రజాస్వామ్య, నాగరికతా వారసత్వానికి తమిళనాడు చేసిన సేవకు మన కొత్త పార్లమెంటు భవనంలో సెంగోల్ ప్రతిష్ఠాపన తగిన గుర్తింపు. గంగైకొండ చోళపురంలో ప్రధానమంత్రి శ్రీ మోదీ పర్యటన చోళుల వారసత్వ ఘనతను చాటిచెప్పింది. ఇటీవల ఆనైమంగళంలోని చోళుల కాలం నాటి రాగి ఫలకాలు సహా, విదేశాల నుంచి అమూల్య కళాఖండాలు, పురాతన వస్తువులను స్వదేశం రప్పించేందుకు చేపట్టిన కార్యక్రమాలకు విస్తృత ప్రశంసలు లభించాయి. ఆలయాలు, వారసత్వ ప్రదేశాలు, ప్రాచీన సాహిత్యం, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణ దిశగా చేయూత సహా ఇతరత్రా ఆయన చేసిన కృషి తమిళ నాగరికతకుగల అంతర్జాతీయ స్థాయిని కొత్త ఎత్తులకు చేర్చాయి. తమిళ భాష, సంస్కృతిపై ఆయనకు గల నిరంతర గౌరవాన్ని ప్రతిబింబించాయి. ఉపసంహారం ప్రతి యుగంలోనూ సమకాలీన హద్దులకు ఆవలి అంచులను స్పృశించగల దార్శనికత, కార్యాచరణ గల నాయకులు చరిత్రలో అరుదుగా కనిపిస్తుంటారు. ఒక దేశ భవిష్యత్తును తీర్చిదిద్ది, తరతరాలకూ స్ఫూర్తినిస్తారు కాబట్టే అలాంటి 'యుగపురుషులు'గా భావితరాలు గుర్తుంచుకుంటాయి. ఆ కోవలోనే పరిణామాత్మక నాయకత్వం, జాతి ప్రగతిపై అకుంఠిత దీక్ష, ప్రజలకు అవిశ్రాంత సేవ వంటి సుగుణాలున్న సమకాలీన భారత వాస్తవ 'యుగపురుషుడు'గా ఆయనను అభివర్ణించడంలో అతిశయోక్తి లేదు.

ఆయన సమర్థ నాయకత్వం ఈ దేశాన్ని 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపుదిద్దగలదన్నది నా ప్రగాఢ విశ్వాసం.

(వ్యాసకర్త భారత ఉప రాష్ట్రపతి)

## తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా దోసపాటి

**ప్రమాణ స్వీకారం చేసిన ఎస్ కె టి గ్రూప్స్ అధినేత దోసపాటి వెంకటేశ్వరావు**



**కొత్తగూడెం జూన్ 13 (స్కై న్యూస్ ):**తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఎస్ కె టీ గ్రూప్ సంస్థల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరావు..భక్తుల కోసం తిరుమలలో తెలంగాణ భవనం నిర్మాణం చేయదలిచి దాని కోసం చైర్మన్ గా తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు అమరవది లక్ష్మి నారాయణ ఆంధ్ర ప్రదేశ్ రాజకీయవేత్త ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ వెంకటేష్ చేతుల మీదుగా తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా నియామక పత్రం అందుకున్న ఎస్ కె టీ గ్రూప్ సంస్థల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరావు. ఈ సందర్భంగా దోసపాటి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా బాధ్యతలను వమ్ము చేయకుండా తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ భక్తుల కొరకు తిరుపతిలో భవన నిర్మాణం చైర్మన్గా బాధ్యతలు నిర్వహిస్తానని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లాల నుండి ఆర్య వైశ్యులు పాల్గొన్నారు

## ఆడబిడ్డల చేతుల్లోనే తెలంగాణ ఆర్థిక ప్రగతి

**మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా జోన్ 13 ( స్కై న్యూస్ ) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లో మీడియాకు షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి మీడియాకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండి కుటుంబాలతో పాటు సమాజ అభివృద్ధికి కూడా విశేషంగా దోహదపడుతున్నారని అన్నారు మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నాయని తెలిపారు ఆడబిడ్డలు విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో మరింతగా రాణించినప్పుడే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు మహిళల ఆర్థిక భాగస్వామ్యం పెరగడం ద్వారా కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు ప్రతి ఆడబిడ్డ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తన లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

## వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటు

**నమ్మకమైన సీనియర్ నాయకుడిని కోల్పోయాం**


**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**






**కొత్తగూడెం జూన్ 13( స్కై న్యూస్) :** సిపిఐ సీనియర్ నాయకులు పొన్నబోయిన వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటని, ఆయన మరణం అత్యంత బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మేదరబస్తీ ప్రాంతానికి చెందిన సీనియర్ నేత పొన్నబోయిన వెంకటయ్య (65) ఇటీవల మృతిచెందగా, శనివారం ఆయన గృహాన్ని కూనంనేని సాంబశివరావు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన గాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పొన్నబోయిన కుటుంబం పార్టీ బలోపేతానికి, సిద్ధాంతాల వ్యాప్తికి అందిస్తున్న సేవలను కొనియాడారు. వెంకటయ్య లాంటి నిబద్ధత గల నాయకుడిని కోల్పోవడం విచారకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, శోకసంద్రంలో ఉన్న కుటుంబానికి పార్టీ అన్ని విధాలా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్ బండి నర్సింహా, సిపిఐ నాయకులు, వెంకటయ్య కుమారుడు పొన్నబోయిన కుమార్, స్థానిక నాయకులు లింగయ్య, ఆరూరి వెంకటేశ్వర్లు తదితరులు వున్నారు.

## 15న దివ్యాంగుల జిల్లా స్థాయి ఆత్మీయ సమ్మేళనసభా...





**నాగర్ కర్నూల్ జూన్ 13 (స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని బస్టాండ్ పక్కన గల సాయి గార్డెన్ లో ఈ నెల 15న సోమవారం నాడు ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు దివ్యాంగుల జిల్లా అధ్యక్షులు నరందాస్ శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి మొల్గర పరుశరాములు లు తెలిపారు. ఈ ఆత్మీయ దివ్యాంగుల సమ్మేళనానికి రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ముఖ్య అతిథులుగా హాజరై దివ్యాంగుల సమస్యలపై మాట్లాడనున్నారని వారు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని తాలూకా,మండల, గ్రామస్థాయిలోని ప్రతి దివ్యాంగుడు సభలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో దివ్యాంగుల సమస్యలపై మండలం వారీగా సమీక్ష నిర్వహించి దివ్యాంగులకు అవసరమైన అన్ని రకాల న్యాయమైన కోరికలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు వారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగర్ కర్నూలు శాసనసభ్యులు కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. హాజరయ్యే దివ్యాంగులు మరిన్ని వివరాలకు అధ్యక్షులు సెల్ 9885829837, ప్రధాన కార్యదర్శి సెల్ 9010717322లలో సంప్రదించాలని కోరారు.

## భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్ క్షేత్రస్థాయి పర్యటన

**మల్కంపేట చెరువు, టోలిచౌకి పరిసర ప్రాంతాల్లో తనిఖీలు**



**హైదరాబాద్, జూన్ 13(స్కైన్యూస్ )**క్షేత్రస్థాయి పరిస్థితులు, ట్రాఫిక్ సమస్యలపై సైబరాబాద్ సీపీ రమేష్‌తో సమీక్ష చేశారు రహదారులపై నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని పోలీసులకు ఆదేశం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, క్లియరెన్స్‌పై దృష్టి జిల్లాల్లోని పోలీసు అధికారులను అప్రమత్తం చేసిన డీజీపీ.. హై అలర్ట్‌గా ఉండాలని సూచన



,మున్సిపల్, విపత్తు నిర్వహణ శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశాలు,భారీ వర్షాల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచన

# గొంతెండుతున్న నగర బస్తీలు


బిందెలతో యుద్ధం, కుండలతో కొట్లాట, ట్యాంకర్ల వద్ద సిగపట్లు, కుళాయి సమీపంలో ముష్టిఘాతాలు, నీళ్లడిగితే అన్నం తినిపోగానీ నీళ్లయితే ఇవ్వలేం అనే దుస్థితి. ఇదంతా కేరాఫ్ హైదరాబాద్ నగరిలోనే కండ్లకు కనిపిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర రాజధాని, ప్రపంచ ప్రసిద్ధ నగరి భాగ్యనగరంలోని బస్తీల గొంతెండిపోతున్నది. పేరుగొప్ప.. తీరు దిబ్బ అనేట్టుగా వ్యవహరిస్తున్న ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల వైఖరితో కనీసం తాగునీరు దొరక్క జనం అల్లాడుతున్నారు. మసకబారిన బస్తీల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. పొద్దంతా కాయకష్టం చేసుకుని ఇంటికొచ్చిన తర్వాత కనీసం కాళ్లు, చేతులు కడుక్కుందామన్నా నీరు లేని కొంపల్లో ఎలా బతికేది దేవుడా.. అని అటు కనిపించని దేవుడిని, ఇటు కండ్లముందు తిరుగుతున్న పాలకులను వేడుకుంటూ బతుకులెల్లదీస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు జనాలకు నిజంగా నీటి విలువ తెలియలేకుండా సరఫరా సాగింది. కేసీఆర్ మిషన్ భగీరథను ప్రతి గడపకు తీసుకెళ్లి తాగునీటి సమస్య లేకుండా సకల ఏర్పాట్లు చేశారు. నీటి సరఫరా సక్రమంగా జరిగేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించారు. అంతేకాకుండా అధికారులను పురమాయించి వ్యూహాత్మకంగా అమలుకు చొరవ చూపి జనాలకు గొంతెండకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సమయానుకూలంగా జరిగే నీటి సరఫరాతో నీటి వృథాను అరికట్టటమే కాకుండా, పంపిణీ కార్యక్రమాన్ని బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లు అనే తేడా లేకుండా సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవటంతో ప్రజలు గుండెల నిండా ఊపిరి పీల్చుకుని నీటి గోస లేకుండా హాయిగా ఎన్నో ఎండాకాలాలను వెళ్లదీశారు. కోటికి పైగా గల జనాభాను కడుపుల పెట్టుకుని సాదుకుంటున్న మహానగరం నేడు నీటి కరువుతో విలవిల్లాడుతున్నది. తన బిడ్డల గొంతులు ఎండిపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో మాటపెగలక మౌనంగా రోదిస్తున్నది. మండువేసవిలో కడుపు నిండా నీళ్లు తాగడానికి కూడా నోచుకోని బిడ్డల దీనాన్ని చూసి హస్తం పాలకులనేమీ చేయలేక తన అసమర్థతను తానే తిట్టుకుంటూ నిశ్చేష్టురాలుగా నిలుచున్నది. సముద్రం తలాపునే ఉన్నా.. చేప దూపకేడ్సినట్టు రాష్ట్రాన్ని పాలించే పాలకులు, అపర మేధావులు, మహామహా నేతలు నిత్యం తన



నీడలోనే బిజీబిజీగా గడుపుతున్నా తన పిల్లలకు తాగునీటిని ఇవ్వాలనే సోయిలేనితనాన్ని చూసి సిగ్గుపడి సైలెంట్ అయ్యింది. అపార్ట్‌మెంట్లు, కార్యాలయ సముదాయాలు, ఉన్నతంగా నివసించే ప్రముఖ ప్రాంతాలకు నీటిని సరఫరా చేయటానికి చూపించే ఉత్సాహంలో తమబోటి పేదలుండే కాలనీలకు పంపించటానికి కొంతైనా చూపితే ఎంతబాగుండునో కదా అని వేడుకొంటున్నారు. నగరమంతా నీటి కోసం మహా సంగ్రామం చేస్తున్నది. చర్లపల్లి డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీ, సోనియాగాంధీ నగర్, భగవాన్ కాలనీ, మారుతి కాలనీ, సాయినగర్, కృష్ణారెడ్డినగర్, శివసాయినగర్, బీఎన్‌రెడ్డి కాలనీల్లో నీళ్ల కోసం పడిగాపులు పడుతున్నారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణికాలనీ, ఖాజాబాగ్ బస్తీల్లోకి నీటి ట్యాంకర్లే దిక్కు, అవి రాకుంటే దూపతో చావాల్సిందే. బంజారాహిల్స్ పరిధిలోని బంజారాహిల్స్, తట్టిఖానా జలమండలి సెక్షన్ల పరిధిలోని బస్తీల్లో నీటి సమస్య అంతాఇంత కాదు. నందినగర్, వెంకటేశ్వరనగర్, వడ్డెర బస్తీ, లంబాడీ బస్తీ, కేవీఎల్ టవర్స్ తదితర ప్రాంతాల్లో సుమారు రెండునెలలుగా నీళ్ల సరఫరా లేదంటే జనం ఎంత అల్లాడుతున్నారో విశదమవుతున్నది. దాహార్తిని తట్టుకోలేకనే ప్రజలు జలమండలిని ముట్టడించిన ఘటనలూ ఎన్నో ఉన్నాయి. కొండాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, కొత్తగూడ, మియాపూర్, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న అపార్ట్ మెంట్లు, హాస్టళ్లు, కార్పొరేట్ ఆఫీసులకు ఇష్టారీతిన నీటి సరఫరా చేసే పాలకులకు బస్తీలోని జనాలకు కావాల్సిన నీటిని అందించటానికి మాత్రం మనసు రావటం లేదు. కనీస అవసరమైన నీటిని కూడా సక్రమంగా అందించలేని కాంగ్రెస్ సర్కార్ వైఫల్యం ఎక్కడికక్కడ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. కేసీఆర్ హయాంలో పకడ్బందీ ప్రణాళికలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్న దాఖలాలు ఉండబట్టే తొమ్మిదిన్నరేండ్లలో జనం రోడ్డెక్కిన ఛాయలే లేవు. రేవంత్ ప్రభుత్వం జనం గోడు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న తీరుతోనే ఈ దుస్థితి దాపురించిందని భాగ్యనగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గొంతెండుతున్న బస్తీలకు గుక్కెడు నీళ్లు ఇచ్చి ఆదుకోవాలని వేడుకొంటున్నారు.

# భారత నౌకలపై దాడులా?

ప్రపంచానికి పీడలా పరిణమించిన అమెరికా... భారత్ వస్తున్న నౌకలపై తన ప్రతాపాన్ని చూపటం మొదలెట్టింది. మంగళవారం ఒమన్ తీరంలో 24 మందితో వెళ్లే నౌకపై క్షిపణి ప్రయోగించటంతో ముగ్గురు నావికులు మరణించారు. వారిలో ఒకరు ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన పట్నాల సురేష్ అనే చీఫ్ మెరైన్ ఇంజినీర్. అంతకుముందు రోజు సైతం భారత్‌కు వస్తున్న మరో నౌకపై ఇలాగే దాడి జరగ్గా, అందరూ క్షేమంగా బయట పడగలిగారు. ఆ రెండు నౌకలూ భారత్‌కు చెందినవని తెలిసే ఉద్దేశపూర్వకంగా దాడి చేశా రని ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ రెండు ఉదంతాల్లోనూ ఒమన్ సైన్యం మన నావికుల్ని ఆదుకుంది. తమ నిషేధాన్ని ధిక్కరించి ఇరాన్‌నుంచి చమురు కొనుగోలు చేసి వెళు తుండటంవల్లే దాడులు చేశామని అమెరికా సైనిక దళం పశ్చిమాసియా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కాం) అంటున్నది. ఒకపక్క భారత ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రాణ మిత్రుడని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెబుతారు. మనతో వాణిజ్య ఒప్పందం కోసం వెంపర్లాడతారు. కానీ భారత్‌కొస్తున్న వాణిజ్య నౌకలను ధ్వంసం చేస్తారు. అసలు రెండు దేశాల మధ్య కుదిరే వాణిజ్య లావాదేవీలపై, సంబంధం లేని మూడో దేశం ఆంక్షలు విధించటమేమిటి? మనం ఎవరి దగ్గర కొనాలో, కొనకూడదో చెప్పడానికి ట్రంప్ ఎవరు? దాడులు జరిగిన ప్రాంతం అమెరికాకు సరిహద్దేమీ కాదు. ఆ నౌకల గమనంవల్ల దానికి కలిగే ముప్పేమీ లేదు. అయినా ఖండాంతరాలు దాటి, వేల మైళ్లు ఈవలకొచ్చి విధినిషేధాలు పెట్టడం వింత కాదా? ఒక్క సెంట్‌కాం మాత్రమే కాదు... భూగోళమంతటా వేర్వేరు పేర్లతో అమెరికా పహారా కాస్తోంది. ఆఫ్రికాలో 'ఆఫ్రికాం', ఇండో--పసి ఫిక్‌లో 'ఇండోపాకాం', యూరప్‌లో 'ఈయూకాం', ఉత్తరమెరికాలో 'నార్త్ కాం' పేరిట సైన్యాల్ని దించి, క్షిపణులు గురిపెట్టి, యుద్ధ విమానాలు మోహరించి, అక్కడక్కడ అణు బాంబులు పోగేసి దేశాలపై పెత్తనం చలాయిస్తోంది. ఈ లక్షలాదిమంది సైన్యాన్ని పోషించటం కోసం అడ్డగోలు సుంకాలతో, వేరే దేశాలకు భారీనష్టం కలిగే వాణిజ్య ఒప్పందా లతో చెలరేగిపోతోంది. చిత్రమేమంటే... ఒక్కటంటే ఒక్క దేశం 'నీకిక్కడేం పని?' అని అమెరికాను ప్రశ్నించలేకపోతోంది. తాజా దాడుల తర్వాత మన దేశం గట్టిగా స్పందించింది. అమెరికా చార్జ్ డీ ఎఫైర్స్ జాసన్ మీక్స్‌ను పిలిపించి,



'దౌత్యపరమైన నిరసన' తెలిపింది. అందరూ ముక్తకంఠంతో నిరసిస్తేనే ఈ దుర్మార్గం ఆగుతుంది.

అక్రమంగా యుద్ధానికి దిగి, శాంతి ఒప్పందానికి రావాలని ఇరాన్‌ను ట్రంప్ బెదిరి స్తున్నారు. ప్రపంచంలోనే ఎదురులేనిదని గప్పాలు కొట్టుకున్న మిలిటరీ హెలికాప్టర్ అపాచేను అది కూల్చేయటంతో గత మూడు రోజులుగా దాడులు, ప్రతిదాడులతో పశ్చి మాసియా దద్దరిల్లుతోంది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్‌లలోని అమెరికా స్థావరాలపై దాడులు చేసింది. తమ దాడి ఆత్మరక్షణ అని అమెరికా చెప్పు కోవటం సిగ్గుచేటు. ట్రంప్ వచ్చాక అమెరికా రక్షణ శాఖ పేరునే యుద్ధశాఖ అని మార్చాక, అందులో 'ఆత్మరక్షణ' ప్రసక్తి ఎక్కడ? అసలు తమ సరిహద్దులు దాటి వేల కిలోమీటర్ల ఆవలనున్న దేశాలపై దాడులు జరుపుతూ, దానికి ఆత్మరక్షణ అని పేరెట్టడం నయవంచన కాదా? వేరేవాళ్లపై యుద్ధానికి దిగుతూ, అందుకు పర్యవసానాలుండరాదని ట్రంప్ అత్యాశకు పోతున్నారు. స్వల్పకాలంలోనే ఇరాన్ కీలక చమురు క్షేత్రాలున్న ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటానని హెచ్చరికలు జారీచేస్తున్నారు. నాలుగో నెలలోకి ప్రవేశించిన ఈ యుద్ధంవల్ల ఇప్పటికే ప్రపంచ దేశాలన్నీ పెను సంక్షోభంలో కూరుకుపోయాయి. అమెరికా, ఇరాన్ పరస్పర దాడులతో ప్రపంచ చమురు మార్కెట్ ఒక్కసారిగా భగ్గుమంది. దాడులకు వెరవకుండా ఇరాన్ దీటైన జవాబివ్వటంతో అమెరికాకు ఎటూ పాలుబోవడం లేదు. నిజంగా ట్రంప్ అంటున్నట్టు ఖర్గ్ ద్వీపం జోలికిపోతే ఇది మరింత వికటించి, పరిస్థితులు ఇంకా క్షీణిస్తాయి. దురదృష్టమేమంటే, అమెరికాకు ఎవరూ నచ్చజెప్పే స్థితి లేదు. పటిష్టమైన వ్యవస్థలున్నాయనుకున్న ఆ దేశంలోనూ ఏ ఒక్కటీ ట్రంప్‌ను నియంత్రించలేకపోతోంది. అక్కడి ప్రజల్లో కదలికవచ్చి, ట్రంప్‌పై ఒత్తిళ్లు పెరగనంతకాలం ప్రపంచం ఇలా బిక్కుబిక్కుమని బతుకీడ్చక తప్పదు.

# 'ఫిఫా'కు అమెరికా గండం!

మరికొన్ని గంటల్లో ప్రపంచవ్యాప్త సాకర్ అభిమానులను 39 రోజులపాటు ఊగించి, శాసించే క్రీడా సంరంభం మొదలుకాబోతోంది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య(ఫిఫా) నేతృత్వంలో గురువారం అర్ధరాత్రి 12.30 దాటాక (భారత కాలమానం ప్రకారం చెప్పాలంటే శుక్రవారం) ప్రపంచ ప్రసిద్ధ మెక్సికో సిటీ స్టేడియం(ఎస్టాడియో అజకా) వేదికగా మెక్సికో--దక్షిణాఫ్రికా జట్ల మధ్య సాగే తొలి పోరుతో ఈ జాతరకు అంకురార్పణ జరుగుతుంది. 96 యేళ్ల వరల్డ్ కప్ చరిత్రలో ఇలా మూడు దేశాల్లో ఈవెంట్లు నిర్వహించటం ఇదే తొలిసారి. అమెరికా, కెనడా, మెక్సికో 'ఐక్యంగా, ఒక్కటిగా' నినాదంతో కలిసికట్టుగా బిడ్ వేసి గెల్చుకున్నాయి. ఈసారి జట్ల సంఖ్య 32 నుంచి 48కి పెరగటంతో 104 మ్యాచ్‌లు జరుపుతున్నారు. వీటన్నిటినీ ఈ మూడు దేశాల్లోని 16 నగరాల్లో నిర్వహించనుండగా, ఇందులో 78 మ్యాచ్‌లు, కీలక ఈవెంట్లు తమ దగ్గరే ఉండేలా అమెరికా చూసుకుంది. మెక్సికో, కెనడా చెరి 13 నిర్వహిస్తాయి. 'క్రీడలు ప్రపంచాన్ని ఏకం చేస్తాయి... దేశాల మధ్య సరిహద్దులు చెరిపేస్తాయి' అని క్రీడల నిర్వాహకులు తరచు చెప్పేదంతా బడాయి తప్ప నిజం కాదని మళ్లీ రుజువైంది. 'కొత్త బిచ్చగాడు పొద్దెరగడ'న్నట్టు ఈమధ్య శ్వేతజాతి దురహంకారాన్ని ఒళ్లంతా పులుముకుంటున్న అమెరికా, అతిగా వ్యవహరిస్తూ ఈ సంరంభాన్ని నీరుగార్చే పోకడ లకు పోతోంది. ఫిఫా రిఫరీ, సోమాలియా క్రీడాకారుడు ఒమర్ అర్టన్ ఈ సంరంభం కోసం మయామీలో దిగిన వెంటనే ఆయన్ను వెనక్కి పంపింది. ఒమర్‌కు దౌత్య వీసా కూడా ఉంది. అతను 'జాతీయ భద్రత'కు ముప్పు తెస్తాడంటోంది అమెరికా. ఇరాన్ బృందానికి కూడా ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. అరిజోనాలో శిక్షణ మ్యాచ్‌లు నిర్వహించుకోవాల్సిన ఆ బృందం ఈ కారణంగా మెక్సికోకు మార్చుకోవాల్సి వచ్చింది. మ్యాచ్ జరిగే రోజున వచ్చి వెనుదిరగాలట! ఇలాంటి ఆంక్షలు సహజంగానే ఆటగాళ్ల మానసిక స్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. అమెరికా ఉన్మాదం అక్కడితో ఆగలేదు. మ్యాచ్‌లలో ఇరాన్ అభిమానులుగా వచ్చే వారికి సైతం వీసాలు ఎగ్గొట్టింది. షికాగో విమానాశ్రయంలో దిగిన ఇరాక్ బృందం వైస్ కెప్టెన్ ఆయమాన్ హుస్సేనీని నిర్బంధించి, ఏడుగంటలపాటు ప్రశ్నలతో వేధించి, సోదాలు జరిపి విడిచిపెట్టింది. ఆయనతో వచ్చిన బృందం ఫొటోగ్రాఫర్‌ని వెనక్కి పంపింది. సెనెగల్, మొరాకో, ఉజ్బెకిస్తాన్ బృందాల్ని దుస్తులు విప్పించి నేరగాళ్ల మాదిరిగా పరిగణించారు. 90 మంది మొరాకో అభిమానులకూ ఈ 'మర్యాదే' ఎదురైంది. వారి రాకపై సందేహాలున్నాయట! దక్షిణాఫ్రికా బృందం వీసాల కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇంతవరకూ తేల్చలేదు. ఇప్పటికే అమెరికాలో హోటల్ గదులు రిజర్వ్ చేయించుకోవటంతో పలువురికి లక్షల డాలర్లు వృథా అయ్యాయి. చిత్రమేమంటే... ఈ క్రీడాకారులూ, వారి అభిమానుల్లో ఒక్కరంటే ఒక్కరికి కూడా నేరచరిత్ర లేదు. నిజానికి ఉగ్రవాదమంటే వణికే అమెరికా ఈ దేశాలన్నిటిపైనా పలు సందర్భాల్లో దురాక్రమణలకు

## దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం

### రూ.50 వేల చెక్కు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

**రాజన్న సిరిసిల్ల :** ఇద్దరు దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం అందజేశారు.బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కళ్యాణం కొమురవ్వకు నలుగురు పిల్లలు. వారిలో ఇద్దరు దివ్యాంగులు.దివ్యాంగురాలైన సాగరిక,దివ్యాంగుడైన వేణు అనారోగ్యానికి గురయ్యారు.వారికి ప్రభుత్వ,ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం చేయించారు. కొమురవ్వ భర్త గల్ఫ్ కు వెళ్లి అక్కడే మరణించారు.ఆమెకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు.పిల్లలను చూసుకోవడం కోసం తాను ఇంటికే పరిమితమై పోయినది.కూలి పనులకు సైతం కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు.జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి జిల్లా సంక్షేమ అధికారితో విచారణ చేయించి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు.దీంతో వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం రూ.50 వేల చెక్కును అందజేశారు.భవిష్యత్తులో వారికి అవసరమైన సహాయ సహకారా లు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి పీ.లక్ష్మీరాజంను జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.తమ పిల్లలకు ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ కు కొమురవ్వ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు

### అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

**రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాల లో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ అభినందించారు.తంగళ్ళపల్లి మండలంలోని బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బుష్ర కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు,బైపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించినందుకు ప్రతిభా పురస్కారం ఒక్కరికి రూ.15 వేల చొప్పున ఇద్దరికి మొత్తం రూ.30వేలు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేసి అభినందించారు.కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్,సంబంధిత పాఠశాలల ఇంచార్జి ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో అసంపూర్తి పనుల నిర్లక్ష్యం

### డివైడర్‌లో ఇరుక్కున్న మూగజీవాలు

**అన్నపురెడ్డిపల్లి :** భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లిలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులు అస్తవ్యస్తంగా, అసంపూర్తిగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరడంతో, తాజాగా సెంట్రల్ లైటింగ్ కోసం నిర్మించిన డివైడర్ కందకంలో ఒక గేదె ఇరుక్కుపోయి దయనీయ స్థితిలో ఉన్న దృశ్యం స్థానికులను కలచివేస్తోంది.?నిర్లక్ష్యానికి నిదర్శనం సెంట్రల్ లైటింగ్ కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడం వల్ల మూగజీవాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. పనులు సకాలంలో పూర్తి చేయకపోవడమే కాకుండా, కనీస భద్రతా చర్యలు కూడా చేపట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.?ప్రజాధనం వృథా – అధికారుల బాధ్యతారాహిత్యం కి?సెంట్రల్ లైటింగ్ ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.? ఇలాంటి ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.?ప్రభుత్వ ప్రాజెక్టులు ప్రజల సౌకర్యం కోసం ఉండాలి కానీ, ఇలా మూగజీవాలకు మరణశాసనంగా మారడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.?వెంటనే అధికారులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేయాలని, అలాగే ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని

## సన్మానించిన గౌడ గౌడ ప్రభంజనం సేవా

## చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకమైన గౌడ బాంధవుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ గౌండ్ల ఆడబిడ్డ రేణుక ఎల్లమ్మ తల్లి గౌడ నిత్యాన్నధాన సత్రం కొండగట్టు ఫౌండర్ అండ్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్, ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ కోల రాజేశం గౌడ్ లు శుక్రవారం బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను శాలువాతో సత్కరించి గౌడ నిత్యాన్నధాన సత్రం జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా మంద వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్థులు రాజకీయంగా ఎదగాలని అన్ని రంగాలలో ముందుండి గౌడ జాతిని అభివృద్ధి దిశగా తీసుకొని వెళ్ళాలని అన్నారు. రాజకీయ పార్టీలు ఏవైనా కాని గౌడ కులస్థులు ఐక్యంగా ఉండి గౌడ కులస్థుల సమస్యలపై పోరాడాలని కోరారు.మా గౌడ నాయకుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా నియామకం చేసిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం అందుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు కొండగట్టు గౌడ నిత్యాన్నధాన సత్రం అభివృద్ధి కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు..

## ఖమ్మం బాధితురాలని పరామర్శించిన హరీష్

**హైదరాబాద్ :** తెలంగాణలోని ఖమ్మం పట్టణంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన అమానుష దాడి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. బాలికపై లైంగిక దాడికి యత్నించి, ఆమెను ఒక అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు నుంచి కిందకు తోసేసిన ఈ ఘటనపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ప్రమాదంలో వెన్నెముక, పక్కటెముకలు, చేతులకు తీవ్ర గాయాలైన బాధితురాలు ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.వివరాల్లోకి వెళితే.. జూన్ 6న ఖమ్మంలోని రాపర్తి నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. అదే అపార్ట్‌మెంట్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ గౌస్, వాచ్‌మెన్ కుమార్తె అయిన సదరు బాలికను పైఅంతస్తులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటిస్తూ కేకలు వేయడంతో, నిందితుడు ఆమెను భవనం పైనుంచి కిందకు తోసేశాడు. మొదట ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావించిన కుటుంబ సభ్యులు, బాలిక స్పృహలోకి వచ్చిన తర్వాత అసలు విషయం చెప్పడంతో గ్భ్రాంతికి గురయ్యారు.ఈ ఘటనపై ఖమ్మం పోలీసులు పోక్సో (ఖూఅూా) చట్టం కింద కేసు నమోదు చేసి, 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆమె ఆహారం తీసుకుంటోందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ వెల్లడించారు.

**ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు**

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు పరామర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజూ 5 నుంచి 6 పోక్సో కేసులు నమోదవుతున్నాయని ఆయన ఆరోపించారు. బాధితురాలికి ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మెరుగైన వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. నిమ్స్‌లో మందులు ఉచితంగా లభించడం లేదని, పేద కుటుంబానికి చెందిన బాధితులు వాటిని బయట కొనాల్సి వస్తోందని ఆయన విమర్శించారు.

## నేనిప్పటికీ కాంగ్రెస్ లోనే వున్నారు

**హైదరాబాద్ :** శుక్రవారం నాడు నాంపల్లి కోర్టు లో కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ కేసు సంచలం సృష్టించింది. కేసులో పిర్యాదుదారు మహిళ తన వివరాలు లీక్ చేయడంపై కోర్టు ఆవరణలో ఆవేదన వ్యక్తం చేసింది. అయితే తన సమాచారాన్ని ఎవరు బయటపెట్టారో తెలియదని వాపోయింది. కొందరి వల్ల తనకు ప్రాణహాని ఉందని కోర్టు ఆవరణలో మీడియాకు వెల్లడించింది. కోర్టుకు రాకుండా అడ్డుకున్నారు.. ఆటోను వెంబడించారని సంచలన వ్యాఖ్యలు చేసింది. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపను. ఇప్పటికీ తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నానని వెల్లడించింది.

# బిజినెస్

## క్రెడిట్ కార్డులు వాడేవారికి కొత్త రూల్స్..
## జూన్ 15 నుంచే అమల్లోకి..




ఆర్థిక అవసరాల కోసం ప్రస్తుత పరిస్థితుల్లో చాలామంది క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. ఉద్యోగాలు, వ్యాపారులు చేసేవారిలో ఎక్కువ శాతం మంది వాడుతుండగా.. ఇక సామాన్య వ్యక్తులు కూడా విరివిగా వినియోగిస్తున్నారు. గతంలో పోలిస్తే ఇటీవల కాలంలో దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వినియోగం పెరుగుతున్న క్రమంలో క్రెడిట్ కార్డులు జారీ చేసే సంస్థలు పలు బెనిఫిట్స్‌ను తగ్గిస్తున్నాయి. ఉచిత ఎయిర్ పోర్ట్ లాంజ్ సౌకర్యం, రివార్డ్ పాయింట్లలో కొత, డిస్కౌంట్స్ తొలగింపు వంటి వాటిల్లో మార్పులు చేస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా మరో బ్యాంక్ క్రెడిట్ కార్డుల విషయంలో కీలక మార్పులు చేసింది. ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ ఇండస్ ఇండ్ బ్యాంక్ క్రెడిట్ కార్డు నిబంధనల్లో మార్పులు చేసింది. రవాణా ఛార్జీలు, ఇంధన లావాదేవీలు, అంతర్జాతీయ ఖర్చుల వంటి ఛార్జీలలో మార్పులతో పాటు వడ్డీ లెక్కింపులో రూల్స్ మార్చింది. ప్రతీ స్టేట్‌మెంట్ సైకిల్‌లో రూ.40 వేలు దాటిన రవాణా ఖర్చులపై 1 శాతం ఛార్జీతో పాటు జీఎస్టీ విధించనుంది. అయితే విమాన ప్రయాణాలకు ఈ నిబంధన వర్తించదు. అలాగే పెట్రోల్, డీజిల్ వంటి ఇంధన కొనుగోళ్లపై విధించే ఛార్జీలలో సవరణలు చేసింది. ప్రస్తుతం రూ.50 వేలు పైబడి లిమిట్ దాటితే ఇంధన కొనుగోళ్లకు ఛార్జీలు వసూలు చేస్తుండగా.. ఇప్పుడు రూ.30 వేలకు తగ్గించనుంది. ఇక నుంచి రూ.30 వేలు దాటితే 1 శాతం ఛార్జీతో పాటు జీఎస్టీ ఉంటుంది.

**ఛార్జీలు పెంపు**

ఇక అంతర్జాతీయ ఖర్చులపై విధించే బ్యాంక్ డైనమిక్ కరెన్సీ కన్వర్షన్ ఛార్జీలను కూడా సవరించింది. ఇప్పటినుంచి ఈ లాదాదేవీలకు 2 శాతం ఛార్జీలు వసూలు చేయనున్నారు. ఇక క్రెడిట్ కార్డులకు సంబంధించి వడ్డీ లెక్కింపు విషయంలో కూడా మార్పులు చేసింది. ఇక నుంచి పాక్షిక చెల్లింపులు చేస్తూ గడువు తేదీన లేదా అంతకంటే ముందు చెల్లించిన పక్షంలో చెల్లింపు డేట్ నుంచి మునుపటి స్టేట్ మెంట్ ముగింపు బ్యాలెన్స్ పై వడ్డీ జమ అవుతుంది. ఈ వడ్డీని రాబోయే స్టేట్ మెంట్‌లో యాడ్ చేస్తారు. రాబోయే స్టేట్‌మెంట్‌లో పూర్తిగా చెల్లిస్తేనే వడ్డీ రహిత కాలం ప్రయోజనం పొందే అవకాశముంటుంది. బ్యాంక్ వెబ్ సైట్లోకి వెళ్లి సవరించిన నిబంధనలు గమనించాలని ఇండస్‌ఇండ్ బ్యాంక్ తెలిపింది. ఈ మేరకు కస్టమర్లకు సూచనలు చేసింది. మరో మూడు రోజుల్లో ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీంతో ఇండస్ ఇండ్ క్రెడిట్ కార్డులు వాడేవారు తెలుసుకోండి.

## ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్.. మరింత కాస్ట్లీ!

యాపిల్ తయారు చేసే ఐఫోన్లకు ఉండే క్రేజే వేరు. కొత్త ఐఫోన్ వస్తుందంటే చాలు కొన్ని రోజుల ముందే ఆరా తీస్తుంటారు. కొత్తగా మార్కెట్‌లోకి వస్తే క్యూ కట్టి మరీ కొనేస్తారు. యాపిల్ గతేడాది తెచ్చిన ఐఫోన్ 17 సిరీస్‌కూ మంచి స్పందన లభించింది. మరీ ముఖ్యంగా నారింజ రంగులో తీసుకొచ్చిన ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ ఓ దశలో బుకింగ్‌లూ నిలిపివేయాల్సి వచ్చింది. ఈ ఏడాది 18 ప్రో మ్యాక్స్ రాబోతోంది (అజూప్త్రశీఅవ 18 జూతీశీ ఝఃఇ). ఈ మొబైల్ కోసం ఎదురుచూస్తున్న యాపిల్ ప్రియులకు షాక్. ఐఫోన్ 17 ప్రో మాక్స్‌తో పోలిస్తే 18 ప్రో మాక్స్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈసారి ప్రో మ్యాక్స్‌లో ఆ స్థాయిలో అప్‌గ్రేడ్‌లు ఉండటం, ఉత్పత్తి ఖర్చులు పెరిగిన నేపథ్యంలో యాపిల్ భారీ స్థాయిలో దీని ధరలు పెంచనున్నట్లు టెక్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది ఐఫోన్ 17 ప్రో మాక్స్ 256 జీబీ వేరియంట్ ధరను 1,199 డాలర్లుగా కంపెనీ నిర్ణయించింది. భారత్‌కు వచ్చేసరికి దాని ప్రారంభ ధర రూ.1,49,900గా యాపిల్ నిర్ణయించింది. ఈ ఏడాది రాబోయే ఐఫోన్ 18 ప్రో మాక్స్ ధర 1299 డాలర్లు ఉంటుందని సమాచారం. ఈ లెక్కన చూస్తే దేశీయ మార్కెట్‌లో వీటి ధరలు మరింత పెరగనున్నాయి.

## లోన్లు తీసుకునేవారికి ఆర్బీఐ సడెన్ షాక్..
# అమల్లోకి రానున్న కఠిన రూల్స్..

మీ క్రెడిట్ స్కోర్ 730 కంటే తక్కువగా ఉందా..? అయితే మీకు లోన్లు రావడం ఇక కష్టం కావొచ్చు. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కఠిన నిబంధనలను అమల్లోకి తీస్నుకురానుంది. ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్ పేరుతో కొత్త రూల్స్‌ను ఆర్బీఐ ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచిఈ కొత్త నిబంధనలను అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నియమాలతో 730 కంటే సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న వారికి రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులకు మరింత కఠి నిబంధనలు విధించారు. దీంతో క్రెడిట్ హిస్టరీ సరిగ్గా లేకపోయినా, తక్కువగా ఉన్నా రుణ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం తక్కువగా ఉంటుంది.






**సిబిల్ తక్కువుంటే రుణం కష్టమే**


ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్ డైరెక్షన్-2026 ఫ్రేమ్‌వర్క్‌ను ఆర్బీఐ వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి తీసుకురానుంది. ఇది బ్యాంకింగ్ రంగంలో ఒక కీలకమైన సంస్కరణగా చెప్పవచ్చు. ఈ సంస్కరణల ప్రకారం 730 కంటే తక్కువ సిబిల్ స్కోర్ ఉన్నవారు రుణాలు పొందే విషయంలో కఠినమైన పరిశీలనను ఎదుర్కొంటారు. అధిక వడ్డీ రేట్లు, అదనపు పూచీకత్తు సమర్పించడం వంటి సమస్యలు రావొచ్చు. దేశంలోని రుణ దరఖాస్తుదారులలో 62 శాతం మంది ఈ వర్గంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత వ్యవస్థ ప్రకారం బ్యాంకులు రుణ డిఫాల్ట్‌లు జరిగిన తర్వాతే స్పందిస్తున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం బ్యాంకులు భవిష్యత్ డేటాను ఉపయోగించి రుణగ్రహీత రిస్క్‌ను నిరంతరం అంచనా వేస్తాయి. ఈఎంఐ ఆలస్యంగా చేయడం, అస్థిరమైన ఆదాయ సరళి, క్రెడిట్ వినియోగంలో ఆకస్మిక పెరుగుదల వంటి వాటిని పరిగణలోకి తీసుకుని పూర్తిగా రుణ దరఖాస్తులు తిరస్కరించవచ్చు.

**రానున్న రోజుల్లో కష్టమే**

కొత్త రూల్స్ వల్ల 730 కంటే ఎక్కువ సిబిల్ స్కోర్ ఉన్న సుమారు 7 కోట్ల ప్రీమియం కస్టమర్లకు బ్యాంకులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయి. వీరికి బహుమతులు అందించడంతో పాటు పోటీతత్వంతో కూడిన ఆర్థిక ఉత్పత్తుల పూర్తి శ్రేణితో సేవలు అందిస్తారు. మిగతా అందరికీ రుణం అందటం కష్టంగా మారవచ్చు. అయితే సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు, స్టెప్-అప్ లోన్ ఉత్పత్తులు, సూక్ష్మ రుణ మార్గాలు వంటి వాటిని తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్నవారి కోసం అందుబాటులో ఉంచనున్నారు. ప్రస్తుతం బ్యాంకులు సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నా తమకు నమ్మకమైన కస్టమర్‌గా ఎక్కువకాలం పాటు కొనసాగుతుంటే రుణాలు మంజూరు చేస్తున్నాయి. కానీ రానున్న రోజుల్లో ఈ విధానంలో రుణాలు పొందటం కష్టం కావొచ్చు. ఆర్బీఐ నియమాలు అందుకు అనుమతించవు.

## పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు..
# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఇవాళ్టి ట్రేడింగ్‌లో భారత ఈక్విటీ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఇరాన్‌పై అమెరికా తన సైనిక చర్యను తీవ్రతరం చేసిందనే వార్తలతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనపడింది. రోజంతా ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరికి నష్టాలు మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ (ూవఅవఞ) 150.63 పాయింట్లు నష్టపోయి 73,832.55 వద్ద, నిఫ్టీ (చీఱట్‌ఎ) 53.35 పాయింట్లు తగ్గి 23,161.60 వద్ద ముగిశాయి. ఇరాన్‌కు తగినంత సమయం ఇచ్చినా చర్చలకు రాలేదని, ఇప్పుడు పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌పై తీవ్రంగా దాడి చేస్తామని ఆయన స్పష్టం చేయడంతో మార్కెట్లలో ఆందోళన పెరిగింది. దీనికి తోడు అమెరికా దాడుల తర్వాత వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడం ఆందోళనలను మరింత తీవ్రతరం చేసింది. ఈ పరిణామంతో ప్రపంచ చమురు సరఫరాకు అంతరాయం కలుగవచ్చని, ఆర్థిక మార్కెట్లలో అనిశ్చితి పెరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈరోజు ట్రేడింగ్‌లో బ్రాడర్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి మరింత ఎక్కువగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.81 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.67 శాతం చొప్పున పతనమయ్యాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్, కెమికల్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. మరోవైపు నిఫ్టీ మీడియా, ప్రైవేట్ బ్యాంక్, ఫార్మా సూచీలు మార్కెట్లకు మద్దతుగా నిలిచి నష్టాలను కొంతమేర తగ్గించాయి. మరోవైపు డాలర్‌కు పెరిగిన డిమాండ్ కారణంగా రెండు రోజుల లాభాల తర్వాత రూపాయి విలువ పడిపోయింది.



## ఆస్ట్రేలియా జట్టులో భారత సంతతి క్రికెటర్..
# స్పిన్ బౌలర్ నిఖిల్ చౌదరీకి చోటు

సిడ్నీ: భారత సంతతి క్రికెటర్ నిఖిల్ చౌదరీ ఆస్ట్రేలియా జట్టుకు ఆడబోనున్నాడు. బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లో ఆల్‌రౌండర్ నిఖిల్‌కు చోటు దక్కింది. ఆరు దశాబ్దాల తర్వాత భారత క్రికెటర్ .. ఆస్ట్రేలియా తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. స్థానికంగా హోబర్ట్ హరికేన్స్ జట్టు తరపున నిఖిల్ ఆడుతుంటాడు. ఒకవేళ అన్నీ కుదిరితే, వచ్చే వారం బంగ్లాతో జరిగే టీ20 మ్యాచ్‌లో అతను ఆస్ట్రేలియా తరపున అరంగేట్రం చేయనున్నాడు.

బెల్జియంలో జరుగుతున్న ఈయూ20 టోర్నీలో జేబీ బ్రూగ్స్ జట్టు తరపున నిఖిల్ ఆడుతున్నాడు. ఇటీవల ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో అతను ఉన్నాడు. లెన్ స్పినర్ అయిన నిఖిల్.. బ్యాటింగ్ కూడా చేయగలడు. మిడిల్ ఆర్డర్‌లో బెర్త్ కోసం జోయల్ డేవిస్, ఆరన్ హార్డీతో అతను పోటీపడనున్నాడు. జూన్ 17 నుంచి 21 వరకు టీ20 సిరీస్ జరగనున్నది. బీబీఎల్ టోర్నీలో అతని ఫామ్ ఆకట్టుకున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా సెలెక్టర్లు తెలిపారు.



ఆస్ట్రేలియా తరపున భారత సంతతి క్రికెటర్లు గతంలోనూ ఆడారు. గుర్వీందర్ సింధు, తన్వీర్ సంఘాలు ఆస్ట్రేలియా తరపున ప్రాతినిధ్యం వహించారు. కానీ వాళ్లు 1960 కన్నా ముందు ఆసీస్ తరపున ఆడారు. చివరిసారి 1964లో రెక్స్ సెల్లార్స్ అనే గుజరాతీ ప్లేయర్ ఆసీస్ తరపున ఆడాడు. ఇక పుణెలో పుట్టిన లీసా సత్లేకర్ కొన్నాళ్లు ఆస్ట్రేలియాకు ఆడారు. ఆమె 2003లో ఆసీస్ తరపున అరంగేట్రం చేసి 2013 వరకు ఆడారు. నిఖిల్ చౌదరీ వయసు 30 ఏళ్లు. అతను ఆస్ట్రేలియా సిటిజన్ కాదు, కానీ అతను పర్మనెంట్ రెసిడెంట్. అయితే దత్తత తీసుకున్న దేశం చట్టాల ప్రకారం అతను ఆస్ట్రేలియా తరపున అంతర్జాతీయ క్రికెట్ ఆడే అవకాశం ఉన్నది. ఢిల్లీలో పుట్టిన అతను పంజాబ్ తరపున 14 ఏ లిస్టు మ్యాచ్‌లు ఆడాడు. కోవిడ్ సమయంలో క్వీన్స్‌ల్యాండ్‌లోని మేనమామ ఇంట్లో ఉన్నాడు. ఆ సమయంలో అతను ఆస్ట్రేలియాలో క్రికెట్ ఆడాడు. హోబర్ట్‌కు బీబీఎల్ టైటిల్ తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌లో అతను 30 సగటుతో 307 రన్స్ చేశాడు.

# స్పోర్ట్స్

## ఇండియా-ఏకు షాకిచ్చిన ఆఫ్ఘనిస్తాన్.. 4 రన్స్ తేడాతో విక్టరీ



**డంబుల్లా:** ఇండియా-ఏ జట్టుకు ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు షాక్ ఇచ్చింది. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఇవాళ జరిగిన మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నాలుగు రన్స్ తేడాతో ఆఫ్ఘనిస్తాన్ విజయం సాధించింది. పలు మార్లు వర్షం వల్ల మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా 49 ఓవర్లలో 349 రన్స్ చేసింది. కానీ ఆఫ్ఘన్‌కు 38 ఓవర్లలో 294 రన్స్‌ను టార్గెట్‌గా ఇచ్చారు. అయితే ఆఫ్ఘన్ బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. వర్షం అంతరాయం వల్ల మ్యాచ్ నిలిచిపోయే సమయానికి ఆఫ్ఘనిస్తాన్ 25.5 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 177 రన్స్ చేసింది. అయితే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆఫ్ఘన్ జట్టు నాలుగు పరుగులు ఆధిక్యంలో ఉన్నది. దీంతో అనూహ్యంగా ఇండియా-ఏ జట్టుకు షాక్ తగిలింది. ఆఫ్ఘన్ బ్యాటర్లలో ఇబ్రాన్ 75, బహిర్ షా 51 రన్స్ చేసి క్రీజ్‌లో ఉన్నారు. భారత జట్టులో ప్రభ్ సిమ్రన్ సింగ్ 84, తిలకవ్ వర్మ 66, రుతురాజ్ గైక్వాడ్ 66, వైభవ్ సూర్యవంశీ 44 రన్స్ చేశారు. అయితే ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో ఇబ్రాన్, బహిర్ మధ్య మూడో వికెట్లకు అజయేంగా 108 రన్స్ భాగస్వామ్యం ఏర్పడింది. ఇది ఆ జట్టుకు కలిసి వచ్చింది.


## వింబుల్డన్ ప్రైజ్‌మనీ 20 శాతం పెంచేశారు..
# సింగిల్స్ విజేతకు 40 కోట్లు!

లండన్: ఈ యేటి వింబుల్డన్ టెన్నిస్ విజేతలకు ప్రైజ్‌మనీ పెంచేశారు. తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని ఆటగాళ్లకు పంచనున్నారు. గత ఏడాదితో పోలిస్తే ప్రైజ్‌మనీ ఈసారి 20 శాతం పెంచారు. సింగిల్స్ విజేతకు 48 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ దక్కనున్నది. ఇది సుమారు 40 కోట్లు ఉంటుంది. ఇక ఫస్ట్ రౌండ్‌లో ఓడిన ప్లేయర్‌కు కనీసం 80 వేల పౌండ్లు ఇవ్వనున్నారు. క్వాలిఫయింగ్ కాంపిటీషన్ కోసం సుమారు 6 మిలియన్ల పౌండ్లు ఖర్చు చేస్తున్నారు. దీంట్లో 25 శాతం పెరుగుదల ఉన్నది. ఓవరాల్‌గా ప్రైజ్‌మనీ సుమారు 64.2 మిలియన్ల పౌండ్లుగా ఉంది. టోర్నీ చరిత్రలోనే అత్యధికంగా ఆటగాళ పారితోషకాన్ని పెంచామని, ఆటగాళ్లను దీన్ని స్వాగతిస్తారని అనుకుంటున్నాని, ఇది చాలా పెద్ద అమౌంట్ అని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ చైర్ దెబోరా జీవన్స్ తెలిపారు. క్వాలిఫయింగ్ రౌండ్‌తో పాటు అన్ని రౌండ్ల గురించి ఆలోచించామన్నారు. గ్రాండ్‌స్లామ్ నిర్వహణ ద్వారా వస్తున్న ఆదాయంలో 16 శాతం ఆటగాళ్లకు ఇవ్వాలన్న డిమాండ్ ఉందన్నారు. ఇటీవల ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో ప్రైజ్‌మనీ 9.5 శాతం పెంచారు. కానీ ఆ పెంపు పట్ల చాలా మంది ఆటగాళ్లు నిరాశను వ్యక్తం చేశారు. కొందరు ఆటగాళ్లు నిరసన కూడా చేపట్టారు. అయితే గత ఏడాది యూఎస్ ఓపెన్ కోసం 20 శాతం ప్రైజ్‌మనీ పెంచారు. ఇక ఈ ఏడాది అమౌంట్‌ను త్వరలో ప్రకటించనున్నారు. గత ఏడాది వింబుల్డన్‌లో జానిక్ సిన్నర్ మెన్స్ చాంపియన్‌గా నిలిచాడు. ఇక మహిళల విభాగంలో ఇగా



స్వియాటెక్ సింగిల్స్ టైటిల్ గెలుచుకున్నది.





# మెగా హీరోల దూకుడు.. మూడు సినిమాలతో 900 కోట్ల బిజినెస్

తెలుగు సినీ పరిశ్రమలో ప్రస్తుతం మెగా హీరోల హవా కొనసాగుతోంది. వరుస విజయాలతో బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ మెగా ఫ్యామిలీ హీరోలు మరోసారి తమ స్టార్ పవర్‌ను నిరూపిస్తున్నారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, చిరంజీవి, రామ్ చరణ్ నటించిన తాజా చిత్రాలు భారీ వసూళ్లు నమోదు చేయడంతో మెగా అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. ఒక్కో హీరో ఒక్కో స్టైల్‌లో ప్రేక్షకులను అలరిస్తూ, రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. 2025లో విడుదలైన ఓజీ ద్వారా పవన్ కళ్యాణ్ అభిమానులకు సరికొత్త అనుభూతిని అందించారు. స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో కనిపించిన పవన్, తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.తెలుగు వార్తలు సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్, పవన్ లుక్, డైలాగ్స్ అభిమానుల్లో భారీ క్రేజ్‌ను తీసుకువచ్చాయి. విడుదల అనంతరం ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి పవన్ కెరీర్‌లో అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.ఇక మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ గారు సంక్రాంతి బరిలో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంది. 70 ఏళ్ల వయసులోనూ తన ఫిట్‌నెస్, ఎనర్జీ, కామెడీ టైమింగ్‌తో చిరంజీవి మరోసారి ప్రేక్షకులను మెప్పించారు. కొత్త లుక్‌తో తెరపై కనిపించిన ఆయనకు అభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రం కూడా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి సంక్రాంతి సీజన్‌లో భారీ విజయంగా నిలిచింది. ఇక ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న చిత్రం పెద్ది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ఈ స్పోర్ట్స్ ఎమోషనల్ డ్రామాలో రామ్ చరణ్ తన కెరీర్‌లోనే అత్యంత భావోద్వేగభరితమైన పాత్రల్లో ఒకటి పోషించారు. సినిమాలో చరణ్ నటన, పాత్ర కోసం చేసిన కష్టం ప్రేక్షకులను ఆకట్టుకుంది. భావోద్వేగ సన్నివేశాల్లో ఆయన ప్రదర్శనకు మంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ఇప్పటికే రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించిన ఈ చిత్రం, త్వరలోనే రూ.400 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తంగా పవన్ కళ్యాణ్ 'ఓజీ', చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు', రామ్ చరణ్ 'పెద్ది' చిత్రాలు కలిసి రూ.900 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటీవల కాలంలో టాలీవుడ్ ఎదుర్కొంటున్న సవాళ్ల మధ్య ఈ భారీ విజయాలు పరిశ్రమకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రభాస్‌తో ధురంధర్ దర్శకుడు ఆదిత్య ధర్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, పాన్ ఇండియా దర్శకుడు ఆదిత్య ధర్ కలయికపై వార్తలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. సోషల్ మీడియాలో ఈ కాంబినేషన్ గురించి ప్రచారం జోరుగా సాగుతోంది. కానీ ఇందులో ఎలాంటి వాస్తవం లేదు. వాళ్లిద్దరూ కలిశారనేది నిజం. కొన్ని ఐడియాస్ షేర్ చేసుకున్నారనేది కూడా నిజం. కానీ ఈ కాంబినేషన్ పై ఎలాంటి కన్ ఫర్మేషన్ లేదు. ఇదే విషయాన్ని పరిశ్రమ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభాస్ ప్రస్తుతం వరుసగా పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నాడు. ఓవైపు దర్శకుడు సందీప్ వంగాతో స్పిరిట్ షూటింగ్ జరుగుతోంది. మరోవైపు ఫౌజీ సెట్స్ పై ఉంది. వాటితో పాటు కల్కి-2 సినిమా పనులు కూడా కొనసాగుతున్నాయి. అనంతరం సలార్-2 కూడా లైన్‌లో ఉంది. ఇలాంటి బిజీ షెడ్యూల్ మధ్య ప్రభాస్ మరో కొత్త ప్రాజెక్ట్‌కు కాల్షీట్లు కేటాయించే పరిస్థితి లేదు. ఇక ఆదిత్య ధర్ విషయానికి వస్తే.. ఆయనకు ఇప్పటికే జియోతో మరో చిత్రానికి కమిట్‌మెంట్ ఉంది. జీ స్టూడియోస్ కూడా ఆయనతో కొత్త ప్రాజెక్ట్ కోసం ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా ఓటీటీలో విడుదలైన ధురంధర్-2 (ది రివెంజ్) రికార్డ్ వ్యూస్ తో దూసుకుపోతోంది. రణ్వీర్ సింగ్ హీరోగా వచ్చిన ఈ ఫ్రాంచైజీ ఆల్ టైమ్ హిట్స్ లో ఒకటిగా నిలిచింది. అందువల్ల ప్రభాస్ -- ఆదిత్య ధర్ కాంబినేషన్ పై ప్రస్తుతానికి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. వీళ్ల మధ్య ఎలాంటి కథా చర్చలు జరగలేదు. కానీ కొన్ని నిర్మాణ సంస్థలు మాత్రం వీళ్లను కలిపే ప్రయత్నం చేస్తున్నాయన్నది మాత్రం నిజం.



# సూర్య '50'వ సినిమా టాలీవుడ్ డైరెక్టర్‌తోనేనా? హాట్ టాపిక్‌గా ఆ క్రేజీ కాంబినేషన్!


కోలీవుడ్ వర్గాల్లో ఇప్పుడు ఒక ఆసక్తికరమైన వార్త హల్‌చల్ చేస్తోంది. వైవిధ్యభరితమైన పాత్రలతో దేశవ్యాప్తంగా భారీ క్రేజ్ సంపాదించుకున్న స్టార్ హీరో సూర్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఇటీవలే 'కరుప్పు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, తన నటనతో విమర్శకుల ప్రశంసలు సైతం దక్కించుకుని మంచి జోష్‌లో ఉన్నారు సూర్య. ఈ ఉత్సాహంతోనే ఆయన తన తదుపరి చిత్రాలను శరవేగంగా పూర్తి చేసే పనిలో పడ్డారు. ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తన 46వ చిత్రమైన 'విశ్వనాథ్ అండ్ సన్స్' షూటింగ్‌ను ముగించుకుని, విడుదలకు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఈ ఏడాది ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు చిత్రబృందం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమా విడుదలైన వెంటనే సూర్య ఏమాత్రం గ్యాప్ తీసుకోకుండా తన 47వ ప్రాజెక్టును పట్టాలెక్కించబోతున్నాడు. క్రేజీ డైరెక్టర్ జీతూ మాధవన్ దర్శకత్వంలో 'సూర్య 47' సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంతో పాటు సూర్య ఫ్యూచర్ లైనప్‌లో టాలెంటెడ్ డైరెక్టర్లు పా రంజిత్, టి.జె.జ్ఞానవేల్ వంటి ప్రముఖ దర్శకులు కూడా లైన్‌లో ఉన్నారు. వీరితో చేయబోయే సినిమాలు కూడా విభిన్నమైన జోనర్లలో ఉండబోతున్నాయని సమాచారం. అయితే వీటన్నింటికంటే ముఖ్యంగా ప్రస్తుతం ఇండస్ట్రీ వర్గాల్లో సూర్య కెరీర్‌కు సంబంధించిన ఒక ల్యాండ్‌మార్క్ మూవీ గురించిన చర్చ చాలా బలంగా నడుస్తోంది. సూర్య సినీ ప్రస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన, మైల్‌స్టోన్ లాంటి 50వ చిత్రాన్ని (ాబతీఅఝ 50) టాలీవుడ్ టాప్ కమర్షియల్ మాస్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కించబోతున్నారనే టాక్ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా వినిపిస్తోంది. అనిల్ రావిపూడి చెప్పిన ఒక వినూత్నమైన కమర్షియల్ లైన్ సూర్యకు విపరీతంగా నచ్చిందని, అందుకనే ఈ మైల్‌స్టోన్ ప్రాజెక్ట్‌ను ఆయనకు అప్పగించే ఆలోచనలో సూర్య ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన చర్చలు ఇప్పటికే ముగింపు దశకు చేరుకున్నాయని, అన్ని కుదిరితే త్వరలోనే ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




# నాని 'ది ప్యారడైజ్' షూటింగ్ ఆలస్యం.. రెండు పార్టులుగా ప్లాన్ చేస్తున్నారా?

టాలీవుడ్ స్టార్ నటుడు నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'దసరా' తర్వాత వస్తున్న సినిమా కావడంతో, ఈ ప్రాజెక్ట్‌పై ప్రకటన వచ్చిన మొదటి రోజు నుంచే అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటిస్తోంది. అయితే, ప్రస్తుతం ఈ సినిమా చుట్టూ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. సినిమా షూటింగ్ ఊహించిన దానికంటే ఎక్కువగా ఆలస్యం అవుతుండడం, మరోవైపు సినిమాపై ఉన్న హైప్ క్రమంగా తగ్గే ప్రమాదం ఉందనే ఆందోళన అభిమానుల్లో వ్యక్తమవుతుండడమే దీనికి ప్రధాన కారణం. సాధారణంగా నాని సినిమాలు చాలా వేగంగా, పక్కా ప్లానింగ్‌తో పూర్తవుతుంటాయి. కానీ, 'ది ప్యారడైజ్' విషయంలో మాత్రం కథ వేరేలా కనిపిస్తోంది. అనుకున్న సమయానికి సినిమా పూర్తి కాకపోవడం నాని అభిమానులను సైతం తీవ్ర ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఎందుకంటే, ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైనప్పటి నుండి నాని గానీ, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల గానీ, లేదా ఈ చిత్రంలోని ఇతర ముఖ్య నటీనటులు గానీ మరే ఇతర కొత్త సినిమాకూ కమిట్ అవ్వలేదు. అందరూ పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే తమ దృష్టిని కేంద్రీకరించారు. అయినప్పటికీ, గత కొన్ని నెలలుగా నిరంతరాయంగా షూటింగ్ జరుగుతున్నా, ఇంకా దాదాపు రెండు నెలలకు పైగానే టాకీ పార్ట్ మరియు మేజర్ యాక్షన్ షెడ్యూల్స్ బ్యాలన్స్ ఉన్నాయనే సరికొత్త రూమర్స్ ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తున్నాయి. ఈ సుదీర్ఘమైన షూటింగ్ షెడ్యూల్స్ వెనుక ఉన్న అసలు కారణాలపై ఇప్పుడు సరికొత్త ఊహాగానాలు మొదలయ్యాయి. ఇన్ని రోజులుగా చిత్రీకరణ జరుపుకుంటుందంటే, 'ది ప్యారడైజ్' చిత్రాన్ని ఒకేసారి రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# మొదటి వారంలోనే రూ.345 కోట్లు.. రూ. 400 కోట్ల దిశగా రామ్ చరణ్ 'పెద్ది'




రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'పెద్ది' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా, గత వారం భారీ అంచనాల మధ్య థియేటర్లలోకి వచ్చింది. విడుదలకు ముందు నుంచే ఈ సినిమాపై ఉన్న క్రేజ్ కారణంగా, బుధవారం సాయంత్రం ప్రదర్శించిన పెయిడ్ ప్రీమియర్స్ నుంచే ఈ చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్, బ్లాక్ బస్టర్ రివ్యూస్ సొంతం చేసుకోవడంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి ఓపెనింగ్స్‌ను నమోదు చేసింది. ఆ అద్భుతమైన ఊపును అలాగే కొనసాగిస్తూ.. ఇప్పుడు ఈ చిత్రం విజయవంతంగా మొదటి వారం రన్‌ను పూర్తి చేసుకుని థియేటర్ల దగ్గర రియల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఇక కలెక్షన్ల విషయానికి వస్తే, 'పెద్ది' కేవలం మొదటి వారంలోనే ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 345 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త సెన్సేషన్ క్రియేట్ చేసింది. రామ్ చరణ్ కెరీర్‌లోనే సోలో హీరోగా ఇది బిగ్గెస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. 'ఆర్ఆర్ఆర్' వంటి మల్టీస్టారర్ చిత్రం తర్వాత చరణ్ సత్తాను ఒంటరిగా బాక్సాఫీస్ వద్ద నిరూపించిన చిత్రమిదేనని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ఎక్కడా తగ్గకుండా చాలా వేగంగా 400 కోట్ల మార్క్ వైపు దూసుకుపోతోంది. లాంగ్ రన్‌లో ఈ చిత్రం ఇంకెన్ని వందల కోట్ల క్లబ్‌లో చేరుతుందో, ఎక్కడ ల్యాండ్ అవుతుందో చూడాలని ఇండస్ట్రీ వర్గాలు ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌కు తోడు, ఆయన సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించి తన నటనతో, గ్లామర్‌తో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే సీనియర్ నటుడు జగపతి బాబు, కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ తమదైన సాలిడ్ మరియు వైవిధ్యమైన పాత్రల్లో నటించి సినిమాకు మరింత బలాన్ని చేకూర్చారు. ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాకు ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఏఆర్ రెహమాన్ అందించిన అద్భుతమైన సంగీతం మరియు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (దీ+వీ) సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎక్కడా రాజీ పడకుండా వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వచ్చిన ఈ చిత్రం చరణ్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ మైల్‌స్టోన్‌గా నిలిచిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# 2027 జనాభా లెక్కల తర్వాత భారత ఎన్నికల ముఖచిత్రమే మారనుందా?

దాదాపు 50 ఏళ్ల తర్వాత భారత ఎన్నికల వ్యవస్థలో అతిపెద్ద మార్పులకు తెరలేచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2027 జనాభా లెక్కల అనంతరం చేపట్టే డీలిమిటేషన్ ప్రక్రియ (నియోజకవర్గాల పునర్విభజన) దేశ రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేసే అవకాశం ఉందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో పాటు పార్లమెంటు సీట్ల సంఖ్య కూడా భారీగా పెరగొచ్చని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (జూూజ-ౌావీ) కోసం ప్రముఖ ఆర్థిక వేత్తలు షమికా రవి, ముదిత్ కపూర్ ఈ స్టడీ చేశారు. ఈ అధ్యయనం ప్రకారం- డీలిమిటేషన్‌ను కేవలం జనాభా ఆధారంగానే కాకుండా పట్టణీకరణ, భాషా వైవిధ్యం వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకొని నిర్వహిస్తే అప్పుడు ఓటర్ల భాగస్వామ్యం కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.




### డీలిమిటేషన్ అంటే ఏంటి?

జనాభా మార్పులకు అనుగుణంగా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల్ని పునర్నిర్మించడమే డీలిమిటేషన్. ప్రస్తుతం రాష్ట్రాల వారీగా లోక్‌సభ సీట్ల కేటాయింపు 1976లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ నుంచి యథాతథంగా కొనసాగుతోంది. 2001 జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాల సరిహద్దులు మారినా, రాష్ట్రాలకు కేటాయించిన సీట్ల సంఖ్య మాత్రం మారలేదు. 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌తో దాదాపుగా 50 ఏళ్ల తర్వాత సీట్ల కేటాయింపును పునర్‌పరిశీలించే అవకాశం ఏర్పడనుంది.

### 543 నుంచి 824 సీట్లకు

ఎకనామిస్ట్స్ స్టడీ ప్రకారం, ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ నియోజకవర్గాల్ని పునర్విభజించడం ద్వారా వాటి సంఖ్య 824 కు పెరిగే అవకాశం ఉంది. ఇందుకోసం 59 నియోజకవర్గాల్ని రెండుగా విభజించడం, 111 నియోజకవర్గాల్ని మూడుగా విభజించే విధానాన్ని ప్రతిపాదించారు. ఇక్కడ హైదరాబాద్, సికింద్రాబాద్, కోల్‌కతా దక్షిణ్ వంటి మెట్రోపాలిటన్ నియోజకవర్గాలతో పాటు కొన్ని ద్వితీయ శ్రేణి పట్టణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు కూడా పునర్విభజనకు అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈ మార్పుల వల్ల జాతీయ స్థాయిలో ఓటింగ్ శాతం 0.3 నుంచి 2.3 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పరిశోధకులు అంచనా వేశారు. దీనికి అనుగుణంగా సాధారణ ఎన్నికల్లో సుమారు 90 లక్షల నుంచి 2.3 కోట్ల మంది వరకు ఓటర్ల సంఖ్య పెరుగుతుందని నివేదిక చెబుతోంది. సాధారణంగా పెద్ద నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుందని భావిస్తుంటారు. కానీ తాజా అధ్యయనం ప్రకారం అసలు సమస్య నియోజకవర్గం పరిమాణం కాదంట. పట్టణీకరణ, ఎస్సీ- ఎస్టీ జనాభా శాతం, భాషా వైవిధ్యం వంటి అంశాలే ఓటింగ్ శాతాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తున్నట్లు తేలింది.

### పట్టణాల్లో మహిళా ఓటర్లే వెనుకంజ

ఇదే స్టడీలో మరొక ఆసక్తికర అంశం బయటికి వచ్చింది. పూర్తిగా పట్టణ ప్రాంతాల్లో నివసించే మహిళలు ఓటింగ్‌లో చాలా వెనుకబడి ఉన్నారని పరిశోధకులు గుర్తించారు. గ్రామీణ మహిళలతో పోల్చి చూస్తే పట్టణ ప్రాంతాల్లో మహిళల ఓటింగ్ శాతం సగటున 5 శాతం తక్కువగానే ఉంటున్నట్లు అంచనా వేశారు. ఇక్కడ ప్రధానంగా ఉద్యోగంలో ఒత్తిడి, ప్రయాణ భారాలు, కుటుంబ బాధ్యతలు వంటివి కారణాలుగా ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది.

### ఎన్నికల సంఘానికి కీలక సూచనలు

ఓటింగ్ శాతం పెంచేందుకు ఈ ఇరువురు ఆర్థికవేత్తలు ఎన్నికల సంఘానికి పలు కీలక సూచనలు చేశారు. మెట్రో నగరాల్లో మహిళల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేయడం సహా సాయంత్రం వేళల్లో పోలింగ్ సమయాన్ని పొడగించాలని ప్రతిపాదించారు. పోలింగ్ కేంద్రాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం, అంగన్‌వాడీలు, స్వయం సహాయక సంఘాలు, ఆశా వర్కర్ల ద్వారా మహిళా ఓటర్లలో అవగాహన పెంపొందించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఐక్యంగా పోరాడదాం

మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని బట్టి చూస్తే, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం ఖాయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కానీ అసలు సమస్య ఏమిటంటే, విపక్ష కూటమి గెలవడానికి ఇక్కడ స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగవు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, విపక్ష నేతలు అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. “మనం కలిసికట్టుగా నిలబడి ప్రతిఘటిస్తే బీజేపీని ఓడించడం చాలా సులువు” అని పేర్కొన్నారు. వామపక్ష పార్టీలతో సహా ఇతర మిత్ర పక్షాలు కాంగ్రెస్?పై చేస్తున్న విమర్శలపై గాంధీ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఈ ప్రసంగం వీడియోను ఆయన తన ఎక్స్? ఖాతాలో పోస్టు చేశారు.

“నేను విషన్ని మింగిన నీలకంఠుడిని, నాపైగానీ, నా పార్టీపై గానీ వాళ్లు చేసే ఎలాంటి విమర్శలనైనా ముఖ్యంపై చిరునవ్వుతో స్వీకరిస్తాను. మిమ్మల్ని సంతోషపెట్టడానికి మేము ప్రయత్నిస్తాం. ఎందుకంటే మా పాత్ర మీ పాత్ర కంటే భిన్నమైనది. నేను దీనిని అహంకారంతో చెప్పడం లేదు. మీలా చాలా మంది పేర్కొన్నట్లుగా, మా పాత్ర అందరినీ ప్రేమ, ఆప్యాయతలతో ఒక్కటిగా చేర్చడం.

సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) లాంటి పార్టీలు తాము ఇప్పటి వరకు ఉపయోగించిన రాజకీయ వ్యూహాలు ఇంకా పనిచేస్తున్నాయని నమ్ముతున్నాయి. కానీ నేడు మన కూటమిలో ఒక విధమైన అయోమయం నెలకొంది. భారతదేశంలోని వ్యవస్థలు సరిగ్గా పనిచేయడానికి ఒక నిష్పక్షపాతమైన వాతావరణాన్ని కల్పించినప్పుడు మాత్రమే ఇవి పనిచేశాయి. కానీ ఇప్పుడు ఆ వాతావరణం లేదు. లీగల్ సిస్టమ్, బ్యూరోక్రసీ(అధికార యంత్రాంగం), నిఘా సంస్థలు, ఎలక్షన్ కమిషన్‌తో సహా దేశంలోని అన్ని ప్రభుత్వ సంస్థలను బీజేపీ తన నియంత్రణలో ఉంచుకుంది.”



### టీఎంసీ ఊహాలోకంలో ఉంది!

ఈ సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ, బంగాల్?లో టీఎంసీ పార్టీ ఓటమికి గల కారణాలు చెప్పారు. “టీఎంసీలో నాకు చాలా మంది స్నేహితులు ఉన్నారు. ఎన్నికల్లో తాము క్లీన్ స్వీప్ చేస్తామని వారు బలంగా నమ్మారు. నేను వారితో చెబుతూనే ఉన్నాను. మీరు ఊహాలోకంలో ఉన్నారని. గుజరాత్?, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, మహారాష్ట్రల్లో ఏం జరిగిందో నేను కళ్లారా చూశాను. అయినప్పటికీ మీలో చాలా మంది ఇంకా నమ్మడం లేదు. మమతా బెనర్జీ తన ఎలక్షన్ చోరీ అయ్యిందని 100 శాతం కాకపోయినా, దాదాపు 90 శాతం వరకు నమ్ముతున్నారు. నా సోదరుడు తేజస్వి 40 శాతం మేర ఎలక్షన్ చోరీ జరిగిందని భావిస్తున్నారు. కానీ నేను చెబుతున్నాను వినండి. 100 శాతం ఎన్నికల చోరీ జరుగుతోంది. దయచేసి మీ మనస్సుల్లోని అనుమానాలను తొలగించుకోండి” అని రాహుల్ గాంధీ అన్నారు.

### విజయం ఇప్పటికే ఖరారైంది- కానీ!

సమీప భవిష్యత్తులో, ఇప్పటి వరకు పనిచేసిన వ్యవస్థలు ఆగిపోతాయని రాహుల్ వ్యాఖ్యానించారు. ఎందుకంటే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ భారతదేశంలోని అన్ని వ్యవస్థలపై తమ పట్టును బిగిస్తున్నాయని అన్నారు. “రాజకీయ పార్టీలు పనిచేయకపోతే, మరి ఏది పనిచేస్తుంది కచ్చితంగా ప్రతిఘటన పనిచేస్తుంది. నేను నా సొంత కళ్లతో చూశాను. నేను ఈ దేశవ్యాప్తంగా 4వేల కి.మీ నడిచాను. ప్రతిఘటన కచ్చితంగా పనిచేస్తుంది” అని రాహుల్ పేర్కొన్నారు.

“ఇకపై మనం ఒకరితో ఒకరు పోరాడుకోకూడదు. మీడియా మనపై దాడి చేయడానికి అవకాశం ఇవ్వకూడదు. తదుపరి ఎన్నికల్లో గెలవడమే పెద్ద సవాల్ అని మీరు అనుకుంటున్నారు. కానీ వచ్చే ఎన్నికల్లో విజయం ఇప్పటికే ఖాయం అయ్యింది. దయచేసి అర్థం చేసుకోండి. భారత ప్రజల్లో ఎంతో ఆగ్రహం ఉంది. వాళ్లు ఇప్పటికే తమ తీర్పును ఇండియా కూటమికి అనుకూలంగా ఇచ్చేశారు. కానీ సమస్యల్లా ఆర్?ఎస్?ఎస్? ద్వారా బీజేపీ సర్కార్? వ్యవస్థలను హస్తగతం చేసుకుంది. అందువల్ల గెలవడానికి మనకు స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు లభించవు. కాబట్టి మనం ప్రతిఘటించే మోడ్?లోకి వెళ్లాలి. సీబీఎస్‌ఈ, నీట్ విషయాల్లో ప్రభుత్వాన్ని ప్రతిఘటించాలి. గ్రేట్ నికోబార్‌కు వెళ్లి అక్కడ ప్రతిఘటించాలి. వాస్తవానికి ప్రతిఘటన అంటే భారత్ జోడో యాత్ర. మీరు ఉదయాన్నే లేచి నేను ఎలా ప్రతిఘటించగలను అని ప్రశ్నించుకుని, ఆ విధంగా ప్రతిఘటించాలి. అది కచ్చితంగా పనిచేస్తుంది. కనుక మన మధ్య సమన్వయం లేదని, కలసికట్టుగా పనిచేయడం లేదనే భావనను విడిచిపెట్టండి. మనం కలిసికట్టుగా ప్రతిఘటిస్తే బీజేపీని సలువుగా ఓడించగలం” అని కూటమిలోని మిత్రపక్షాలను ఉద్దేశించి రాహుల్ గాంధీ అన్నారు.

### విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే!

కాగా, నీట్, సీబీఎస్‌ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఇండియా కూటమి సోమవారం డిమాండ్ చేసింది. అలాగే ఎస్‌ఐఆర్ ప్రక్రియ, ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలపై సీజేఐకు లేఖ రాయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.

# బంకుల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం వల్ల ఇంధన సరఫరా కష్టమవుతుండడంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పారిశ్రామిక, వాణిజ్య, సంస్థాగత వినియోగదారులు పెట్రోల్ పంపుల నుంచి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బదులుగా వారి అవసరాల కోసం ఇంధనాన్ని బల్క్ అమ్మకపు కేంద్రాల నుంచి పొందాలని సూచించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లోకి ఉంటుందని పేర్కొంది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ ఇంధనం నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యానికి ఆదేశాలిచ్చింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది.

### డీజిల్‌కు పెరిగిన డిమాండ్

ధరల వ్యత్యాసం కారణంగా బల్క్ వినియోగదారులు పెట్రోల్ పంపుల నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం ప్రారంభించడంతో కొన్ని ప్రాంతాలలో డీజిల్‌కు అసాధారణ డిమాండ్ పెరిగింది. దీంతో దేశ రాజధాని దిల్లీలోని పెట్రోల్ పంపుల వద్ద లీటరు డీజిల్ ధర రూ. 95.20 కాగా, బల్క్ సరఫరాదారుల వద్ద లీటర్ డీజిల్ ధర రూ. 134.50గా ఉంది. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై కేంద్రం ఈ ఆంక్షలు విధించింది.

### ప్రభుత్వ రంగ బంకుల్లో పెరిగిన సేల్స్

పశ్చిమాసియా సంక్షోభం తరువాత పెరిగిన ఇంధన ధరల నుంచి సాధారణ వినియోగదారులను కాపాడటానికి ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు రిటైల్ ధరలను సర్దుబాటు చేయడంతో ఈ వ్యత్యాసం ఏర్పడింది. టెలికాం టవర్లు, విద్యుత్ ఉత్పత్తి, ఇతర ఫీడ్‌స్టాక్ అవసరాల కోసం డీజిల్‌ను ఉపయోగించే పరిశ్రమలు వంటి బల్క్ వినియోగదారులకు మార్కెట్ ధర వసూలు చేస్తుండగా, రిటైల్ అవుట్‌లెట్ల వద్ద ధరలు ఉత్పత్తి వ్యయం కంటే చాలా తక్కువగా ఉన్నాయి. ధరలలోని ఈ వ్యత్యాసం వల్ల పెట్రోల్, డీజిల్‌ను అధిక రేట్లుకు విక్రయించే ప్రైవేట్ రంగ అవుట్‌లెట్లలో అమ్మకాలు తగ్గిపోయాయి. ప్రభుత్వ రంగ సంస్థల పెట్రోల్ పంపుల్లో అమ్మకాలు పెరిగాయి.

కాగా మే నెలలో మూడు ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లో పెట్రోల్ అమ్మకాలు 4.8 శాతం, డీజిల్ అమ్మకాలు 6.4 శాతం మేర పెరిగాయి. ఈ క్రమంలో రిటైల్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. పరిశ్రమలు, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని వెల్లడించింది. అంతేగాకుండా పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశాలిచ్చింది. ఈ డీజిల్‌ను పునర్‌విక్రయించకూడదని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని చెప్పింది. అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని ప్రకటించింది. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలను ప్రభావితం చేస్తున్న ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితి కారణంగా ఈ చర్య అవసరమైందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తెలిపింది.

## మళ్లీ మొదలైన ఎల్ నినో




పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న ప్రాంతంలో ప్రస్తుతం ఎల్ నినో పరిస్థితులు ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం తెలిపింది. రానున్న వర్షాకాలం(నైరుతి రుతుపవనాల కాలం)లో ఇది మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఐఎండీ తన జూన్ 2026 ఎన్సో (ఈఎన్‌ఎస్‌ఓ), ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) బులెటిన్‌లో ఈ వివరాలు వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్ర మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగాయని, ఇవి ఎల్ నినో ఏర్పడడానికి కావాల్సిన స్థాయిని దాటిపోయాయని పేర్కొంది. దీనికనుగుణంగానే వాతావరణంలో కూడా మార్పులు వచ్చాయని తెలిపింది. సముద్రం, గాలి కలిసి పనిచేసే తీరును బట్టి చూస్తే, ప్రస్తుతం భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్ నినో లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ‘మాన్‌సూన్ మిషన్ కపుల్డ్ ఫోర్?కాస్ట్ సిస్టమ్’ అంచనాల ప్రకారం, ఈ వర్షాకంలో ఎల్ నినో పరిస్థితులు ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపింది. వాస్తవానికి 2026 జూన్?లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఈ పరిమితిని దాటేశాయని ఐఎంపీ తన బులెటిన్?లో పేర్కొంది. ఈ వాతావరణ మార్పును కొలిచే ‘నినో 3.4 ఇండెక్స్’ మూడు నెలల సగటు ఉష్ణోగ్రత ం0.5సీ కంటే పైకి రికార్డ్ అయ్యిందని తెలిపింది. ఇది ఎల్ నినో ప్రారంభమైంది అనడానికి సంకేతమని స్పష్టం చేసింది. అంతేకాదు సముద్ర పైభాగంలోనే కాకుండా, లోపలి పొరల్లోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, రానున్న నెలల్లో ఈ వేడి నీరు పైకి వచ్చి ఎల్ నినోను మరింత బలోపేతం చేస్తుందని ఐఎండీ గుర్తించింది.

### భారత్‌పై ఈ ఎల్ నినో ప్రభావం ఎంత?

ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో వేడి పెరడం వల్ల వచ్చే ఒక సహజమైన వాతావరణ మార్పు. భారతదేశానికి సంబంధించి చూసుకుంటే, 2000వ సంవత్సరం తర్వాత అంటే 2002, 2009, 2015, 2023లో ఎల్ నినో తరహా వాతావరణ మార్పులు వచ్చాయి. సాధారణంగా ఈ ఎల్ నినో సమయంలో దేశంలో రుతుపవనాలు బలహీనపడడం, తక్కువ వర్షాలు కురవడం, ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం, వర్షాలు లేకుండా పొడి వాతావరణం ఏర్పడడం లాంటివి జరుగుతుంటాయి. మరీ ముఖ్యంగా కొన్ని సంవత్సరాలపాటు కరవు వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. అయితే భారతదేశ వర్షపాతాన్ని కేవలం ఎల్ నినో ఒక్కటే ప్రభావితం చేయదని ఐఎండీ స్పష్టం చేసింది. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో ‘ఇండియన్ ఓషన్ డైపోల్’ (ఐఓడీ) సాధారణ స్థితిలోనే ఉందని తెలిపింది. అందువల్ల ఎల్? నినో ప్రభావాన్ని తగ్గించడంలో, పెంచడంలో దీని పాత్ర చాలా పరిమితం అని పేర్కొంది. పసిఫిక్ మహాసముద్రంలో మారుతున్న పరిస్థితులను తాము నిరంతరం గమనిస్తూ, ప్రతి నెలా తాజా సమాచారాన్ని అందిస్తామని ఐఎండీ పేర్కొంది.

### ఎల్ నినో ఏర్పడినప్పుడు ఏం జరుగుతుంది?

సాధారణంగా తీవ్రమైన ఎల్ నినో ఏర్పడినప్పుడు, ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో భిన్నమైన పరిస్థితులు తలెత్తుతాయి. దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియాలోని చాలా ప్రాంతాల్లో తీవ్రమైన కరువు, కార్చిచ్చులు వస్తాయి. అదే సమయంలో అమెరికాలోని దక్షిణ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి వరదలు ముంచెత్తుతాయి. ముఖ్యంగా భారత్ విషయానికొస్తే, ఎల్ నినో కారణంగా రుతుపవనాలు తీవ్రంగా బలహీనపడతాయి. దీనివల్ల వర్షపాతం తగ్గిపోతుంది. ఈ పరిణామాల వల్ల ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగం కుదేలై పంట దిగుబడులు తగ్గిపోతాయి. ఆహార ధరలు ఆకాశాన్ని తాకుతాయి. సప్లై చైన్ దెబ్బతిని, ఆర్థిక వ్యవస్థలకు లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని నిపుణులు చెబుతున్నారు. మనిషి సృష్టిస్తున్న వాతావరణ మార్పులకు, ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడే ఈ ఎల్ నినో కలిస్తే ఎలాంటి విపత్తులు వస్తాయోనని శాస్త్రవేత్తలు భయపడుతున్నారు. ఈ ఎల్ నినో దెబ్బకి వచ్చే 2027 సంవత్సరం చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది.

## నీట్ రీ ఎగ్జామ్‌లో మార్పులు



వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న నీట్ రీ ఎగ్జామ్ 2026లో జాతీయ పరీక్షల సంస్థ-చీూా కొన్ని మార్పులు చేసింది. ఈ నెల 21న దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష జరగనుండగా విద్యార్థుల సౌకర్యార్థం సమయాన్ని మరో 15 నిమిషాలు పొడిగించింది. ఈ నెల 21 మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల 15 నిమిషాల వరకూ పరీక్ష జరుగుతుందని చీూా ప్రకటించింది. మొత్తంగా ఈ పరీక్ష 195 నిమిషాల పాటు జరగనుంది. పరీక్ష ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఇన్విజిలేషన్ ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని తెలిపింది. అభ్యర్థుల నుంచి గత కొన్నేళ్లుగా వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ మార్పులు చేశామని చీూా తెలిపింది. రఫ్ వర్క్ కోసం ఇచ్చే పేజీలను రెట్టింపు చేసినట్లు వెల్లడించింది. ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్ వర్క్ కోసం ఇప్పటివరకూ రెండు పేజీలు ఇస్తుండగా ఈసారి 4 పేజీలు ఇవ్వనున్నట్లు చీూా పేర్కొంది. ఎడమచేతి వాటం ఉన్న విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రశ్నపత్రం మొదట్లో, చివరిలో రెండేసి రఫ్ పేపర్లను ఏర్పాటు చేసినట్లు వివరించింది. గతంలో, రఫ్ వర్క్ పేజీలు కేవలం ప్రశ్నపత్రం బుక్‌లెట్ చివరలో మాత్రమే ఉండేవి. సవరించిన విధానం ప్రకారం, సూచనల పేజీ తర్వాత వెంటనే రెండు రఫ్ వర్క్ పేజీలు ఉంటాయి, అలాగే మరో రెండు అదనపు పేజీలు బుక్‌లెట్ చివరలో ఉంటాయి. ఈ కొత్త విధానం ప్రశ్నపత్రం ఇంగ్లీష్, ప్రాంతీయ భాషా వెర్షన్లు రెండింటిలోనూ ప్రవేశపెట్టారు.

“పరీక్ష ప్రారంభం, ముగింపులో ఉండే ఇన్విజిలేషన్ ప్రక్రియ (ఉదాహరణకు సంతకాలు చేయడం వంటివి) తమ అసలు పని సమయాన్ని తగ్గిస్తున్నాయని అభ్యర్థులు గతంలో భావించేవారు. ఆ సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకునేలా సమయ వ్యవధిని రూపొందించాం. ఈ ప్రక్రియలతో సహా మొత్తం సమయాన్ని 195 నిమిషాలుగా నిర్ణయించాం. అభ్యర్థులు లెక్కలు, విశ్లేషణలు చేసుకోవడానికి వీలుగా ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్-వర్క్ కోసం కేటాయించిన పేజీల సంఖ్యను రెండు పేజీల నుంచి నాలుగు పేజీలకు పెంచాం. ఇప్పుడు బుక్‌లెట్‌లో ముందు, వెనుక భాగాల్లో రఫ్-వర్క్ పేజీలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ప్రతి అభ్యర్థి సౌకర్యవంతంగా పరీక్ష రాయవచ్చు. ముఖ్యంగా మొత్తం అభ్యర్థుల్లో దాదాపు 10శాతం మంది ఉండే ఎడమ చేతి వాటం అభ్యర్థులకు ఇది ఎంతో సహాయపడుతుంది.” “పరీక్షా విధానంలో చేసే చిన్న, ఆలోచనాత్మకమైన మార్పులు కూడా అత్యంత కీలకమైన పరీక్షా సమయంలో అభ్యర్థి సౌకర్యంలో గణనీయమైన మార్పును తీసుకురాగలవు. చీజుజు (ఖ+) 2026 పరీక్షను పారదర్శకంగా, సురక్షితంగా అభ్యర్థులకు అనుకూలమైన రీతిలో నిర్వహించడానికి, అలాగే ఈ పరీక్షకు హాజరయ్యే లక్షలాది మంది ఆశావహుల కోసం పరీక్షా విధానాన్ని నిరంతరం మెరుగుపరచడానికి తమకున్న నిబద్ధతను చీూా పునరుద్ఘాటించింది.” అని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రతి సంవత్సరం పరీక్షకు హాజరయ్యే లక్షలాది మంది ఆశావహుల కోసం పరీక్షా అనుభవాన్ని మెరుగుపరచడం కొనసాగిస్తామని ఏజెన్సీ చెప్పింది. వాస్తవానికి మే 3న నీట్ జరగ్గా పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం సృష్టించింది. దీంతో ఎన్‌టీఏ పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా దానిని రద్దుచేసి, జూన్ 21న మళ్లీ నిర్వహిస్తోంది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137